నవంబర్, 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 9 పేజీలు: 64 వెల: రూ. 20/-




## రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదలు-ఆదుకున్న ప్రభుత్వం





స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 10

నవంబర్, 2009

ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)
**బ్రిగేడియర్ డి.వి. రావు**
**మహమ్మద్ తకీయుద్దీన్**
**ఎమ్.ఎ. కుమార రాజా**
**హెచ్. కూర్మారావు**
**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**
**ఎన్. విజయ కుమార్**
**బి. నరేంద్రనాథ్ రావు**
**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**
**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**
**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**
**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ
ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2
న కార్తీకసమో మాసః ........ 3
కనీ వినీ ఎరుగని కృష్ణా వరదలు ........ 4
విపత్తుల నిర్వహణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ........ 8
మమకారం ........ 12
పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయి ? ........ 15
కాకి పడగలోళ్లు........ 20
'పీసా' చట్టం ద్వారా షెడ్యూలు ప్రాంతాలలో గ్రామ సభలకు అధికారాలు బదలాయింపు........ 22
కలియుగ భీములు ........ 25
కొలాముల జీవితంలో వెలుగు నింపిన వెదురు ........ 29
16వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం ........ 32
మన పంచాయితీరాజ్ వ్యవస్థ – తొలి జ్ఞాపకాలు ........ 36
త్యాగమయ జీవనం బక్రీద్ ప్రబోధం........ 39
మానవ హక్కుల ఉద్యమాల మహానేత డాక్టర్. కె. బాలగోపాల్........ 41
స్థానిక స్వపరిపాలనా పితామహుడు-లార్డ్ రిప్పన్ ........ 43
హాస వికాసం........ 45
ఆంధ్రప్రదేశ్‌లో 50 సంవత్సరాల పంచాయతీరాజ్ పాలన – అధిగమించవలసిన సవాళ్ళు ........ 47
'ముక్కోటాంధ్రుల మొక్కులు చెల్లగ' అవతరించిన ఆంధ్రప్రదేశ్........ 52
వార్తల్లో 'అపార్డ్' ........ 55
మహనీయుల చతురోక్తులు ........ 56
మన గ్రామీణం ........ 57
మామిడి కొత్త చిగుళ్ళపై చీడపీడలు ఆశిస్తాయి ........ 61
పీలికా పాఠవం ........ 63
నవంబర్ 1 నుంచి 'వై.యస్.ఆర్. అభయహస్తం'........ 64

## సంపాదకీయం..

# వరదల విపత్తు - ఆదుకున్న ప్రభుత్వాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక జిల్లాలు అక్టోబర్ 2న వచ్చిపడిన వరదలతో అల్లల్లాడిపోయాయి. రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడంతో అనేక నగరాలు, పట్టణాలు, వేలాది గ్రామాలు జలప్రళయంలో చిక్కుకుని కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. 70 మంది వరకు ప్రాణాలు పోగొట్టుకోగా, వేల మూగజీవాలు అసువులు బాసాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. కృష్ణా, గుంటూరు, కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో సంభవించిన వరదల వల్ల 12,000 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లింది. ఆస్తి నష్టం, పంట నష్టంతో పాటు, మౌలిక సదుపాయాలకు భారీస్థాయిలో నష్టం కలిగింది.

ఎగువన ఉన్న రాష్ట్రాలలో భారీగా వర్షాలు పడటంతో, కృష్ణా, తుంగభద్ర, హంద్రీ తదితర నదులు మహోగ్రరూపం దాల్చి, నగరాలు, పట్టణాలు, గ్రామాలపై విరుచుకుపడ్డాయి. కర్నూలు నగరం ఆనవాళ్లే మారిపోయి, జల దిగ్బంధంలో చిక్కుకుంది. కర్నూలు నగరంలోని దాదాపు 40 కాలనీలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. హంద్రీనది వరదకు తోడు శ్రీశైలం బ్యాక్‌వాటర్ ముంచెత్తడంతో నగరం కోలుకోలేని విధంగా దెబ్బతింది.

తుంగభద్ర నదీతీరంలోని మంత్రాలయం, నందవరం, సి. బెళగల్, కల్లూరు, కొత్తపల్లి, ఆత్మకూరు, నంద్యాల మండలాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. 7వ నెంబర్ జాతీయ రహదారి పూర్తిగా తెగిపోయి, నాలుగైదు రోజులపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. కుందూనది ప్రవాహంతో కడప జిల్లాలోని అనేక ప్రాంతాలు వరదనీటిలో మునిగిపోయాయి. కృష్ణా, తుంగభద్ర నదుల ఉగ్రరూపంతో మహబూబ్‌నగర్ జిల్లా, నల్గొండ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో భారీనష్టం సంభవించింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల సామర్థ్యానికి మించి లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరటంతో ప్రకాశం బ్యారేజికి వరద ప్రవాహం పోటెత్తింది. దాంతో కృష్ణానది చుట్టుప్రక్కల ఉన్న లోతట్టు ప్రాంతాలు, విజయవాడ నగరం, తదితర ప్రాంతాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయాయి.

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో వచ్చిపడిన వరదలకు కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలను ఆదుకున్నాయి. ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ రాష్ట్రానికి వచ్చి, వరద ప్రాంతాలలో ఏరియల్ సర్వే చేశారు. ఇది జాతీయ విపత్తేనని ప్రకటించి, తక్షణ సహాయంగా 1000 కోట్ల రూపాయల సహాయాన్ని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రాష్ట్రాన్ని ఆదుకుంటుందని ప్రకటించారు. యూపిఏ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ కూడా రాష్ట్రానికి వచ్చి, ఏరియల్ సర్వే చేశారు. కేంద్రం అండగా ఉంటుందని, సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆమె హామీ ఇచ్చారు.

ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య అయితే, వరదలు వచ్చిన సమయంలో రెండురోజుల పాటు ఇంటికి కూడా వెళ్లకుండా రాత్రింబవళ్లు సచివాలయంలోనే గడిపారు. రాష్ట్ర యంత్రాంగం వరదలను ఎదుర్కొని, పరిస్థితిని త్వరగా సాధారణస్థితికి తీసుకుని రావటంలో ముఖ్యమంత్రి చూపిన చొరవ అందరి ప్రశంసలను అందుకుంది. విషమ పరిస్థితిని తట్టుకుని అధికార యంత్రాంగాన్ని ఒక్కత్రాటిపై నడపటంలో ఆయన కృతకృత్యులయ్యారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు తీసుకున్న సహాయక చర్యలు ఆదర్శనీయమని ప్రధాని, యుపిఏ అధ్యక్షురాలు కూడా ప్రశంసలు కురిపించారు.

ప్రజలు కూడా తమ వంతుగా వరదలు వచ్చే పరిస్థితి నెలకొని ఉన్నప్పుడు అందుకు సంసిద్ధంగా ఉండాలి. దీని వల్ల, ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఎత్తయిన ప్రాంతాలు, సురక్షిత ప్రాంతాల గురించి ముందుగానే సమాచారం తెలుసుకుని, అవగాహనతో మెలగాలి. ఇతరత్రా పాటించవలసిన జాగ్రత్తలను గురించి కూడా తెలుసుకుని ఉండాలి. ప్రభుత్వం, ప్రజలు అన్నివిధాలా జాగ్రత్తలు తీసుకుంటూ, పరస్పర సమన్వయంతో మెలగడం వల్ల, వరదలను సమర్థవంతంగా ఎదుర్కోగలం.



# న కార్తికసమో మాసః

## కార్తిక మాసానికి మించిన మాసం లేదు

కృత్తికా నక్షత్రం ఏ నెలలోని పూర్ణిమనాడు ఉంటే ఆ నెలకి కార్తికమని పేరు. కార్తికంలో రెండవరోజుని 'భ్రాతృ ద్వితీయ' అంటారు. అంటే ప్రతి తమ్ముడూ లేదా అన్న తన అక్క లేదా చెల్లెలి యింటికి వెళ్లి ఆమె చేతి భోజనాన్ని తిని అక్కకి లేదా చెల్లెలికి చక్కని వస్త్రాలని పెట్టి అక్క అయితే ఆమె నుండి ఆశీస్సుల్ని పొంది, చెల్లెలయితే ఆమెకి ఆశీస్సుల్నీ ఇయ్యాలి.

దీని ద్వారా అక్క లేదా చెల్లెళ్ల సంసారం ఎలా ఉందో ఆ విషయం తెలిసే అవకాశముంటుంది. జ్యేష్ఠం పితృసమో మతః' అంటారు కాబట్టి నాన్న తర్వాత నాన్నంతటివాడు పెద్దకొడుకే అయ్యే కారణంగా ఇక్కడ అక్క లేదా చెల్లెలి సంసారం తీరుతెన్నుల విషయాన్ని నాన్నకి చేర్చవలసిన బాధ్యత కలవాడు సోదరుడన్నమాట. ఆ బాధ్యతని నిర్వర్తించుకునే రోజు కార్తికంలోని రెండవరోజు (విదియ).

కార్తికంలో నాల్గవరోజుని 'నాగులచవితి' అంటారు. సర్పాలని పూజించే సంప్రదాయం మనకుంది కాబట్టి ఈ రోజున పాములకి పుట్టవద్దకి పాలు వెళ్లిపోయాలి. పాముల్ని కూడా పూజించడమా? అనుకోకూడదు. పాములనేవి వ్యక్తుల సంస్కారానికి సంకేతం. కాబట్టి పాముల్ని పూజించడమంటే పాముల్లా హాని చేసే వారిని కూడ తగినంతలో గౌరవించడాన్నే చెయ్యాలని దీని భావం. ఒక కళాశాల గాని ఒక కార్యాలయం గాని ఒక సంస్థ గాని. . . ఇలా ఏ ప్రజా సమూహమున్నా అందరూ ఒక్కలా ఉండరు. వాళ్లలో కొందరు మరోతీరు మనస్తత్వంతో ఉన్నా అధికారి అయినవాడు సర్దుకుపోతూ ఉండాలనే ఓ విశేషాన్ని ఈ పండుగ మనకి బోధిస్తుంది.

కార్తికమాసంలో ఎనిమిదవ రోజుని 'గోష్ఠాష్టమి' అంటారు. గోష్ఠమంటే ఆవులన్నింటినీ ఉంచే ఓ గోశాల. అక్కడ ఉండే ఆవులన్నింటినీ చక్కగా కడిగి తుడిచి ముఖానికి కుంకుమని అద్ది శరీరానికి చక్కని మువ్వలని, కంఠానికి గంటలని అమర్చి అది ఆనందపడేలా (మనం దాన్ని తాకుతూ అలంకరిస్తూంటే అలంకారాల విలువ దానికి తెలియకపోయినా యజమాని చేతిస్పర్శ, శరీరస్పర్శ, తనతో కొంతకాలం గడుపుతూ ఉండడమే దానికి ఆనందం) చేయాలి. అంతేకాదు ఊళ్లో ఉన్న గోవులన్నింటినీ ఇలా అలంకరించి ఊరంతా ఊరేగింపుగా తిప్పడమనేది ఊరికి చాలా శుభప్రదం. ఎవరికీ హానిని తలపెట్టని వాటికి, జాతికి పశువులే అయినా ఇంతటి గౌరవముంటుందనే యదార్థం దీని ద్వారా తెలుస్తుంది.

కార్తిక శుద్ధ ఏకాదశి (11వ రోజు) నాడు యోగనిద్ర నుండి శ్రీహరి మేల్కొంటాడు. ఆషాఢ ఏకాదశినాడు యోగనిద్రకి ఉపక్రమించిన శ్రీహరి నేడు నిద్ర నుండి లేస్తాడు. అందుకే ఈ రోజుని 'ఉత్థాన ఏకాదశి' అని పిలుస్తారు. ఈ రోజున శ్రీహరిని ధ్యానిస్తూ శ్రీ విష్ణు సహస్రనామాలని పఠించాలి. లక్ష్మీదేవికి ఇష్టమైన పాయసాన్ని ఆరగించాలి నైవేద్యం పెట్టి.

కార్తిక ద్వాదశి (12వ రోజు)ని క్షీరాబ్ధి ద్వాదశిగా చెప్తారు. యోగనిద్ర నుండి మేల్కొంచిన శ్రీహరి తన మామగారైన సముద్రం నుండి మెల్లగా కన్నుల్ని విప్పి అందరికీ దర్శనాన్నిస్తాడు. ఆ సమయంలో సకల దేవతలు సిద్ధులు సాధ్యులు ఇంకా దేవలోకంలో ఉండే మహాజన పరివారమంతా ఆయన దర్శనానికి వస్తారు. ఈ రోజు ఉదయాన కూడ చక్కగా స్నానాన్ని చేసి శ్రీవిష్ణు సహస్రనామాలని పఠించడం చేస్తే ఆ దర్శనాన్ని చేసిన పరివారంలో మనం కూడ ఒకరుగా అయ్యే పుణ్యాన్ని అందిస్తాడట శ్రీహరి.

కార్తిక పూర్ణిమనాడు శంకరుణ్ణీ, శ్రీహరినీ కలిపి ఆరాధిస్తాడు. ఆ రోజు రాత్రి శివాలయాల్లో 'జ్వాలా తోరణ' మనే ఉత్సవాన్ని చేస్తారు. కార్తికమాసం ఏ కృత్తికా నక్షత్రంలో ఏర్పడిందో ఆ కృత్తిక అనేది అగ్నినక్షత్రం. పూర్ణిమ అనేది చల్లగా ఉంచే శక్తి కలిగినది. ఈ చలీ, వేడిమీ కలిసిన రోజు కార్తికపూర్ణిమ. ఈ రోజునే శంకరుడు హాలాహలాన్ని మింగాడనీ, ఆ కారణంగానే ఆయన నీలకంఠుడయ్యాడనీ చెప్తాయి పురాణాలు. శివాభిషేకాన్ని, శ్రీ విష్ణు సహస్రనామాలని చేయవలసిన రోజు ఇది.

కార్తికం దాటిన మరురోజున శ్రీహరిని పూజించవలసిన మార్గశీర్ష మాసం వస్తుంది. శివకేశవులకి భేదం లేదని - కార్తికపూర్ణిమ, క్షీరాబ్ధి ద్వాదశి అనేవి ఈ నెలలో వచ్చిన పండుగలుగా కన్పిస్తూ నిరూపిస్తాయి. ఈ నెల పొడుగునా ఉదయాన్నే (తగిన ఆరోగ్యం ఉన్నవారు మాత్రమే) స్నానాలని చేసి పగలంతా ఉపవసించి రాత్రికి భోజనాన్ని చేయాలి. అది ఆరోగ్యప్రదం కూడ.

– మైలవరపు శ్రీనివాసరావు



# కనీ వినీ ఎరుగని కృష్ణా వరదలు



మన రాష్ట్రంలో ఈ సంవత్సరం జూన్-సెప్టెంబర్ కాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం 981 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. అయితే ఉన్నట్టుండి కృష్ణానదికి వంద సంవత్సరాలలో కనీవినీ ఎరుగని వరదలు రావటంతో కర్నూలు, మహబూబ్‌నగర్, కృష్ణా జిల్లాల్లో చాలా ప్రాంతాలు, నల్గొండ జిల్లాలో కొన్ని ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయి. దీన్నే ప్రకృతి వైపరీత్యం అంటారు.

సెప్టెంబర్ ఆఖరు వారం, అక్టోబర్ మొదటి వారంలో కృష్ణా, తుంగభద్ర పరీవాహిక ప్రాంతాలలో కుండపోతగా కురిసిన వానల (ఒక రోజులో 30 సెంటీమీటర్లు) కారణంగా జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్, సుంకేసుల, ప్రకాశం బ్యారేజీలలో గరిష్ఠ స్థాయికి మించి నీరు చేరుకుంది. కర్ణాటక ప్రాంతంలోని ఆలమట్టి డ్యామ్ కూడా నిండింది. శ్రీశైలం డ్యాముకు అయితే 25 లక్షల ఘనపు సెంటీమీటర్ల నీరు చేరుతుంటే దాంట్లో సగం కంటే నీరు వదలలేని పరిస్థితి నెలకొంది. అన్ని గేట్లు పూర్తిగా తెరిచినా సరే ఇదే పరిస్థితి. పర్యవసానంగా కర్నూలు, ఆలంపూర్, మంత్రాలయం పూర్తిగా జలమయం అయ్యాయి. ఇంకా చాలా ప్రాంతాలు ముంపునకు గురిఅయ్యాయి. కుందూ నది పొంగి నంద్యాల పట్టణం జలమయం అయ్యింది. జన జీవనం అస్తవ్యస్థం అయ్యింది.

వరదల పర్యవసానంగా 498 గ్రామాలలో 15 లక్షలమంది ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అయ్యారు. అయితే వీరిలో 5.11 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తే, 2.95 లక్షల మందిని 341 పునరావాస కేంద్రాలలో చేర్చారు. వరద సహాయక చర్యల్లో భాగంగా 8 హెలికాప్టర్లు, 742 మంది ఆర్మీజవాన్లు, 165 జాతీయ విపత్తు స్పందన బలగాలు, 1173 గజ ఈతగాళ్ళు, 377 మరపడవలు విరామం లేకుండా పనిచేయటం జరిగింది. ఇది వంద సంవత్సరాలలో కనీవినీ ఎరుగని వరద అని శాస్త్రజ్ఞులు తెలియచేసారు.

సుమారు 90 మంది ప్రజలు, 39,146 పశువులు చనిపోగా, 2.13 లక్షల ఇళ్ళకు నష్టం వాటిల్లిందని అంచనా. వ్యవసాయ రంగంలో రూ. 1050 కోట్లు, పశుసంవర్థక రంగంలో రూ. 275 కోట్లు, మత్స్య రంగంలో 100 కోట్లు, గృహరంగంలో రూ. 300 కోట్లు నష్టం వాటిల్లగా, ఎన్నో ప్రభుత్వ ఆస్థులు కూడా దెబ్బతిన్నాయి. పాఠశాలలు, ఆసుపత్రులు కూడా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం వరదల వల్ల నష్టం రూ. 12,255 కోట్లు ఉంటుందని పేర్కొనటం జరిగింది. యు.పి.ఏ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ, ప్రధాన మంత్రి శ్రీ మన్‌మోహన్ సింగ్ వరద ప్రాంతాలను సర్వే చేసారు. వెంటనే రూ.1000 కోట్ల సహాయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి వరద ప్రాంతాలను సందర్శించి, బాధితులను పరామర్శించి సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.

ఈ సహాయక చర్యలలో భాగంగా పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళకు రూ.









5000/-, బాగా దెబతిన్న ఇళ్ళకు రూ. 4000/- ప్రభుత్వం అందచేయటమే కాకుండా బాధిత కుటుంబాలకు వంట పాత్రలకు, కట్టుబట్టలకు రూ.1500 చొప్పున మంజూరు చేయటం జరిగినది.

వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి మూడు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడమైనది. ఇళ్ళు కోల్పోయిన వారికి ఐ.ఏ.వై పథకం క్రింద ఎత్తైన ప్రదేశాలలో ఇళ్ళు కట్టించడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

## వరద విపత్తు అంటే ఏమిటి?

నిత్య జీవితాన్ని ఆటంకపరిచే నీటి మట్టాన్ని మనం వరద విపత్తు అనవచ్చును. ఇది భారీ వర్షం, ఉప్పెనల వలన సంభవించవచ్చును.

మన దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు నైరుతి రుతుపవనాల వలన వర్షాలు వస్తాయి. ఈ వర్షాకాలంలో చిన్న చిన్న వరదలు వస్తాయి. అటువంటివి ఆయా ప్రాంతాలకే పరిమితం అవుతాయి. కొన్ని రోజులే ఇబ్బంది ఉంటుంది. ఆయా ప్రాంతాల వారు ఇటువంటి వరదలు ఇంతకు ముందు కూడా చూసారు కాబట్టి, తగు జాగ్రత్తలు తీసుకుంటారు. అధికార యంత్రాంగం కూడా 'వరదల మాన్యువల్' ప్రకారం తీసుకోవలసిన చర్యలు (అంటే వరద ముందు, వరదలప్పుడు, వరదల తరువాత) చేపడతారు. అకాల వర్షాలు, కుంభవృష్టి, అన్ని నదీ పరివాహక ప్రాంతాలలో ఒకేసారి వర్షాలు వచ్చినప్పుడు, ఉప్పెనలు వచ్చినప్పుడు ఉధృతంగా వరదలు వస్తాయి. నదులు, చెరువులు, కాలవలకు గండ్లు పడి వరదనీరు లోతట్టు ప్రాంతాలను ముంచేస్తుంది. ప్రజలు, పశువులు, పంటలు, ఇళ్ళు మొదలైనవి నష్టానికి గురిఅవుతాయి. చుట్టూ నీరున్నా, త్రాగేందుకు నీరు ఉండదు. ఆహార పదార్థాలు అన్నీ పాడైపోయి చాలా ఇబ్బందులకు లోనవుతారు. అడవులు నరకటం, నదీ తీరాల ఆక్రమణ వంటి మానవ తప్పిదాలు కూడా వరదలకు కారణమవుతాయి.

అడవులు నరికివేయడం వల్ల బోడికొండలపై నుంచి నీరు చాలా వేగంగా వస్తుంది. వర్షపునీరు ఇంకదు. భూసారం కొట్టుకుపోయి నదీ పరీవాహక ప్రాంతంలో మేటలు వేస్తాయి. వ్యవసాయం కోసం నది ఒడ్డు చెరువులు ఆక్రమించటం, ఇళ్ళు కట్టుకోవటం లాంటివి చేయటం వల్ల ఈ ప్రాంతాలు సహజంగా ముంపునకు గురి అవుతాయి. వర్షపు నీరు పోకుండా వేరే అడ్డంకులు ఉన్నా కూడా ఇబ్బందే. ఏదైనా ఒక ప్రాంతంలో సరిపడ్డ దానికంటే వర్షం పడిదంటే వరద వస్తుందని ముందుగానే ఊహించాలి.

## వరదల్లో రకాలు

### నదులవల్ల వరదలు

హిమాలయాల్లో మంచు కరిగి ఒక్కసారి దిగువ ప్రాంతాల్లోని నదుల్లోకి చాలా ఎక్కువగా నీరు ప్రవహించినప్పుడు వరదలు వస్తాయి. అయితే సామాన్యంగా నదీ పరీవాహక ప్రాంతాలలో ఒకేసారి చాలా ఎక్కువగా, చాలా తక్కువ సమయంలో (ఒక్కొక్కసారి ఒకే రోజులో) వర్షాలు పడడం వల్ల వరదలు వస్తాయి.

### తీర ప్రాంతంలో వరదలు

ఒక్కొక్కసారి తుఫానులు, ఉప్పెనలు, సునామీ లాంటివి సంభవించినప్పుడు సముద్రంలో ఎంతో ఎత్తు కెరటాలు వచ్చి సముద్రతీర ప్రాంతాలను ముంచెత్తుతాయి.

### పట్టణ ప్రాంతంలో వరదలు

పట్టణీకరణలో భాగంగా మామూలు భూములు కాంక్రీటు అడవులుగా మారుతాయి. సిమెంటు, తారురోడ్లు, పార్కింగు స్థలాలు లాంటివి ఎక్కువ భాగంలో ఉండడం వలన నీరు ఇంకడం తగ్గుతుంది. మామూలుగా కంటే రెండు నుంచి ఆరు వంతులు మాత్రమే నీరు ఇంకుతుంది. రోడ్లు చెరువులు అవుతాయి. చెరువులు ఆక్రమించి కాలనీలు కట్టడం వల్ల ఆయా కాలనీల్లోకి వరదనీరు ప్రవేశిస్తుంది. డ్రైనేజ వ్యవస్థ నిర్వహణ సరిగా లేకపోవటం, కాలవల్లో చెత్త, చెదారం లాంటివి వేయటం, కాలవఒడ్డును ఆక్రమించటం లాంటివి నీటి ప్రవాహానికి అడ్డంకులు అవుతాయి. దాని వల్ల ప్రక్క ప్రాంతాలు జలమయమవుతాయి. అకస్మాత్తుగా వచ్చే వర్షం, అధిక వర్షపాతం వల్ల కూడా పట్టణ ప్రాంతంలో రోడ్లు నదులను మరిపిస్తాయి.

## వరదల వల్ల నష్టాలు

వరదల వల్ల ఇళ్ళు లాంటివి కొట్టుకుపోవటం, తేలిపోవటం, మునిగిపోవటం, జంతువులు చనిపోవటం, చెట్లు పడిపోయి కొట్టుకుపోవటం లాంటివి జరుగుతుంది. పాములు, తేళ్ళు లాంటివి పైకి రావటం వల్ల ప్రజలు వాటి బారినపడే అవకాశాలు ఎక్కువ. నీరు కలుషితం అవుతుంది. కాబట్టి అవి తాగిన వారికి విరోచనాలు, అతిసారం, కలరా లాంటివి వస్తాయి. నిలవ నీరు వల్ల దోమలు ఎక్కువై మలేరియా సంభవిస్తుంది. బావులు, చెరువులు, చేతిపంపులు లోని నీరు కూడా కలుషితం అవుతుంది. సముద్రతీర ప్రాంతంలో అయితే ఉప్పు నీరు కూడా చేరుతుంది. అందువల్ల చాలా రోజులు సురక్షితమైన నీరు దొరకదు. ఆహార ధాన్యాల కొరత, వంట చేసుకునేందుకు సౌకర్యం లేకపోవటం, బురద పేరుకుపోవటం, బట్టలన్నీ పోవటంకాని, తడిసిపోవటం జరిగితే- ఉన్నవారు, లేని వారు ఒకే విధంగా నిరాశ్రయులు అవుతారు. రోడ్లు, బ్రిడ్జిలు లాంటివి కొట్టుకుపోయి రవాణా సౌకర్యాలు ఆగిపోతాయి. జల దిగ్బంధంలో ప్రజలు ఉండిపోతారు. చీకటి పడిన తరువాత మరీ భయంకరం. కరెంటు తీసివేయకపోతే ఎవరికైనా షాక్ కొట్టే అవకాశాలు ఎక్కువ. అందువల్ల కరెంటు తీసివేయక తప్పదు. చీకటిలో ఏమి జరుగుతుందో తెలియదు. ఇటువంటి మానసిక పరిస్థితుల్లో ప్రజలు మనోస్థైర్యాలను కోల్పోకుండా ఉండేందుకు ప్రభుత్వం, పంచాయితీలు, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేకంగా పనిచేయాలి.

## వరద నష్టాలకు తోడ్పడే కారణాలు

లోతట్టు ప్రాంతాలు, వరదల గురించి అవగాహన లేకపోవటం, లేక సమాచారం లేకపోవటం, నీరు తక్కువగా ఇంకే భూమి లక్షణం, గట్టి పునాదులు లేని ఇళ్ళు, కట్టడాలు, జాగ్రత్తగా నిలువచేయని ఆహార పదార్థాలు, కోతకు వచ్చిన పంటలు, పశువులు, వరద నీటిలో కరిగిపోయే మట్టి కట్టడాలు లాంటివి ప్రమాదాలకు తొందరగా లోనౌతాయి.

## వరద సంసిద్ధత

వరద సంసిద్ధత వల్ల ప్రాణ, ఆస్థి నష్టాలను చాలా తగ్గించవచ్చు. ముందస్తు ప్రణాళిక వల్ల ప్రజలకు ఇబ్బంది తగ్గించవచ్చు. భారీ వర్షాలు, వరదలు గురించి ముందే తెలుసుకోవటం చాలా ముఖ్యం. ఇప్పుడు సమాచారం తెలుసుకోవటం, ఇతరులకు అందచేయటం చాలా సులభం. టి.వి.లు, రేడియోలు, వార్తాపత్రికలు లాంటివి ఇటువంటి















సమాచారాన్ని తాజాగా ఇస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తాయి. విపత్తు సంభవిస్తే ప్రజలు చేరుకోవలసిన సురక్షిత ప్రాంతాలను కూడా గుర్తించి తెలియచేస్తారు. తుఫాను సురక్షిత కేంద్రాలు కూడా తీర ప్రాంతంలో ఉన్నాయి. కరకట్టలు కొట్టుకుపోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా చేపట్టాలి. ఇళ్ళు, కట్టడాలు కట్టుదిట్టం చేసుకోవాలి. ఈ సంసిద్ధత వ్యక్తిగత, సమాజ, ప్రభుత్వ స్థాయిలలో ఉన్నట్లయితే వరదల వలన కలిగే నష్టాలను తగ్గించుకొనవచ్చును. వ్యక్తిగత కుటుంబ స్థాయిలలో తీసుకొనే చర్యలలో భాగంగా ఈ క్రింది పేర్కొన్న చర్యలు తీసుకోవచ్చు.

## వరద ముందు, వరద సమయంలో, తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలు

వరదవస్తే, ఎత్తయిన సురక్షిత ప్రాంతాలకు వెళ్ళే మార్గం గురించి ముందరే తెలుసుకోవాలి. అప్పటికప్పుడు వెతుక్కుని పరిగెట్టడం చాలా కష్టం. మందులతో కూడిన ప్రాథమిక చికిత్స డబ్బా, ముఖ్యంగా విరోచనాలు, పాము కాటు లాంటి వాటికి కావలసిన మందులతో తయారుగా ఉండాలి. గట్టి మోకు తాళ్ళు తయారుగా ఉంచుకోవాలి. ట్రాన్సిస్టర్, బ్యాటీరీలైటు, కొన్ని విడిబ్యాటరీలు, మంచినీరు, త్వరగా పాడవని ఆహారం, అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు, కిరోసిన్, గొడుగులు, వెదురుబొంగులు లాంటివి ఎత్తైన సురక్షిత ప్రాంతంలో ముందుగానే ఉంచుకోవాలి. రేడియో, టి.వి., స్థానిక అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని ఇతరులకు అందచేయాలి. ఒకవేళ మీరు నివశిస్తున్న ప్రదేశం ఖాళీ చెయ్యవలసివస్తే, కావలసిన బట్టలు, మందులు, విలువైన వస్తువులు (ఆభరణాలు ముఖ్యంగా) సర్దుకొని తయారుగా ఉండాలి. ఇంట్లో సామాను అటక మీదకు కాని, కిటికీ గూట్లోకి కాని ఎక్కించాలి. ఇంతకు ముందు, మీప్రదేశంలో వరద వచ్చి ఉంటే, అప్పటి నీటి స్థాయి కంటే ఎత్తున సామాను ఉంచాలి. లోతు తెలియని నీళ్ళల్లోకి వెళ్ళకండి.

వరద వచ్చిన తరువాత కాచిన నీళ్ళనే తాగాలి. నీటిని శుభ్రపరిచే బిళ్ళను వాడాలి. ఆహార పదార్థాల మీద ఈగలు వాలకుండా, పురుగులు, చీమలు చేరకుండా దుమ్ముపడకుండా జాగ్రత్తపడాలి. చిన్న పిల్లలను ఖాళీ కడుపుతో ఉంచవద్దు. బ్లీచింగ్ పౌడర్, సున్నంలాంటి వాటిని వాడి పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. మోకాలు దాటిన లోతు నీళ్ళ జోలికి పోవద్దు. కాళ్ళకు చెప్పులు లేకుండా తిరగవద్దు.

వరద నీరు తీసిన తరువాత కూడా రేడియో వింటూండండి. కాలవలు, తడిసిన బ్రిడ్జిలు, కూలిన కరెంటు స్థంభాలు, తెగిన తీగల దగ్గరకు వెళ్ళవద్దు. అక్కడ పిల్లలను ఆడుకోనివ్వద్దు. వరద నీటితో తడిసిన ఆహారపదార్థాల తినవద్దు. నీటిని శుద్ధి చేసే మాత్రలు వేసిన నీళ్ళు త్రాగండి.

అన్నిటి కంటే ముఖ్యం నాయకత్వం. సమాజసేవా దృక్పథంతో చేసే స్థానిక నాయకత్వం ప్రజల్ని కాపాడుతుంది. యువకులు ముందుకు వచ్చి వృద్ధులు, నడవలేనివారు, కంటిచూపు లేనివారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మానవసేవే, మాధవసేవ అన్నమాట ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

**పి.వెంకటలక్ష్మి,** ఫ్యాకల్టీ మెంబర్, (సి.యం.ఇ.డి.), అపార్డ్



# విపత్తుల నిర్వహణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర

ప్రకృతి వైపరీత్యాలు భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టంతో పాటు పర్యావరణానికి కూడా నష్టం కలిగిస్తాయి. అందుచేతనే వాటిని ప్రకృతి వైపరీత్యాలు అంటాం. వీటివల్ల ముఖ్యంగా సమాజంలో వ్యక్తిగత ఆస్తులకు, ఉమ్మడి ఆస్తులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టాలు కలుగుతాయి, ప్రాణనష్టం, మౌలికసదుపాయాలు, భవనాలకు జరిగే నష్టంతోపాటు పర్యావరణం ధ్వంసం కావటం కూడా ప్రత్యక్ష నష్టాల కిందకురాగా, పబ్లిక్ సర్వీసులు, సదుపాయాలు, మాస్‌మీడియా, వాణిజ్యం - పరిశ్రమలకు జరిగే విధ్వంసాలు పరోక్ష నష్టాల కిందకు వస్తాయి.

సాధారణంగా ప్రకృతి వైపరీత్యాలను నిరోధించటం బ్రహ్మతరం కూడా కాదు. కాకపోతే కొన్ని సందర్భాలలో వాటి ప్రభావాన్ని కొంతమేర అరికట్టవచ్చు. భూకంపాలు, ఉప్పెనలు, తుపానుల వంటివి ఆపటం సాధ్యంకాని విపత్తులు. కాగా వరదలు, దుర్భిక్షాలు, కొండచెరియలు విరిగిపడటం తదితర విపత్తుల విషయంలో డ్రెయినేజి, భూ స్థిరీకరణ వంటి చర్యల ద్వారా నియంత్రణకు లేదా ప్రభావం తగ్గింపునకు అవకాశం ఉంటుంది.

విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యత, సంస్థాగత సామర్థ్యాలు, నిర్వహణ మెళకువలు, అనుభవపూర్వకంగా నేర్చుకున్న పాఠాలు తదితర అంశాల మేళవింపుతో చేపట్టే, వ్యూహాల ప్రయోగంతో విపత్తుల ప్రమాదాన్ని చాలావరకు తగ్గించవచ్చు. అయితే ఒక్క ప్రభుత్వం వల్ల మాత్రమే ఈ పని కాదు. పౌరసమాజం కూడా అందుకు సహకరించాలి. ఇందుకు నిపుణమైన సంస్థలకు గల అట్టడుగుస్థాయి అనుభవం, సంస్థాగత సామర్థ్యం భాగస్వామ్య నిర్వహణ మెళకువలతో పాటుగా ఎన్ జి ఓల నుండి సమాజ ఆధారిత చర్యలను అందిపుచ్చుకుని, వాటిని తగిన రీతిలో జోడించి విపత్తు తగ్గింపునకు ప్రభుత్వం కృషిచేయాలి.

### అభివృద్ధి - విపత్తు తగ్గింపు - ఎన్‌జిఒల భాగస్వామ్య ప్రాధాన్యం

ప్రభుత్వేతర సంస్థలైన ఎన్‌జిఒలు పౌరసమాజంలోను అభివృద్ధి కార్యకలాపాలలోను చురుగ్గా పాల్గొంటాయి. కనుక విపత్తు తగ్గింపులో వాటి పాత్రకు గణనీయమైన ప్రాధాన్యత ఉంటుంది. కేంద్రీకృత నిర్మాణ వ్యవస్థ కుప్పకూలి, బహుళసంస్థల ప్రాధాన్యం పౌరసమాజ భాగస్వామ్యం విస్తరించి వాటి ప్రాబల్యం పెరగటమే ఇందుకు నిదర్శనం. ఇంతేకాక ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పెనుసవాళ్ళను ఇటు ప్రభుత్వం గానీ, అటు మార్కెటుగానీ, పూర్తిగా పరిష్కరించ లేకపోతున్నాయనేది స్పష్టంగా తెలిసిన విషయం. దీనితో గడచిన కొద్ది దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్త అభివృద్ధి ప్రక్రియలో ఎన్‌జిఒలు కీలక పాత్రధారులుగా ఆవిర్భవించాయి. సమాజాభివృద్ధి మొదలుకొని శిక్షణ విధాన పరిశోధన, అడ్వొకసీ తదితర విస్తృత పరిధి కార్యకలాపాలలో అవి నిమగ్నమై ఉన్నాయి.

సంస్థాగతంగా వాటికి గల సౌలభ్యత, లాంఛనప్రాయమైన పనితీరు, అట్టడుగుస్థాయి సమాజంతో సన్నిహిత సంబంధాల కారణంగా ప్రజలకు వారు చౌకలో సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమల పట్ల ప్రజలలో అవగాహన కల్పించి వారికి గల హక్కులు, అధికారాల పట్ల చైతన్యవంతులను చేస్తూ ప్రభుత్వానికి, సామాన్య ప్రజలకు మధ్య ఎన్‌జిఓలు వారధిగా పనిచేస్తారు. ప్రజాజీవితంలో మమేకమై పనిచేయటం చేత ప్రజాసమస్యలేమిటో వారికి స్పష్టంగా తెలుస్తాయి. అందుచేత నేడు వివిధ ప్రాంతాలలో విపత్తు స్పందనలో, రక్షణ సహాయచర్యలలో ఎన్‌జిఓలది ప్రధానపాత్ర అని చెప్పక తప్పదు. విపత్తు సందర్భాలలో అంతర్జాతీయ ఎన్‌జిఓలు మానవతా దృక్పథంతో బాధితుల ను ఆదుకునేందుకు ముందుకు వస్తాయి.

ఇటీవలి సంవత్సరాలలో విపత్తు నిర్వహణలో దక్షిణాసియా స్థానిక ఎన్‌జిఓలు కూడా కీలక భూమిక పోషించి సమర్థంగా వ్యవహరించాయి. ఇక భారతదేశంలో వేలాది ప్రాణాలను బలిగొన్న 1993 లాతూరు భూకంపం,1999 ఒరిస్సా పెనుతుఫాను, 2001 గుజరాత్ భూకంపం తదితర విపత్తుల సందర్భంగా ఎన్‌జిఓలు ముందుకువచ్చి సహాయ పునరావాస కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాయి.

### విపత్తు తగ్గింపు - ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల (జిఓ - ఎన్‌జిఓల) సహకారానికి మరింత పటిష్ఠమైన ఏర్పాటు

సమాజంతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండటమే ఎన్‌జిఓల బలం. కానీ ప్రభుత్వ సహాయం లేనిదే అవి పని చేయజాలవు. వాటికి పరిమితులు ఏర్పడతాయి, విస్తృత పరిధి ప్రయోజనాలు కలగాలంటే సూక్ష్మస్థాయిలో పటిష్ఠమైన చర్యలు అవసరం. ఇందుకు ఎన్‌జిఓలకు, ప్రభుత్వానికి మధ్య నిరంతర చర్చలు, సంప్రదింపులు జరగాలి. దీనివలన ఇరువురి నడుమ మరింత అవగాహన పెంపొంది సమయానుకూలమైన విధాన మార్పులకు మార్గం ఏర్పడి విపత్తులలో సకాలంలో స్పందించి ఉపశమన చర్యలు చేపట్టడానికి దోహదం కలుగుతుంది.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాలలో సకాల స్పందన అనేది దక్షిణాసియా దేశాలలో ఎండమావిగా మిగిలిపోతుంది. అధిక సంఖ్యాక ప్రజలు కనీస కమ్యూనికేషను సదుపాయాలు కూడా లేని మారుమూల గ్రామాలలో నివశిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. విపత్కర పరిస్థితులలో దుర్భేద్యమైన ప్రాంతాలలో దిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను చేరి పునరుద్ధరణ పనులు చేపట్టడం ఎన్‌జిఓలు తదితర బహుళసంస్థల భాగస్వామ్యంతో మాత్రమే సాధ్యం. అయితే ఈ సంస్థల మధ్య సమన్వయ లోపం వల్ల ఒకే పనిని పలువురు చేపట్టడం వంటి ఒడుదుడుకులతో అయోమయం ఏర్పడే ప్రమాదం వుంది. అందుచేత విపత్తు స్పందన ప్రక్రియలో ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థలు తగిన సమన్వయంతో వ్యవహరించి సక్రమమైన విధుల పంపకంతో ఈ పరిస్థితిని అరికట్టవచ్చు.

ప్రభుత్వ స్పందనకు అనుబంధం విపత్తుల అనంతర సందర్భాలలో ఎన్‌జిఓలు ఆయారంగాలపై ప్రధానంగా దృష్టిసారించి జీవనోపాధి, సమాజ ఆస్తుల కల్పన, మహిళాబృందాల ఏర్పాటు మొదలైన అంశాలను చేపట్టిన కారణంగా విపత్తు నుండి త్వరగా కోలుకుని సాంఘిక- ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగినట్టు ఒరిస్సాలో, భారత్‌లోని ఇతరప్రాంతాల్లో అనుభవాలు చూపుతున్నాయి. ఈ విధమైన చర్యలు పునర్నిర్మాణానికై ప్రభుత్వం చేసే కృషికి మరింత అండగా నిలుస్తాయి. అలాగే మొత్తంమీద బాధితుల ను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, ప్రత్యేకించి సామాజిక వర్గాలకు ఎన్‌జిఓలు సాయం చేయాలి. ఫలితంగా విపత్తుల నుండి కోలుకోలేని బడుగు ప్రజానీకానికి బతికి బట్టకట్టే దన్ను లభిస్తుంది.

ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రభుత్వానికి, ఎన్‌జిఓలకు మధ్య సమన్వయం లోపిస్తే విపత్తులలో చేపట్టే చర్యల ఫలితాలు అంతంత మాత్రంగా వుంటాయి. ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థల సమర్ధ సహకారంపైననే ప్రాజెక్టు అమలు విజయం ఆధారపడి వుంటుందనేది నిర్వివాదాంశం.



### ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థల మధ్య సహకారం - ఒరిస్సా అనుభవం

ఈ సందర్భంగా ఒరిస్సా ఉదంతాన్ని ప్రస్తావించాలి. ప్రస్తావనకు ముందు ఆ రాష్ట్ర సాంఘిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం గురించి చెప్పటం అవసరం. భారత్‌లోని పేద రాష్ట్రాలలో ఒకటైన ఒరిస్సా ప్రధానంగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ గల రాష్ట్రం. ఇక్కడ పారిశ్రామికీకరణ, పట్టణీకరణ తక్కువనే చెప్పాలి. సుమారు 70శాతం ప్రజలు (అంటే సుమారు 25 మిలియన్లకు పైగా) పల్లెల్లో నివశిస్తారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. సుమారు 22 శాతం మంది షెడ్యూల్డు జాతులకు, 16 శాతం మంది

షెడ్యూల్డు కులాలకు చెందినవారు. దేశ తూర్పుతీరంలో విస్తరించి 500 కి.మీ తీరప్రాంతంగల ఒరిస్సా రాష్ట్రాన్ని తరుచూ ప్రకృతి వైపరీత్యాలు కుదిపిపోతూవుంటాయి. కోస్తాప్రాంత ప్రజలకు వరదలు, తుఫానుల బెడద తప్పకపోగా పశ్చిమ ప్రాంత ప్రజలను కరువుకాటకాలు తిప్పలు పెడుతూ వుంటాయి.

### ఎన్‌జిఓలు - విపత్తు నిర్వహణ

ఇటీవల కాలం వరకు ఒరిస్సా రెడ్‌క్రాస్, ఆక్సఫాన్, కేర్ వంటి అంతర్జాతీయ సంస్థలు తప్ప విపత్తు నిర్వహణలో ఎన్‌జిఓల పాత్ర చాలా స్వల్పంగా వుండేది. ఒరిస్సా రాష్ట్ర సహాయ నియమావళిలో ఎన్‌జిఓలకు ఏ మాత్రం ప్రాధాన్యం కల్పించలేదు. అందుచేతనే విపత్తు స్పందన ప్రక్రియలో వారి భాగస్వామ్యం నామమాత్రంగా వుండేది. 1980 దశకంలో మారుమూల ప్రాంతాలకు వెళ్ళి సామాజికాభివృద్ధి కార్యక్రమాలకు దిగిన ఎన్‌జిఓల పాత్ర అంతవరకు మాత్రమే పరిమితమై వుండగా 1999 జంట తుఫానుల సందర్భంగా ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. ఎన్‌జిఓలు తక్షణమే స్పందించి ఒక్క ఉదుటున రంగంలోకి దూకి బాధితులను ఆదుకున్నాయి, పునరావాస చర్యలలో వారు పాల్గొన్నారు.



పునర్నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్ళ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక వంక సహాయ పునరావాస కార్యక్రమ భారాన్ని తమ భుజస్కంధాల పై మోపుకోవటమే కాక, మరోపక్క మానసికంగా కుంగిపోయిన బాధితులను సాంస్కృతిక ప్రదర్శనలు, వీధినాటికాల వంటి కార్యక్రమాలతో రంజింప చేయటంతోపాటు నిరాశా నిస్పృహల నుండి వారు తెరిపిన పడేందుకు ట్రామాకేర్ సెంటర్లు నెలకొల్పారు, కౌన్సెలింగు నిర్వహించారు. అన్ని తామై నిలచి అపూర్వ సేవానిరతిని ప్రదర్శించారు, ఆదర్శంగా నిలిచారు.

### జిఓ - ఎన్‌జిఓ సహకారం - అవరోధాల తొలగింపు

ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి సంబంధించి పలు అవరోధాలను తొలగించాల్సి వుంది. ఇరువురు పరస్పర పోటీదారులుగా పని చేస్తారనే అపోహను తుడిచివేయాలి. ముందుగా వలస పాలకుల చట్టాలు, - ప్రభుత్వ యంత్రాంగం పౌరస్వేచ్ఛను హరింపచేసే ఆయుధాలుగా, దోపిడీ సాధనాలుగా పనిచేశాయి. వలసపాలన ముగిసిన అనంతరం కూడా అధికారానికి వచ్చిన జాతీయ ప్రభుత్వాలు అదే వైఖరిని అవలంబించాయి. దీనితో ప్రభుత్వంపై భారం మోయలేనిదిగా మారింది. మరోపక్క ప్రజల ఆకాంక్షలు అధికం అవుతుండడంతో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పొసగక ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. వీటికి కొంతవరకు ఎన్‌జిఓలు కూడా బాధ్యులుగా భావించడం జరిగింది.

ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థల మధ్య సహకారంపై ప్రతికూల ప్రభావం చూపిన మరో అంశం ఎన్‌జిఓలలో తాము పవిత్రులమని ప్రబలిన భావం. ఇరురంగాలకు వారివారి బలాలు - బలహీనతలు వున్నాయి. తమ బలహీనతలను కప్పిపుచ్చుకుని ప్రగల్భాలకు పోయిన పక్షంలో ఎదుటివారి ఆగ్రహానికి గురికాక తప్పదు.

కాగా ప్రభుత్వేతర సంస్థలన్నీ సహకారం గురించి గొప్పలు చెప్పుకున్నా చేతలలో అందుకు భిన్న వ్యవహారం ఇరు సంస్థల మధ్య పొసగని మైత్రికి కారణమైతే ప్రభుత్వానికి చేరువైన పక్షంలో తమ స్వేచ్ఛ హరించుకుపోతుందనే భయంతో కొన్ని ఎన్‌జిఓలు దూరంగా మెలగటం మరోకారణం. తగిన సంస్థాగతమైన నిబంధనల ఏర్పాటు కొరవడటం ప్రభుత్వానికి ఎన్‌జిఓలకు కూడా తీరని లోటు. దీనివలన విపత్తు నివారణలో అభివృద్ధి కార్యకలాపాలలో ఎన్‌జిఓలకు పాలనాపరమైన మద్దతు లభించదు. ప్రభుత్వానికి ఎన్‌జిఓల సామర్థ్యాలను, శక్తియుక్తులను వినియోగించుకునే అవకాశం తప్పిపోతుంది

ఇక నిర్ణీతకాలవ్యవధిని దాటి దీర్ఘకాల సహాయచర్యల కొనసాగింపు, సహాయనిబంధనలో గల వైరుధ్యం మరో అవరోధం. ఈ కారణంగా ఒకపక్క ఎన్‌జిఓలలో అయోమయం నెలకొంటుంది, మరోవంక ప్రభుత్వం చేపట్టే పునర్నిర్మాణ, పునరావాస చర్యలకు అంతరాయం కలుగుతుంది. అభివృద్ధి చర్యలు కుంటువడతాయి. అందుచేత తక్షణ విపత్తు దశను దాటి మానవతా సహాయం కొనసాగింపు అభిలాషణీయం కాదు. ఎన్‌జిఓల వద్దగల మెళకువలు, సామర్థ్యాల పట్ల ప్రభుత్వానికి సరైన అవగాహన అవసరం. లేనిపక్షంలో వాటిని వాడుకునే అవకాశం చేయిజారిపోతుంది. ఒక్క అవగాహన మాత్రమే చాలదు. వీటికి సంబంధించి వివరాల తయారీకి పటిష్ఠమైన చర్యలు చేపట్టకపోయినా వారి, సామర్థ్యాలు, వనరుల సమర్థ వాడకానికి వీలు కలుగదు.




మరో విషయం ఏమిటంటే ప్రభుత్వానికి, ఎన్‌జిఓలకు మధ్య మరింత అభిప్రాయ మార్పిడి జరిగినప్పటికీ ఇరువురి భాగస్వామ్యం సాధ్యంకానీ ఆమోదయోగ్యం కానీ కాదని కొన్ని ప్రభుత్వేతర సంస్థల అభిప్రాయం. దీనివల్ల కాపలాకాసే తమ 'వాచ్‌డాగ్' పాత్రకు విఘాతం కలుగుతుందని వారు భావిస్తారు.

ఇక ఎన్‌జిఓల నడుమ తగిన సమన్వయం, నెట్‌వర్కింగు కూడా అంతగా అభిలషణీయం కాదనే అభిప్రాయమూ వుంది. ఈ కారణంగా సంస్థల మధ్య పరస్పర పోటీ, ఘర్షణ, అమోయమం పెరిగి పరోక్షంగా జిఓ - ఎన్‌జిఓ సహకారం దెబ్బతింటూందనేది ఈ అభిప్రాయం. దీనితో వారి విశ్వసనీయత కొరవడి బేరం సాగించే శక్తి తగ్గుతుందని నమ్మకం. 1999 ఒరిస్సా తుఫాను సందర్భంగా జరిగింది ఇదే. ఎన్‌జిఓల మధ్య అంతర్గత కుమ్ములాటలు తప్పలేదు. పెద్ద సంస్థలకు చిన్న సంస్థల పట్ల చిన్నచూపు, చిన్నసంస్థలకు పెద్దసంస్థల అహంకార పూరిత ధోరణిపట్ల ఏవగింపు. దీంతో ఇరువురు అసలైన సమస్యలపై ఉమ్మడి వేదిక మీద కలసి కదలటంతో అవరోధాలు ఏర్పడ్డాయి.

చివరగా చాలా ఇతర ఆసియా దేశాలలో మాదిరిగానే భారత్‌లో కూడా రాజకీయ - అధికార వాతావరణంలో ఎన్‌జిఓలను పరాయివారుగా పరిగణిస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల గొంతు వినిపించే ఏకైక ప్రతినిధి తానేనని ప్రభుత్వం భావిస్తుంది. ఎన్‌జిఓలను తమతో సమమైన భాగస్వాములుగా పరిగణించరు.

### జిఓ - ఎన్‌జిఓ భాగస్వామ్యం - తగిన వాతావరణం ఏర్పాటు


జిఓ - ఎన్‌జిఓల సంబంధం పరస్పర ఆధారం, సహకారం వంటి వివిధ రూపాలలో వుంటుందని అనుభవాలు చూపుతున్నాయి. అయితే ప్రజాస్వామ్యాలలో మాత్రం చాలావరకు ఈ బంధం సహకారం రూపంలో వుంటుంది. కాగా సంస్థాగత, చట్టపరమైన ఏర్పాటు, ప్రోత్సాహకాలు, ఆ వివిధ రంగాల మధ్య సహకారం, విధాన తయారీలో పాత్ర తదితర వివిధ అంశాలపై ఈ జిఓ - ఎన్‌జిఓల సహకారంలో ఇంకా దృష్టి సారించాల్సి వుంది. సమర్థమైన విధాన వాతావరణం ఏర్పాటుతో విపత్తు తగ్గింపు, సాంఘికాభివృద్ధిలో జిఓ - ఎన్‌జిఓ భాగస్వామ్యం మరింత పటిష్ఠంగా పనిచేస్తుంది.

### జిఓ - ఎన్‌జిఓ సహకారం - చేపట్టివలసిన చర్యలు

- విపత్తు నిర్వహణ కోసం ఎన్‌జిఓలకు అవసరమైన సామర్థ్య నిర్మాణానికి మద్దతు.
- భాగస్వామ్యం, సంప్రదింపులు, సహకారానికి నిబంధనలు ఏర్పాటు.
- ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థలు తమకు గల విభేదాలు విస్మరించాలి. పరస్పర పోటీ ప్రత్యామ్నాయాలుగా కాక అనుబంధ సంస్థలుగా గుర్తించి వనరుల గరిష్ఠ వాడకానికి కలసికట్టుగా కృషిచేయాలి.
- సమాచార మార్పిడికి, సోషల్‌ఆడిట్‌కు చర్యలు తీసుకుని పారదర్శకతను, జవాబు దారీ తన్నాన్ని బలోపేతం చేయాలి. దీనివల్ల విశ్వసనీయత పెంపొంది పరస్పర గౌరవం - సహకారాలకు వేదిక ఏర్పడుతుంది.
- మానవతా సహాయానికి కనీస పరిమితులు విధించి ప్రజల హక్కులు, అధికారాలను ప్రామాణికం చేయాలి, తద్వారా ఎన్‌జిఓలలో, ప్రభుత్వంతో అయోమయం తొలగిపోతుంది.
- ఎన్‌జిఓల మెళకువలు, సామర్థ్యాలు, వనరులు, అవసరాలతో కూడిన వివరాల పట్టిక సిద్ధం చేయాలి. దీనివల్ల విపత్తులు సంభవించిన సందర్భాలలో ఏయే ఎన్‌జిఓల సహాయాన్ని అర్థించాలో ప్రభుత్వానికి అర్థం అవుతుంది.
- విపత్తు అనుభవాలను, విజయగాథలను లిఖించి భద్రపరచాలి. ప్రజలలో వీటికి విస్తృత ప్రాచుర్యం కల్పించాలి.
- అంశాల ఆధారంగా ఎన్‌జిఓలు వకాల్తా వహించాలి. ప్రభుత్వం కూడా దీనిని ప్రోత్సహించాలి. దీనివల్ల విపత్తులనెదుర్కొనే సంసిద్ధత పెంపొందుతుంది. నివారణ చర్యలు పటిష్ఠంగా అమలు జరుగుతాయి.
- విపత్తు నిర్వహణ సందర్భాలలో చర్యలు ముమ్మరం చేయడానికి వీల ంగా ఎన్‌జిఓల మధ్య పరస్పర సమన్వయ - సహకారాలు అవసరం.
- ఎన్‌జిఓల పాలనా నిర్మాణంలో మార్పులు చేయాలి. తమ ప్రాతినిధ్య లక్షణాన్ని పటిష్ఠపరచి ప్రజలు - ప్రభుత్వ దృష్టిలో విశ్వసనీయతను, సంస్థాపరమైన ప్రతిష్ఠను పెంపొందించటానికి ఈ మార్పులు ఆవశ్యకం.

*- ఎం.వి. శైలేష్, సి.ఎం.ఇడి.,*
*ఎ.ఎమ్.ఆర్. -అపార్డ్*
*(అనువాదం - పార్వతీ ప్రసాద్)*

# మమకారం



**జోగయ్య మామ కర్రపోటు వేసుకుంటూ వచ్చి కాలువ గట్టుమీద వున్న నేరేడు చెట్టునీడను నుంచున్నాడు. సూర్యుని కిరణాలకు చెయ్యి అడ్డం పెట్టుకుని తన పొలాన్ని ఒకసారి చూసుకున్నాడు. తన చేల గట్లమీదనున్న తుమ్మ చెట్లన్నీ అతనికి గుర్తే. అవికూడా తనతోపుట్టి, తనతోపాటు పెరుగుతూ వస్తున్నాయి. అందులో తన హయాంలో అవసరంగా నాగలి దుంపలకు కావలసివచ్చి రెండు తుమ్మచెట్లను మాత్రం నరికించాడు. అవి వుండే స్థలం ఇప్పటికీ అతనికి బోసిగా కనిపిస్తూనే ఉంటుంది. ఆ స్థలాన్ని చూసినప్పుడల్లా చేతికెదిగొచ్చిన ఇద్దరు కొడుకులు తన్ను విడిచి వెళ్ళినట్లు బాధపడుతూ ఉంటాడు.**

జోగయ్య మామ నిట్టూర్పు విడుస్తూ తలకు చుట్టుకున్న గుడ్డపరచి, నేరేడు చెట్టు కింద కూర్చున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు. పెద్దతను నరసయ్య పొలం పని చూసుకుంటున్నాడు. రెండో అతను దారయ్య బట్టల దుకాణంపెట్టి సొంతంగా నాలుగురాళ్ళు సంపాదిస్తున్నాడు. ఆఖరి కొడుకు వెంకట సుబ్బయ్య ఇంగ్లీషు చదువు చదువుకున్నాడు. వీళ్ళుకాక అతనికిద్దరు కూతుళ్ళు. అతని పిల్లందరికీ అతనంటే ఇష్టమే. అతనికీ వాళ్ళంటే ప్రేమేకాని అవసరమేతే వాళ్ళను చూడకుండా ఉండగలడుకాని, తన పొలాన్ని మాత్రం చూచుకోకుండా ఒక్క మాటుకూడా ఉండలేడు.

పిల్లలందరూ పొలంమీద పాటు పడాలని ఉంటుందతనికి. పొలాన్ని వృద్ధిచెయ్యడానికి వాళ్ళు పుట్టింది. అందుకనే బట్టల దుకాణం పెట్టిన కొడుకుమీద మనసులో కొంచెం కోపం. "వాడు మంచివాడే, పెళ్లాం మాటవిని చెడిపోయాడు" అని చెబుతాడు.

జోగయ్య మామకిప్పుడు వందెకరాలు వుంది. ఆస్తిలో ఎక్కువ భాగం తాను రెక్కలమీద సంపాదించినదే. అందుకని మిగిలిన బాంధవ్యాలన్నీ ఆస్తి ముందు స్వల్పంగా కనిపిస్తాయి అతనికి.

పొలాన్ని ప్రాణప్రదంగా కాపాడతాడు. పొలం బాగా పండటానికి ఏమైనా చేస్తాడు. అనేకసార్లు తన ప్రాణాలను లెక్కచెయ్యకుండా ఆవతల వాళ్ళు వేయించిన అడ్డకట్టను తీయించి, తన చేనుకి నీళ్ళు పెట్టుకున్నాడు జోగయ్య. "ఎవళ్లొస్తారో రండి" అని దుడ్డుకర్ర పట్టుకొని చేనుగట్టుమీద నుంచుంటే వూరువూరంతా హడలెత్తి పోయేది. బాగా నెర్రెగొట్టిన తన చేను నీటివి గుటగుటా తాగుతుంటే పసివానికి స్తన్యాన్నిస్తూ పరవశత్వంతో కూర్చునే తల్లిలా నుంచునేవాడు. కొడుకులు పెరిగొచ్చింతర్వాత "మేం వుండగా నీకెందుకీ తాపత్రాయం, కృష్ణా రామా అనుకుంటూ కాలం గడుపుకోక " అంటున్నారు. వాళ్ళకేం తెలుసు పసిగాయలు! యీ తాపత్రయంవల్ల తనెంత సుఖపడుతున్నదీ వాళ్ళకు అదేం అనుభవంకాదు.



గోపీచంద్

నెలరోజులక్రితం జోగయ్యమామ భార్యకు జబ్బుచేసి ప్రాణంమీదకు వచ్చింది. అప్పటికి పదిరోజులు ఆమె ముక్కుతూ మూలుగుతూ వుందేగాని, జోగయ్య మామ అట్టే పట్టించుకోలేదు. ఆ విషయం యింట్లోవాళ్లు ఎవళ్లు కదిలించినా, "రోగాలు మనుష్యులకు రాక మానులకు వస్తాయా?" అంటూ వెళ్ళేవాడు.

దమ్ము చేసేరోజులవి. అతనికి తీరేదికాదు. ఏదైనా జబ్బు అంతతొందరగా ముంచుకొస్తుందనుకోలేదు అతను. "నువ్వింట్లో వుండు అమ్మని కనిపెట్టుకొని, నేను చేను తడిపించి వస్తాను" అని పెద్దకొడుకన్నాడేగాని

జోగయ్యమామ ఇంటిదగ్గర వుండలేకపోయాడు. అసలే నీటికి ఎద్దడిగా ఉంది. ఎవరు అడ్డంవేస్తారో. తన పెద్దకొడుకు బుద్ధిమంతుడేకాని ఉట్టి అర్భకుడు. ఆవలివాళ్ళు నోరు చేసుకుంటే వెనక్కు తగ్గుతాడు. తీరా పొలం తడవకపోతే తరువాత ఏమనుకునేం లాభం? అందుకని వూళ్లో వైద్యుడిచేత భార్యకు నాలుగు మాత్రలు ఇప్పించి, కాసిని నీళ్లు తాగించి "కళ్లుమూసుకు పడుకో, కునుకు పడుతుంది" అని చెప్పి పొలం బయలుదేరాడు.

వూరిచివర చింతచెట్టు దగ్గరికి వచ్చేసరికి కొడుకు పంపిన మనిషి ఎదురుగుండా వచ్చాడు. "అవతలవాళ్ళు కర్రలూ, బల్లాలూ పుచ్చుకొని సిద్ధంగా వున్నారు.నరసయ్యకి కాలూ చెయ్యీ ఆట్టంలేదు" అని చెప్పాడు.

జోగయ్యమామ గబగబా పొలానికేసి నడిచాడు. కాలవకు వేసిన అడ్డుతెంచి నీళ్ళని తన చేలోకి మలిపాడు. అవతలి వాళ్ళు కర్రలూ, బల్లాలూ పట్టుకొని చూస్తూ నుంచున్నారేగాని ఏమీ అనలేకపోయారు. తన చేలోకి నడుస్తున్న గలగల వింటూ సర్వం మరచి నుంచున్నాడు చేను గట్టుమీద జోగయ్యమామ.

"అమ్మకెట్లా వుంది?" అడిగాడు నరసయ్య.

"ఉంది" అన్నాడు జోగయ్యమామ.

"తగ్గిందా?" అడిగాడు నరసయ్య.

"తగ్గకేంజేస్తుంది?" అన్నాడు జోగయ్యమామ.

"ఇక మనం వెళ్దాం" అన్నాడు నరసయ్య. యీ మాటకు జోగయ్యమామ అదిరి పడ్డాడు. "చేనంతా తడవకముందే విడిచి వెళ్ళడమే ?" అన్నాడు జోగయ్య మామ.

"ఇంట్లో ఎవరూలేరు మంచికైనా, చెడుకైనా" అన్నాడు నరసయ్య ఆదుర్దాగా.

"నువ్వు వెళ్లు. నేనిక్కడే వుంటా" అన్నాడు జోగయ్య.

నరసయ్యకు తెలుసు తన తండ్రి పని మధ్యలో విడిచిరాడని. ఇష్టంలేక పోయినా ఏమీ అనలేక తన తండ్రిని చేనుగట్టుమీద విడిచిపెట్టి యింటికి వెళ్ళాడు నరసయ్య.

కాకులు కూస్తుంటే కబురు వచ్చింది –జోగయ్య మామను తక్షణం రమ్మని. అతనికి తెలుసు – తనకూ. తన భార్యకూ ఋణానుబంధం తీరి పోతూ ఉందని. కాని చేను ఇంకా వొక కొస తడవాల్సివుంది. చూస్తూ చూస్తూ పని మధ్యన వెళ్లలేక పోయాడు.

నీళ్ళు నెమ్మదిగా పారుతూ నెర్రెల్ని, బొరియల్ని నింపుతూ ఆ కొనని తడిపింది. అప్పుడు జోగయ్యమామ గబగబా యింటికి బయలుదేరాడు భార్యని చూద్దామని.

★ ★ ★ ★ ★

అతను వెళ్ళేటప్పటికి ఆమె అవసాన దశలో ఉంది. ఆ అవస్థలోకూడా ఆమె ఇంటిసంగతులు మాట్లాడుతూవుంది. "మూడోవాడికి ముడివెయ్యమంటే నామాట విన్నారు కాదు" అని భర్తని నిష్ఠూరాలాడింది. రెండో కోడలు తన మాట వినటంలేదని అక్కసు వెళ్ళబోసుకుంది. "ఎలుకలు పురిల్ని కొట్టి పోస్తున్నాయ్. కాస్త మట్టి రాయించమంటే రాయించక పోతిరి" అన్నది. "బట్టలకి బాగా గంజి పెట్టడంలే" దని చాకలిదానిమీద కేకలు వేసింది. తనే మజ్జిగ చెయ్యాలని కవ్వం కోసం లేవబోయింది. "పెద్దకోడలికి వెన్నతియ్యడమే చేతకాదు. సగానికి మజ్జిగలోనే విడిచి పెడుతుంది" అని చెప్పింది. తను గుటుక్కుమన్న తర్వాత యీ కాపురం ఏమవుతుందో అని వేదన పడ్డది.

"ఆ మాటలన్నీ ఇప్పుడెందుకు? ఒక్కక్షణం నిశ్చలంగా ఉండు" అన్నాడు జోగయ్య మామ.

కాని ఆమె నోటికి మూత పడలేదు. ఆఖరి నిమిషం వరకూ మాట్లాడుతూనే ఉంది. అందరికీ ఏదో ఒకటి చెపుతూనే ఉంది. పనులు పురమాయిస్తూనే ఉంది. చివరికి "అబ్బో అబ్బో అంటూ" బాధపడుతూ జోగయ్యమామ చెయ్యి గట్టిగా పట్టుకుంది. అతని చెయ్యిపట్టుకునే యీ లోకాన్ని విడిచింది.

★ ★ ★ ★ ★

సరీగా యిప్పటికి నెల, ఆమె ఈ లోకాన్ని విడిచి. భార్య జబ్బు లెక్క చెయ్యకుండా. ప్రాణాలను లెక్కచెయ్యకుండా అంత కష్టపడి నీరు పెట్టిన చేను మూస తిరిగింది. కూలివాళ్ళు కలుపుతీస్తున్నారు. హుషారుగా పాడుతున్నారు ఆడవాళ్ళూ, మొగవాళ్లూ కలిసి.

జోగయ్యమామ అట్లాగే నేరేడుచెట్టు నానుకొని కూర్చున్నాడు. అతని మనస్సు ఇదివరకంత స్థిరంగా వుండటంలేదు. తన భార్య చనిపోయేటప్పుడు పడిన తాపత్రయం అతను మరచిపోలేక పోతున్నాడు. ఆమెకు తెలుసు తను పోతున్నానని. కాని ఒక్క నిద్రపోయి లేచేదానికిమల్లే మాట్లాడింది. పోయేదానికి తన కెందుకివన్నీ? ఒకళ్ళకు మాత్రం ఎందుకు? అంతా పోయేవాళ్ళే. అయితే యిక కావలసిందెవరికి? పొలంలో నుంచి పాట వినిపించింది.


ఒకసారి కన్ను తెరచి తనపొలం అంతా పారచూశాడు జోగయ్యమామ. ఆ మధ్య తన మనుమడు తనతో పొలం వచ్చాడు. "తాతయ్యా, మన పొలం ఏది? అని అడిగాడు. "నీకు కనబడుతున్నదంతా మందేరా" అన్నాడు. వంద యెకరాల ఏక కంద్రిక. తన మనుమడికి ఆవలితట్టు కనబడకుండా సముద్రంలా వున్న పొలం చూపిస్తూ "ఇదంతా మందేరా" అన్నప్పుడు అతని మనస్సు ఆనందంతో నిండింది. మొట్టమొదట తానీవూరు ఎడ్లబేరానికి వచ్చాడు. తానెవరి కయితే ఎడ్లని అమ్మాడో, ఆ ఆసామికే ఇల్లరికపు టల్లుడు అయ్యాడు. తన నడవడికచూసి, తన వ్యవహారజ్ఞానం చూసి ఆ ఆసామి మోజుపడి కూతుర్ని తనకిచ్చిచేసి ఇంట్లో పెట్టుకున్నాడు.

ఆనాటి నుంచి వళ్ళుదాచుకోకుండా తాను పని చేశాడు. తను అడుగుపెట్టినపుడు తన మామకి ఆయిదెకరాలు ఉండేది. తన చెమటతో తడిపి, పండించి పది సంవత్సరాలు తిరిగొచ్చేటప్పటికి ఆ అయిదెకరాలకీ మరొక అయిదెకరాలు జతచేశాడు. తన మామకి తన మీద గురి ఏర్పడ్డది. ఆయన పోతూ పోతూ "నిన్ను దగ్గరికి తీసినందుకు నా పరువు నిల్పావు" అన్నాడు. తను పడిన కష్టమంతా ఆ ఒక్కమాటతోనే తీరిపోయింది. తన మామ చనిపోయేటప్పటికి వందెకరాలు చేశాడు. కాని వృద్ధి చేస్తున్నపుడు తనకు కలిగిన ఆనందం ఇప్పుడు కల్గటంలేదు. రోజూ పొలం రావడం, పొలాన్నంతా ఒక్కసారి చూసుకోవడం, పాలేళ్లను గదమాయించడం – ఇంతవరకే మిగిలింది. అంటే ఆ ఆనందం పోయి అలవాటే మిగిలింది.

జోగయ్యమామ నేరేడుచెట్టు కానుకొని అట్లాగే కూర్చున్నాడు. పొద్దునెత్తి మీదికొచ్చింది. నేరేడుచెట్టు ఆకుల్లోంచి ఎండ జోగయ్యమామ ముఖంమీదపడ్డది. ఆ వేడికి ఆయన కన్ను నెమ్మదిగా తెరచి చూశాడు.

పొలంలో కూలీలు లేరు. నర్దుకొని గబుక్కున లేవబోయాడు. కదిలాడు. ఎదురుగా చెట్లకు కట్టిన మూటలు విప్పుకొని కూలీలు బువ్వ తినడటం చూశాడు. కొంతమంది అన్నం ముద్దలు మింగుతున్నారు. కొందరు తలగుడ్డలు విప్పుకొని పడుకున్నారు.

'లేవండ్రా' అని కేకలేశాడు. జోగయ్య మామ, ''ఇంత వయసులో దొరకెంత యావ,'' అని నవ్వుకున్నారంతా. "ఇప్పుడేగా దొరా, కూటి కొచ్చింది" అన్నాడొకడు కేరింతలు కొడుతూ. ఒక్కొక్కళ్లూ మళ్లీ చేలోకి దిగారు.




జోగయ్యమామ ఒకసారి ఊరివైపు చూశాడు. మధ్యాహ్నం పూట ఆ నేరేడు చెట్టుకింద అన్నం తినటం జోగయ్య మామకు అలవాటు. ఇప్పటికీ ఆయన మనుమరాలు రోజూ అన్నం తెచ్చిపెడుతుంది. దూరంగా అన్నం గిన్నె నెత్తిమీద పెట్టుకొని మనుమరాలు రావటం చూశాడు. మబ్బు బాగా వేసింది. వర్షం వస్తుందేమో. తాను తడిస్తే ఫరవాలేదు. కాని, తన మనుమరాలు తడుస్తుందేమో! వర్షం ఎక్కువైతే పనసచెట్టు క్రింద గుడిశలోకి వెళ్ళాలి. ఎప్పటి గుడిశ. మొట్టమొదట తాను చేను కొన్నప్పుడు వేసిన గుడిశ. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అట్లాగే నిలబడివుంది.

"తాతా అన్నం తెచ్చా" అని మనుమరాలు గిన్నె కింద బెట్టి గిన్నెకు కట్టిన గుడ్డ విప్పింది. ఒక పక్క గోంగూర పచ్చడి నల్లగా నిగనిగ లాడుతూంది. ఒకపక్క ఆవకాయ పచ్చడి ఎర్రగా నెత్తురుముద్దలా ఉంది. ఆ రెంటి మధ్యా తెల్లటి అన్నం.

"నువ్వు తింటూ వుండు తాతయ్యా, నేను చేలోకి వెళ్ళివస్తా" అంటూ రివ్వున పరుగెత్తింది మనుమరాలు. జోగయ్యమామ నెమ్మదిగా లేచాడు. బట్టలు దులుపుకొని తలకు చుట్టుకొని కర్రపోటు వేసుకుంటూ గట్టు దిగాడు. కాలవలో నీళ్ళు దోసెడు తీసుకొని నోట్లో పోసుకొని పుక్కిలి వూశాడు. నెమ్మదిగా మళ్ళీ నేరేడు చెట్టుదగ్గరకొచ్చి కూర్చున్నాడు. కర్రపక్కన పెట్టుకొని అన్నం గిన్నె ముందుకు లాక్కున్నాడు. ఆవకాయ పచ్చడి వేలితో తీసికొని నాలిక్కి రాసుకున్నాడు. ఒకలొట్ట వేశాడు. ధ్వని కలగలేదు. అలవాటు ప్రకారం ఆవకాయ పచ్చడి నాలిక్కి రాసుకొని. అలవాటు ప్రకారం లొట్ట వేశాననుకున్నాడు, బాగుందనుకొని.

* * * * *

**చే**లో కూలివాళ్లు కలుపు తీస్తున్నారు. జోగయ్యమామ మనుమరాలు కాసేపు గట్టుమీద నుంచుని చూసింది. కూలివాళ్లు చిన్నదొరసాని వచ్చిందని పరియాసకాలాడారు. పరికిణీ కాళ్లకు తగలకుండా చేత్తోపట్టుకొని చేనుగట్టుమీదుగా తాత దగ్గరకు పరిగెత్తడం మొదలు పెట్టింది. దారిలో తండ్రి కనిపించాడు.

"జెరీ పరికిణీ వేసుకొచ్చావే అమ్మా, చేలోకి? బురదకాదూ?" అని అడిగాడు.

"తాత వేసుకు రమ్మన్నాడు నాన్నా. యీ పరికిణీ కట్టుకొస్తే చూడాలన్నాడు" అన్నది.

"చూశాడా?"

"మరిచిపోయాడు"

"తాత అన్నం తిన్నాడా అమ్మా?"

"పెట్టొచ్చాను"

"ఎక్కడున్నాడు?"

"అదే ఆ నేరేడు చెట్టు కిందే."

ఇద్దరూ నేరేడు చెట్టు దగ్గరకు బయలుదేరారు. ఆకాశం మబ్బేసింది. వర్షమొస్తుందేమో అనుకున్నాడు నర్సయ్య. అరవై ఏళ్ళు నిండినా తండ్రి పొలం రావటం నర్సయ్యకి ఇష్టంలేదు. పొలానికి అన్నం తెప్పించుకోవటం అసలు ఇష్టంలేదు. అతను వూళ్లో పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు. కొంచెం పరువుగా బ్రతితకాలంటాడు. కాని ఏం లాభం? తండ్రి తన మాట వినడు, నేను గట్టు మీద అన్నం తింటే పరువు పోతుందా అంటాడు.

యెక్కడో ఉరిమింది. మెరుపుకూడాను. చిటపట చినుకులు. చిట్టి నాలుక సాచి చినుకులు రుచిచూస్తోంది నడుస్తూ. గబగబా నర్సయ్య నేరేడు చెట్టు దగ్గరకు నడిచాడు. చెట్టునానుకొని కూర్చొని ఉన్నాడు తండ్రి.

చేతికర్ర, తలపాగా ఒకపక్కన పడి ఉన్నాయి. కళ్ళు మూసుకుని ఏమిటో ఆలోచిస్తున్నాడు. అవసరం ఉన్నా లేకపోయినా ఆలోచించడం తప్పదు. గుప్పిడి ముక్కుకి ఆనించుకొనేదో వాసన చూస్తున్నాడు. గుప్పెట్లో ఏముంది? పువ్వా? కాదు. పొగాకా? కాదు. మన్ను. . . . . . వట్టిమన్ను – నేరేడు చెట్టు క్రింది రేగడి మన్ను.

"అయ్యా, అయ్యా" అని పిలిచాడు కొడుకు–మళ్ళీ పిలిచాడు.

"అబ్బాయ్" – నీరసంగా తండ్రి మాట, గుప్పిడి సడలి చెయ్యి క్రిందికి వాలిపోయింది. మన్ను ధారగా పడింది. మట్టి మట్టితో కలిసింది.

"అయ్యా, అయ్యా?"

అయ్య మరి పలకలేదు.

*(గోపీచంద్ శతజయంతి సందర్భంగా "నేషనల్ బుక్ ట్రస్ట్' వారి తెలుగు కథానికలు' నుండి పునర్ముద్రితం)*

☆

**ప్రపంచంలోని వివిధ దేశాల రాజ్యాంగాలన్నిటి కంటే సుదీర్ఘమైన రాజ్యాంగం మనది. దీని రూపకల్పన 1946 డిసెంబర్‌లో ప్రారంభమైంది. భారత ప్రజల అభివృద్ధి కోసం సామాజిక విప్లవాన్ని సాధించటం రాజ్యాంగ లక్ష్యం. ప్రజాస్వామ్యాన్ని కాదని సామాజిక విప్లవాన్ని సాధించలేం. అదే సందర్భంలో సామాజిక విప్లవం లేని ప్రజాస్వామ్యం అర్థరహితం. అందువల్ల ప్రజాస్వామ్యం, సాంఘిక సంస్కరణల ప్రాతిపదికన భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. గ్రామ పంచాయితీలు 'స్థానిక స్వపరిపాలన' యూనిట్లుగా పని చేయటానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టవలసి ఉంటుందని భారత రాజ్యాంగంలోని 40వ అధికరణలో పేర్కొన్నారు. ఈ విధమైన అధికరణను పొందు పర్చటం గూర్చి రాజ్యాంగ సభలో సుదీర్ఘమైన చర్చ జరిగింది. గ్రామ స్వరాజ్యం కాంక్షించే వారిని సంతృప్తి పరచడానికి మాత్రమే ఈ అధికరణ పొందుపర్చ బడిందే కాని, ఆశించిన లక్ష్యాన్ని సాధించడానికి ఇది ఉపకరించదని పలువురు రాజ్యాంగ సభ సభ్యులు తమ సందేహాలను వ్యక్తం చేశారు.**

- ★ కొత్త పన్నులకు సంబంధించిన ప్రతిపాదనలు లేదా ఉన్న పనులను పెంచే విషయం.
- ★ పథకాల లబ్ధిదారుల ఎంపిక, ప్రాంతం (location) ఎంపిక.
- ★ ఇంకా ఇతర విషయాలు.

గ్రామ సభ సూచనలకు గ్రామ పంచాయితీ తగు ప్రాధాన్యతనిచ్చి పరిశీలించాలని కూడా పేర్కొనబడింది.

పైన నిర్దేశించిన గడువుకు 10 రోజుల లోపునే గ్రామసభ సర్పంచ్ లేదా ఉప సర్పంచ్ అధ్యక్షతన జరగాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 6వ సెక్షన్‌ను స్థూలంగా పరిశీలించినప్పుడు గ్రామసభకు రాజ్యాంగం ఇచ్చిన నిర్వచనాన్ని పునర్లిఖించడమే కాక, గ్రామసభకు గల అధికారాలను కూడా పేర్కొనడం జరిగింది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ సభకు ఏర్పడిన రాజ్యాంగ భూమిక రాష్ట్రంలో చట్టరూపం సంతరించుకున్నది.

# పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయి?

## గ్రామ సభకు రాజ్యాంగ భూమిక

రాజ్యాంగంలోని 40వ అధికరణ గ్రామ స్వరాజ్య సాధనదిశలో అనుకున్న లక్ష్యాలను చేరుకోలేక పోయిందని కాలపరీక్షలో నిర్ధారణ జరిగింది. 73వ రాజ్యాంగ సవరణ లక్ష్యాలలో కూడా ఇదే అంశాన్ని పేర్కొన్నారు. ఈ లోటును భర్తీ చేయటం కోసమే 73వ రాజ్యాంగ సవరణ ఉద్దేశించబడింది అని కూడా చెప్పబడింది.

ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో పొందుపరచబడిన IXవ భాగంలోని 243వ అధికరణంలోని (డి) 'గ్రామసభ' అంటే గ్రామపంచాయితీ ఓటర్ల జాబితాలో నమోదు కాబడిన వారందరితో కూడినదని నిర్వచించబడింది.

రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే చట్టాల ద్వారా సంక్రమించబడే అధికారాలన్నింటిని గ్రామసభ కలిగి ఉంటుందని 243వ అధికరణలో పేర్కొన్నారు.

గ్రామ పంచాయితీలోని ఓటర్లు అందరూ గ్రామసభ సభ్యులుగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 6వ సెక్షనులో పేర్కొన్నారు. ఈ గ్రామసభ సంవత్సరానికి రెండు సార్లు సమావేశమై ఈ క్రింది అంశాలను పరిశీలించాలని కూడా ఇందులో చెప్పబడింది. అవి:

- ★ వార్షిక ఆదాయ వ్యయ వివరాలు (annual statement of account), ఆడిట్ నివేదిక
- ★ గడిచిన సంవత్సర పరిపాలనా నివేదిక.
- ★ వార్షిక పనులు లేదా వార్షిక బడ్జెట్‌లో రాని కొత్త పథకాలు.


### రాష్ట్ర ఆర్థిక సంఘం

పంచాయితీలకు ఇవ్వబడిన అధికారాలు ఆచరణలో అమలులోకి రావాలంటే పంచాయితీలను ఆర్థికంగా పరిపుష్టం చేయాల్సి ఉంటుంది. అందుకనే పంచాయితీల ఆర్థిక పరిస్థితిని సమీక్షించటానికి పంచాయితీ సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య ఆదాయ వనరుల పంపిణీకి సంబంధించి పంచాయితీలకు కేటాయించదగిన వనరుల నిర్ధారణకు, రాష్ట్ర సంచయిత నిధి (consolidated fund) నుండి కేటాయింపులు, పంచాయితీల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుటకు తీసుకోవాల్సిన చర్యల గురించి గవర్నర్‌కు సూచనలు చేయటానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని (finance commission) ఏర్పాటు చేయాలని 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 243–ఐ అధికరణాన్ని రాజ్యాంగంలో పొందుపర్చారు. ఈ కమీషన్ చేసిన సిఫార్సుల ను, అందుకు చేపట్టవలసిన చర్యలతో కూడిన వివరణలతో గవర్నర్ శాసన సభ ముందుంచటానికి పంపవలసి ఉంటుంది.

### జాతీయ ఆర్థిక సంఘం

భారత రాజ్యాంగంలో జాతీయ ఆర్థిక సంఘం గురించి చేప్పే 280వ అధికరణాన్ని కూడా 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సవరించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం చేసిన సిఫార్సుల ఆధారంగా, గ్రామ పంచాయితీల వనరులకు తోడ్పడేందుకు చర్యలను గురించి భారత రాష్ట్రపతికి తగు సూచనలను జాతీయ ఆర్థిక సంఘం చేయాల్సి ఉంటుందని ఇందులో

పొందుపర్చబడింది. ఈ విధంగా పంచాయితీలకు, ఇతర స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు విషయం వాటిని ఆర్థికంగా శక్తివంతం చేసే విషయం కూడా జాతీయ ఆర్థిక సంఘం పరిధిలోనికి తీసుకుని వచ్చారు.




## మన పంచాయితీ నిధి

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 3వ అధ్యాయం గ్రామపంచాయితీ పన్ను విధానానికి సంబంధించిన అంశాలను పేర్కొంటుంది.

గ్రామ పంచాయితీ విధించే పన్నుల గురించి 60వ సెక్షనులో పేర్కొనబడింది. అవి

★ ఇంటి పన్ను
★ కొలగారం లేదా కాటా రుసుం అంటే గ్రామంలో ఉత్పత్తి అయినటు వంటి దానికి తూనిక లేక కొలతల ప్రకారం అమ్మేటప్పుడు విధించే పన్ను.
★ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం వసూలు చేసే ఇతర పన్నులు.

అయితే ప్రభుత్వం రాష్ట్ర శాసన సభ ఆమోదం లేకుండా అట్టి నోటిఫికేషన్ జారీ చేయరాదు.

గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ఆస్థుల బదలాయింపు జరిగే సందర్భంలో నిబంధనలకు లోబడి సుంకం విధించబడుతుంది.

అలాగే వాహన పన్ను (మోటారు వాహనాలు మినహా), వ్యవసాయ భూములపై పన్ను, లాండ్ సెస్సు, గ్రామ పంచాయితీ అజమాయిషీలో ఉన్న పోరంబోకులు, సముదాయ భూముల (communal lands) ను ఉపయోగిస్తే ఫీజులు, గ్రామపంచాయితీ అజమాయిషీలో ఉన్న భవనాలు, చావిళ్ళు, సరాయిలు ఉపయోగిస్తే ఫీజులు గ్రామ పంచాయితీ నిబంధనలకు లోబడి వసూలు చేయవచ్చును.

గ్రామంలో క్వారీ చేయబడిన మినరల్స్, మైనర్ మినరల్స్ మినహా ఇతర వాటిపై ప్రభుత్వం వసూలు చేసే సినరేజ్ ఫీజుపై సర్ ఛార్జీని గ్రామ పంచాయితీ వసూలు చేయవచ్చును. అయితే ఎంత మొత్తం సర్‌ఛార్జీ విధించాలన్నది ప్రభుత్వ ఆమోదంతో చేయాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రాంతంలోని ఆంధ్రప్రాంత జిల్లా బోర్డుల చట్టం 1920లోని సెక్షను 78 ప్రకారం విధించబడే లాండ్ సెస్సు పైనా, తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణా ప్రాంత) జిల్లా బోర్డుల చట్టం 1955 లోని సెక్షను 135 ప్రకారం విధించే లోకల్ సెస్సు మీద కూడా గ్రామ పంచాయితీ సర్ ఛార్జీ విధించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 లోని సెక్షను 37 ప్రకారం విధించే విద్యా సెస్సు మీద కూడా గ్రామ పంచాయితీ సర్ ఛార్జీ విధించవచ్చు.

ఉన్న పన్నులను రద్దు చేస్తూ గాని లేదా తగ్గిస్తూ గానీ చేసే ఎట్టి తీర్మానమైనా కమీషనర్ ఆమోదం లేకుండా అమలు చేయరాదు.

నిబంధనలను అనుసరించి ఇంటి పన్నును నిర్దారించటానికి తీసుకోవల సిన ప్రాతిపదికలను ఈ చట్టంలోని 61 సెక్షనులో పేర్కొన్నారు. అవి:

★ వార్షిక అద్దె విలువ లేదా
★ కాపిటల్ వాల్యూ, లేదా
★ నిర్ధారించబడిన ఏదేని ఇతర ప్రాతిపదిక

అయితే కోళ్లఫారాల మీద ఏ విధమైన ఇంటిపన్ను విధించరాదు.

ఇంటి పన్నును ప్రతి సంవత్సరం నిబంధనల ప్రకారం ఆ సంవత్సరం ప్రారంభమైన 30 రోజుల లోపు చెల్లించాలి.

కొన్ని రకాల ఇళ్ళకు ఇంటి పన్ను నుండి మినహాయింపును ఇస్తూ;

వార్షిక అద్దె లేదా కాపిటల్ వేల్యూ నిర్ధారించుటకు లేదా పన్ను నిమిత్తం వివిధ రకాల ఇళ్ళ వర్గీకరణకు అనుసరించాల్సిన పద్ధతిని;

పన్నులు చెల్లించాల్సిన వ్యక్తులు, యాజమాన్య బదిలీకి సంబంధించిన సమాచారం ఇవ్వటానికి;

పేదరికం ప్రాతిపదికన పన్ను నుంచి మినహాయింపు ఇవ్వటానికి;

ప్రభుత్వం నిబంధనలను రూపొందిచవచ్చును అని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆదేశానుసారం పన్ను విధించటం

పైన వివరించిన 60వ సెక్షను ప్రకారం ఇంటి పన్ను విధించవల సిందిగా గ్రామ పంచాయితీని ఆదేశిస్తూ ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితులతో ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ రాజపత్రంలో ప్రచురించి జారీ చేయవచ్చునని ఈ చట్టంలోని 62వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

అట్టి ఉత్తర్వులను గ్రామ పంచాయితీలో అన్ని భవనాలకు సంబంధించిగానీ లేదా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన భవనాలకు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భవనాల గూర్చి జారీ చేయవచ్చును.

ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రామ పంచాయితీ అట్టి ఇంటి పన్నుల ను సవరించటానికి గానీ లేదా రద్దు పరచటానికి గానీ చేయరాదని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

## వాణిజ్య ప్రకటన పన్ను

ఈ చట్టం లోని 63వ సెక్షను, వాణిజ్య ప్రకటనలపై పన్ను గురించి

పేర్కొంటుంది.

గ్రామ పంచాయితీ పరిధిలోని స్థలం, భవనం, గోడ లేదా ఏ ఇతర నిర్మాణం పైనైనా వాణిజ్య ప్రకటనను ఏర్పాటు చేసిన ప్రతి వ్యక్తి నిర్దేశించిన పన్నును గ్రామ పంచాయితీకి చెల్లించాలి.

అయితే ఇందుకు సంబంధించి నిర్ధారించిన రేట్లు ప్రభుత్వం రూపొందించిన గరిష్ట, కనిష్ట పరిమితులకు లోబడి ఉండాలి.

*ఇట్టి వాణిజ్య పన్నును –*

★ బహిరంగ సభ ప్రకటనలు
★ చట్టసభ లేదా గ్రామపంచాయితీ లేదా మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ ఎన్నికలు
★ అట్టి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రకటనలపై విధించరాదు.

*అలాగే ఇట్టి వాణిజ్య పన్నును –*

★ భవనం లోపల ఉన్న వ్యాపార ప్రకటనలకు లేదా
★ ఆ భవనంలో లేదా స్థలంలో జరుగుతున్న వ్యాపారానికి లేదా అట్టి స్థలం లేదా భవనం అమ్మకానికి, అట్టి స్థలం లేదా భవనంలో జరిగే వినోద కార్యక్రమానికి లేదా సభకు సంబంధించిన ప్రకటనలకు లేదా
★ ఆ స్థలం లేదా భవనం పేరు లేదా దాని యజమాని లేదా స్వాధినంలో ఉన్న వ్యక్తి పేరును సంబంధించిన ప్రకటనలు, లేదా
★ రైల్వే ఆడ్మినిస్ట్రేషన్‌కు సంబంధిత వ్యాపారానికి చెందిన, లేదా
★ రైల్వే స్టేషన్ లోపల రైల్వే అడ్మినిస్ట్రేషన్ ఆస్థులు లేదా వాటి గోడల మీద ప్రకటనలకు కూడా విధించరాదు.

గ్రామ పంచాయితీ పరిధిలో కార్యనిర్వహణ అధికారి అనుమతి లేకుండా ఏవిధమైన వ్యాపార ప్రకటనలు చేయరాదు, అని 64వ సెక్షనులో పేర్కొన్నారు.

*అట్టి వాణిజ్య ప్రకటన –*

★ ఈ చట్టంలో 270వ సెక్షను ప్రకారం గ్రామ పంచాయితీ రూపొందించిన బైలాస్‌ను ఉల్లంఘించినా,
★ పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి ఇంజనీరు లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల ప్రకారం ఉన్న వాణిజ్య ప్రకటనకు అదనంగా ఏవైనా చేర్చినా,
★ వాణిజ్య ప్రకటనలో గాని లేదా అందులోని ఏదైనా ఒక భాగంలోగాని ప్రధానమైన మార్పును (material change) చేసినా:
★ అట్టి వాణిజ్య ప్రకటన ప్రమాదవశాత్తు కాకుండా కూలిపోయినా,
★ వ్యాపార ప్రకటన చెదిరిపోయే విధంగా, అది వున్న గోడ, భవనం లేదా నిర్మాణంలో మార్పు జరిగినా,
★ వ్యాపార ప్రకటన ఉన్న గోడ భవనం లేదా నిర్మాణం కూల్చబడినా లేదా కూలిపోయినా,

ఈ చట్టంలోని సెక్షను 64 ప్రకారం కార్య నిర్వహణ అధికారి ఇచ్చిన అనుమతి రద్దు అవుతుందని 65వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టంలోని 63,64 సెక్షన్లకు విరుద్ధంగా ఏదైనా స్థలం, భవనం, గోడ లేదా నిర్మాణం మీద ఉన్న వ్యాపార ప్రకటనలకు, లేదా అనుమతించిన కాల పరిమితి పూర్తయిన తర్వాత లేదా అనుమతి రద్దు అయిన తర్వాత కొనసాగుతున్న వ్యాపార ప్రకటనలకు అట్టి స్థల, భవన, గోడ లేదా నిర్మాణం యజమాని బాధ్యత వహించవలసి ఉంటుంది అని ఈ చట్టంలోని 66వ సెక్షనులో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వ్యాపార ప్రకటనలను కార్యనిర్వహణ అధికారి తొలగించి దానికి అయిన ఖర్చులను సంబంధిత వ్యక్తుల నుండి వసూలు చేయవచ్చును, అని 67వ సెక్షనులో పేర్కొన్నారు.

## స్థిరాస్థి బదలాయింపుపై సుంకం

గ్రామ పంచాయితీ పరిధిలో క్రింద పేర్కొన్న దస్తావేజుల ద్వారా జరిగే స్థిరాస్థి బదలాయింపులపై, భారతీయ స్టాంప్ చట్టం 1899 ప్రకారం విధించే రుసుంకు సర్ చార్జీని ప్రభుత్వం విధించ వచ్చునని పంచాయితీరాజ్ చట్టం 1994లోని 69వ సెక్షనులో పేర్కొన్నారు.

***దస్తావేజులపై పట్టికలో చూపిన మొత్తాల మీద 5% లోపు రుసుంను ప్రభుత్వం నిర్ధారించవచ్చును.***

| | దస్తావేజు వివరణ | రుసుము విధించబడే మొత్తం |
|---|---|---|
| (1) | స్థిరాస్థి అమ్మకం | దస్తావేజులో పేర్కొన్న అమ్మకం ధర లేదా దస్తావేజు ద్వారా అమ్ముతున్న ఆస్థి మార్కెట్ విలువ ఈ రెండింటితో ఏది ఎక్కువ అయితే అది. |
| (2) | స్థిరాస్థి మారకం (exchange) | ఆస్థి యొక్క మార్కెట్ ధర లేదా greater value which is the subject-matter of exchange |
| (3) | స్థిరాస్థి దానం (gift) | దానం చేయబడ్డ ఆస్థి మార్కెట్ ధర |
| (4) | స్థిరాస్థి స్వాధీన తాకట్టు | దస్తావేజులో పేర్కొన్న హామీ ఇచ్చిన మొత్తం (amount secured) |
| (5) | స్థిరాస్థిపై వంద సంవత్సరాల కంటే ఎక్కువ కాలానికి లీజు | దస్తావేజుల్లో పేర్కొన్న మొత్తంలో 1/6 వంతు లేదా మొదటి 5 సంవత్సరాలకు చెల్లించే లీజు మొత్తం. |

ఈ సెక్షను క్రింద వసూలు చేయబడిన రుసుమును సంబంధిత గ్రామ పంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల మధ్య నిబంధనల ప్రకారం పంచబడుతుంది అని కూడా ఈ సెక్షన్‌లో చెప్పబడింది.

ఇట్టి రుసుమును వసూలు నియంత్రణకు మరియు సంబంధిత గ్రామ పంచాయితీ, మండల పరిషత్ మరియు జిల్లా పరిషత్‌ల మధ్య ఈ రుసుము పంపకానికి, ఇట్టి రుసుమును వసూలు చేయడంలో ప్రభుత్వానికి అయిన ఖర్చులను మినహాయించటానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలని కూడా పేర్కొనబడింది.

ఏదేని దస్తావేజును గాని లేదా కొన్ని రకాల దస్తావేజులు గాని ఇట్టి రుసుము నుండి షరతులకు లోబడిన మినహాయింపును ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల నివ్వవచ్చును.

నీటి సౌకర్యం, డ్రైనేజి సదుపాయం, వీధి దీపాలు వంటి పనుల కొరకు గ్రామపంచాయితీ ప్రత్యేక పన్నులను ఇళ్లపై నిబంధనలకు లోబడి విధించవచ్చునని ఈ చట్టంలోని 71వ సెక్షనులో పేర్కొన్నారు.

ఫ్యాక్టరీలు లేదా గృహ సముదాయాల యజమానులు పన్నుల బదులు ఏక మొత్తంగా సొమ్మును నిబంధనల ప్రకారం చెల్లించుకొనవచ్చునని ఈ

చట్టంలోని 72వ సెక్షనులో పేర్కొన్నారు.

## గ్రామపంచాయితీ నిధి

గ్రామ పంచాయితీ చేత చేయబడిన అన్ని రకాల వసూళ్లు గ్రామపంచాయితీ నిధిలో జమ చేయబడతాయి.

ప్రత్యేక అవసరాల కోసం, నిర్దిష్టమైన ప్రజా ప్రయోజనం కోసం వసూలు చేసిన సొమ్మును ప్రత్యేక ఖాతాలో ప్రత్యేక నిధిగా జమచేయాలి.

ఈ చట్టంలోని వివిధ నిబంధనల కింద వచ్చిన ఆదాయమంతా గ్రామ పంచాయితీ నిధిలో జమ కావాలి, ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) వాణిజ్య పంటల మార్కెట్ చట్టం 1993 లోని సెక్షన్లు 11, సబ్ సెక్షన్ 3 అనుసరించి మార్కెట్ కమిటి గ్రామ పంచాయితీకి చేసిన చెల్లింపులు,

ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) ప్రజారోగ్య చట్టం 1939లోని సెక్షన్ 117, 118 ప్రకారం లేదా రాష్ట్రంలో అమలులో ఉన్న అటువంటి ఏదేని ఇతర చట్టం కింద వసూలు చేయబడ్డ పన్నులు లేదా రుసుములు;

ఆంధ్రప్రదేశ్ వినోద పన్ను చట్టం 1939లోని సెక్షన్ 13 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీకి చేసిన చెల్లింపులు.

గ్రామంలోని మండల పరిషత్ మార్కెట్‌కి సంబంధించి మండల పరిషత్ గ్రామ పంచాయితీకి చేసిన చెల్లింపులు లేదా అట్టి మార్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయంలో సెక్షన్ 112 ప్రకారం గ్రామ పంచాయితీ వాటా నిమిత్తం మండల పరిషత్ చేసిన చెల్లింపులు మరియు జిల్లా పరిషత్ లేదా సెక్షను 57లో పేర్కొనబడిన ఏదేని ఉమ్మడి కమిటీ గ్రామపంచాయితీకి ప్రయాణపు పడవల (ferry) నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయంలో గ్రామ పంచాయితీ వాటా నిమిత్తం చేసిన చెల్లింపులు;

గ్రామ కంఠం, రోడ్లు తదితర గ్రామ పంచాయితీకి చెందిన ప్రదేశాలను తాత్కాలికంగా ఉపయోగించుకున్నందుకు చెల్లించే రుసుము;

గ్రామ పంచాయితీ నిర్వహణలో ఉన్న దేవాదాయ, ధర్మాదాయ సంస్థల నుండి వచ్చే ఆదాయం;

ఇనాము రద్దు చట్టం తర్వాత ప్రభుత్వానికి దాఖలు పడిన సర్వీసు ఇనాముల నుండి వచ్చిన మొత్తం;

గ్రామ పంచాయితీకి దాఖలు పరచబడిన నీటి వనరుల లోని చేపలు తదితరాల ద్వారా వచ్చిన ఆదాయం;

గ్రామ పంచాయితీకి నిర్వాహణలోని ప్రయాణపు పడవల (ferry) ద్వారా వచ్చిన ఆదాయం;

మేజర్ మినరల్స్ కానటువంటి మైనర్ మినరల్స్‌ను గ్రామ పంచాయితీ పరిధిలో క్వారీ చేయటానికి అనుమతించిన నిమిత్తం ప్రభుత్వం వసూలు చేసిన సినరేజ్ ఫీజు;

గ్రామ పంచాయితీ దాఖలు పరచనటువంటి పోరంబోకు భూముల్లో ఉన్న చెట్లమీద వచ్చే ఆదాయం,

గ్రామ పంచాయితీ పొందిన ప్రభుత్వ ఆస్తుల అద్దుల ద్వారా వచ్చే ఆదాయం;

గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉన్న పోరంబోకు భూముల నుండి వచ్చిన ఆదాయం, వాటి అనధికార ఆక్రమణలో ఉన్న వ్యక్తుల నుండి ఏదేని చట్టం క్రింద వసూలు చేసిన జరిమానా,


ఈ చట్టం ప్రకారం గాని సంబంధిత నిబంధనలు లేదా బైలాల ఉల్లంఘన నేరాలు గ్రామంలో జరిగిన నాటికి మేజిస్ట్రేట్‌లు విధించే జరిమానాల వల్ల ప్రభుత్వానికి లభించిన ఆదాయంలో 1/10 వంతు ఆదాయం;

ప్రభుత్వ జిల్లా పరిషత్ లేదా మండల పరిషత్ నుండి పొందిన నిధులు,

గ్రామ పంచాయితీ నిధుల నుండి చేసిన పెట్టుబడుల (investments) ద్వారా వచ్చిన ఆదాయం.

ఈ చట్టంలో పేర్కొన్న ఇతర అన్ని వనరుల ద్వారా వచ్చిన వసూళ్ళు;

పైన పేర్కొన్నవే కాకుండా గ్రామ పంచాయితీ నిర్వహిస్తున్న లేదా గ్రామ పంచాయితీ ఆర్థిక సహకారంతో నిర్వహించబడుతున్న సంస్థలు లేదా సేవల ద్వారా వసూలు కాబడే మొత్తం గ్రామ పంచాయితీ నిధి క్రిందకే వస్తాయి.




గ్రామ పంచాయితీ వసూలు చేసిన అన్ని రకాల ఆదాయాన్ని దగ్గరలోని ప్రభుత్వ ఖజానాలో (Government Treasury) జమ చేయాలి.

అయితే జవహర్ రోజ్‌గార్ యోజన ఉద్యోగ బీమా పథకం లేదా ఇతర ఉద్యోగ వేతన పథకాల నిమిత్తం పొందిన సొమ్మును సమీపంలోని జాతీయ బ్యాంకులు లేదా సహకార బ్యాంకులు లేదా తపాలా కార్యాలయాల్లో నిర్దేశించిన విధంగా జమ చేయాల్సి ఉంటుంది.

గ్రామ పంచాయితీ నిధికి సంబంధించిన అన్ని రకాల ఉత్తర్వులు లేదా చెక్కులపై నిర్దేశిత అధికారి సంతకం చేయాలి.

## గ్రామ పంచాయితీ చెల్లింపులు

పై విధంగా సంక్రమించిన నిధులు ఖర్చు చేయడం గురించి పంచాయితీ రాజ్ చట్టంలోని 75వ సెక్షన్‌లో

పేర్కొన్నారు,

గ్రామపంచాయితీ బాకీ పడ్డ లేదా చేసిన అప్పుల ను,


గ్రామపంచాయితీ అధికారులు, సేవకుల జీతాలను, అలవెన్సులను, పెన్షన్‌లను, పెన్షనరీ కంట్రిబ్యూషన్, ప్రావిడెంట్ ఫండ్ కంట్రిబ్యూషన్‌ల ను,

కోర్టు డిక్రీ లేదా ఉత్తర్వుల ప్రకారం చెల్లించాల్సిన మొత్తాలను.

కమీషనర్ నిర్దేశించిన పరిధులలో మండల పరిషత్ సబ్జక్ట్‌కు చెల్లించాల్సిన ఏదేని చెల్లింపులు,

ఈ చట్టం ప్రకారం చెల్లించాల్సిన ఏదేని చెల్లింపులు,

ఈ నిధి నుండి గ్రామ పంచాయితీ చెల్లించాల్సి ఉంటుంది




ప్రభుత్వ అనుమతితో భారతదేశ రక్షణ నిధికి గ్రామ పంచాయితీ చెల్లించవచ్చును.

గ్రామ పంచాయితీ, కమీషనర్ అనుమతితో గ్రామంలో జరిగే ఏదేని బహిరంగ ప్రదర్శన (exhibition), వేడుక (ceremony) లేదా వినోద కార్యక్రమాలకు అయ్యే ఖర్చులకు చెల్లించ వచ్చును.

ఏదేని ధర్మాదాయ నిధికి లేదా పేదల సహాయార్థం లేదా జబ్బులకు లేదా అంగవైకల్యానికి (infirmity) చికిత్స కొరకు, (recepton of diseased or infirm person) లేదా వైద్య పరిశోధనలకు ఏర్పడ్డ సంస్థకు,

ఏదేని అసాధారణమైన ఖర్చులను చెల్లించడానికి

ఈ నిధి నుండి గ్రామ పంచాయితీ వినియోగించ వచ్చును.

ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల ఖర్చులను ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని ఈ చట్టంలోని 76వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి, సవరణలకు అయ్యే ఖర్చులు, గ్రామపంచాయితీ ఎన్నికల నిర్వహణతో సహా ఎన్నికల నిర్వహణ ఖర్చులు, అందుకు సంబంధించిన అన్ని రకాల ఖర్చులు ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది.

## పంచాయితీ బడ్జెట్

బడ్జెట్ రూపొందించడం, దానిని ఆమోదించడానికి సంబంధించి ఈ చట్టంలోని 77 సెక్షన్‌లో పేర్కొన్నారు.

కార్యనిర్వాహణ అధికారి నిర్ధేశించిన తేదీ కంటే ముందు గ్రామ పంచాయితీ ఆదాయ వ్యయాలకు సంబంధించిన అంచనాలతో కూడిన వార్షిక బడ్జెట్‌ను గ్రామ పంచాయితీ ముందు ఉంచాలి. అట్టి బడ్జెట్‌ను గ్రామ పంచాయితీ ఒక మాసంలోగా అవసరమని భావించిన సవరణలతో ఆమోదించాలి.

అయితే ఏదేని కారణం చేత గ్రామ పంచాయితీ బడ్జెట్‌ను నిర్ధేశించిన నెల రోజుల గడుపులోపల ఆమోదించక పోయినట్లయితే, కార్యనిర్వాహణ అధికారి బడ్జెట్‌ను డివిజనల్ పంచాయితీ అధికారి ఆమోదం కోసం సమర్పించాలి. డివిజనల్ పంచాయితీ అధికారి అవసరమని భావించిన సవరణలతో బడ్జెట్‌ను ఆమోదించాలి.

గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణ అధికారి ప్రతిపాదించిన బడ్జెట్‌ను నిర్దేశిత గుడువులోగా ఆమోదించక పోయినట్లయితే, కార్యనిర్వాహణ అధికారి బడ్జెట్‌ను డివిజనల్ పంచాయితీ అధికారి ఆమోదం కొరకు సమర్పించాలి. డివిజనల్ పంచాయితీ అధికారి అవసరమని భావించిన సవరణలతో బడ్జెట్‌ను ఆమోదించాలి.

గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణ అధికారి ప్రతిపాధించిన బడ్జెట్‌ను నిర్దేశిత గడువులోగా ఆమోదించినట్లయితే, అట్టి బడ్జెట్‌ను కార్యనిర్వాహణ అధికారి నిర్దేశిత తేదీ లోపు డివిజనల్ పంచాయితీ అధికారికి పంపించాలి. డివిజనల్ పంచాయితీ అధికారి అవసరమని భావించిన సూచనలు లేదా సవరణలు చేసి గ్రామ పంచాయితీకి నెల రోజుల లోపు తిరిగి పంపించాలి. గ్రామ పంచాయితీ సవరణలతో గానీ, యధాతథంగా గాని ఈ బడ్జెట్‌ను ఇందు కొరకు నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించబడినదే బడ్జెట్ తుది రూపం.

బడ్జెట్‌లో పేర్కొన్న ఆదాయ వ్యయాలకు సంబంధించి అట్టి సంవత్సరంలో ఏదేని మార్పులు చేయడం అవసరమని గ్రామ పంచాయితీ భావించినట్లయితే అనుబంధ లేదా సమీక్షించిన బడ్జెట్‌ను పైన పేర్కొన్న పద్ధతిలోనే అనుసరించి సవరించాల్సి ఉంటుంది.

గ్రామపంచాయితీ పరిధిలోని ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వం లేదా ఇతర గ్రామపంచాయితీ లేదా మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ లేదా రాష్ట్రంలోని ఏదేని ఇతర స్థానిక సంస్థ ఈ చట్టంలో పేర్కొన్న విధంగా ఖర్చులు పెట్టినట్లయితే, కమీషనర్ వారి ఆమోదంతో, వారి ఆదేశానుసారం అట్టి సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది అని ఈ చట్టంలోని 78వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

పంచాయితీరాజ్ చట్టం 1994లోని అంశాలను 73వ రాజ్యాంగ సవరణలో పెనవేసి చూడటం ద్వారానే వీటి పరస్పర విస్తృతిని అవగాహన చేసుకోగలం.

***– వి. రఘు,*** న్యాయవాది



# కాకి పడగలోళ్ళు

**జనపదాలు జానపద కళలకు పుట్టిళ్ళు. తవ్వితీయాలి గాని, అజ్ఞాతంగా ఉన్న ఎందరో కళాకారులు బయటికి వస్తారు. సూర్యకర స్పర్శసోకని పేటికాంతర్గత రత్నాలు ఈ కళాజీవులు. దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నా శతాబ్దాల నుండి అనువంశికంగా వస్తున్న కళాప్రక్రియను మాత్రం వదులుకోవడానికి సుతరామూ అంగకరింపని అభిమానం వారిది. తెలంగాణా ప్రాంతంలో విద్యావంతుల పరిశోధకుల దృష్టికి రాని కళాకారులు 'కాకి పడగలోళ్ళు'. వీరినే 'పాండవులోళ్ళు' అని కూడా వ్యవహరిస్తారు.**

### ముత్తరాశివాళ్ళే....

ముత్తరాశి వాళ్ళే 'కాకి పడగలోళ్ళు' గా పిలువబడుతున్నారు. 'ముత్తరాశి' వారిని తెలంగాణాలో ముదిరాజులు, తెలుగు వాళ్ళని కూడా పిలుస్తారు. వీరు తెలంగాణామంతటా అన్ని గ్రామాలలో ఉన్నారు. పండ్లు, చేపలు వగైరా అమ్ముకొని జీవిస్తారు. ఉదర పోషణార్థం వారే వృత్తిని అవలంబించినా ప్రవృత్తి మాత్రం పాండవ కథాగానం, పాండవుల కథాగానం చేసేవారు కాబట్టి వీరు 'పాండవులోళ్ళు' అని పిలువబడుతున్నారు.

### పాండవుల కథ

'చిందు భాగవతం' ఆధారంగా సృజింపబడ్డ కళారూపం పాండవుల కథ. భారతానికి సంబంధించిన పాండవులగాధ ఇతివృత్తం. నలుగురు వ్యక్తులు గానం చేసే ఈ ప్రక్రియలో ప్రధాన కథకుడు కాక ఇరువురు స్త్రీలు, పురుషులు అతనికి వంతలుగా సహకారం అందిస్తారు. వేషధారణ, అలంకరణ వారే చేసుకుంటారు. వారి కథాగేయాలు వారల్లుకున్నవే. పాండవుల కథను వివరించే బొమ్మలు (చిత్రాలతో) కలిగిన 'పటం' సహాయంతో వీరు కథ చెబుతారు. బొమ్మలను చూపేందుకు నల్లని, సన్నని కర్రను ప్రధాన కథకుడు వినియోగిస్తాడు. కథ చెబుతూ మధ్యమధ్య నెమలి ఈకలతో కూడిన ఫించంతో పటాన్ని ప్రధాన కథకునితో పాటు ఉన్న సహాయకుడు తడుముతూ వుంటాడు. వారి కథాగేయాలు వారల్లుకున్నవే. అప్పటికప్పుడు ఆశువుగా సందర్భానికి అనుగుణంగా లయ, దరువుకు ఒదిగేట్లుగా పాటలు కడతారు. బుర్రలు, తాళాలు, గజ్జెలను ఈ కథ చెప్పడంతో ఈ కళాకారులు ఉపయోగిస్తారు.

### పాండవుల కథలోని ఘట్టాలు

పాండవుల కథలో భూమ్యాకాశాల పుట్టుకను మొదటగా ఈ కళాకారులు చెబుతారు. తరువాత పాండవుల పుట్టుక, లక్కఇండ్లు, హిడింబాసుర వధ, బకాసురవధ, మత్స్యయంత్రం, మాయాజూదం,శశిరేఖ, సుభద్రాకళ్యాణం, రంభరంపాల కళ్యాణం, కర్ణకళ్యాణం, కుర్రసేను రామరుషివనం, మృగమారుషివనం, కీచక వధ, ఉత్తర గోగ్రహణం, కృష్ణరాయబారం, కురుక్షేత్రం, భీష్మపర్వం, శల్యపర్వం, కృష్ణపర్వం, ద్రోణపర్వం, కర్ణపర్వం, గదాపర్వం మొదలైన ఘట్టాలను పాండవులోళ్ళు అద్భుతంగా చెబుతారు.

### నారాయణ కథనం

వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండలంలోని మన్‌సాన్‌పల్లికి చెందిన కాకిపడగల కుటుంబానికి చెందిన శ్రీ రెడ్డబోయిన నారాయణను కలుసుకొని వారి కథా -కమామిషూ గూర్చి అడిగి తెలుసుకోవడం జరిగింది. వృద్ధుడైన నారాయణ పాండవుల కథ చెప్పే తమ కళాకారుల కుటుంబాలు వేళ్ళలో లెక్కించే సంఖ్యలో మాత్రమే ఉన్నాయని చెప్పారు. నిమ్మల బలరాం తమ కళాకారులలో ప్రఖ్యాతి నొందిన వ్యక్తి అని ఆ తరువాత నిమ్మల కిష్టయ్య రెడ్డబోయిన సమ్మయ్య, చంద్రయ్య, నిమ్మల రామచంద్రు ఈ కథను నిలబ-డుతూ వస్తున్నారని ఆయన తెలిపారు.

ప్రస్తుతం తమ కుటుంబాలకు చెందినవారు మెదక్ జిల్లా సిద్ధిపేట తాలుకా బలంతపురం గ్రామంలో రెడ్డబోయిన పెంటయ్య, వెంకటయ్య, వరంగల్ జిల్లా మహబూబాబాద్ తాలుకా అపురాశిపల్లి గ్రామంలో కాకిపడగల సమ్మయ్య, యాదగిరి, వరంగల్ జిల్లా నర్సంపేట తాలుకా బోళ్ళేన్‌పల్లి గ్రామంలో చిక్కుడు సారయ్య, భద్రయ్య, కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో రెడ్డబోయిన లచ్చయ్య, కాకిపడగల కిష్టయ్య, మల్లయ్య ఉన్నారని ఆయన చెప్పారు.

అలాగే హైదరాబాదు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూడా కొన్ని కాకిపడగల కళాకారుల కుటుంబాలు ఉన్నాయని నారాయణ తెలిపారు. దశాబ్దాలుగా విస్తృతమైన ప్రజాదరణకు తమ కళారూపం నోచుకున్నదని ఆయన చెప్పారు. వంశపారంపర్యంగా తాత ముత్తాతల నుండి తామీ కళారూపాన్ని నేర్చుకున్నామని ఆయన అన్నారు. తమ కళాకారుల కుటుంబాలు ప్రదర్శన నిమిత్తం గ్రామాలను పంచుకుని, ఎవరి

గ్రామంలో వారు ప్రదర్శనలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. తాము ప్రదర్శించినంత కాలం ఆ ఊళ్ళోకి ఇతర కళాకారులు రాకుండా తమ మధ్య అవగాహన ఉంటుందని ఆయన చెప్పారు.

గ్రామంలోకి వెళ్ళగానే తమ ముత్తరాశి కులానికి చెందిన వారి ళ్ళను వెదకి తమ ప్రదర్శనలను గురించి, వారికి చెబుతామని ఆయన తెలిపారు. ప్రదర్శన కోసం వారు డబ్బులు, బియ్యం, వడ్లు తమకు ఇస్తారని ఆయన చెప్పారు. గ్రామమంతా తాము ప్రదర్శించినా ప్రతిఫలం మాత్రం ముత్తరాశి వారి ఇళ్ల నుండే తీసుకుంటామని, ఇది తమ కులాచారమని నారాయణ చెప్పారు. గ్రామాన్ని బట్టి మూడు నాలుగు రోజుల పాటు ఏకబిగిన కథను చెబుతుంటామని ఆయన తెలిపారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 2 గంటల వరకు తమ కళారూపాన్ని గ్రామాలలో ప్రదర్శిస్తుంటామని ఆయన చెప్పారు.

ముత్తరాశి వారి ఇళ్ళల్లో ప్రత్యేకమైన పండుగలు జరిగితే వారి ఇళ్ళల్లోనే తాము విడిగా కూడా తమ కళారూపాన్ని ప్రదర్శిస్తామని నారాయణ తెలిపారు. కాకిపడుగల సింగరి, కాకిపడగల రంగం, కాకిపడగల హనుమంతు తమ కళారూపాన్ని తీర్చిదిద్దడానికి, కొత్తగా పద్యాలను, పాటల ను రూపొందించడానికి కృషి సలిపారని ఆయన చెప్పారు.

## శారద స్తుతిలో కథ ప్రారంభం

శారదాదేవిని ప్రథమంగా స్తుతించి కథ ప్రారంభిస్తే తమకు శుభప్రదమని కాకిపడగలు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

*'శ్రీ శారదాంబ దేవికి – దాసుండనె శరణుజేతును*
*ధరణిలో దలిచెద – దోసంబులన్నీ విడబాపవమ్మ*
*వాణి జగదంబ నీకు – వందనమ్మమ్మ'*

శారదాస్తుతి తరువాత విఘ్నగణాధిపతి ఐన గణేశుణ్ణి స్తుతిస్తూ 'శుక్లాంబరధరం విష్ణుం' శ్లోకం ఆలపిస్తారు. అనంతరం పాండవుల పుట్టుకతో కథను చెప్పడం ప్రారంభిస్తారు. పాండవుల కథను వివరించే చిత్రాలతో కూడిన 'పటాన్ని' కథా వివరణకు ఉపయోగిస్తారు. పావుగంట నుండి అర్ధగంట వరకు ఒక్కో బొమ్మను చూపిస్తూ కథ చెబుతారు. సంవత్సరమంతా గ్రామాలలో పర్యటిస్తూ వీరు తమ కళారూపాన్ని ప్రదరి ృస్తూ ఉంటారు. వీరి స్వస్థలంలో ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో కేవలం ఈ కళారూపమే జీవనోపాధిగా మారింది. స్థిరమైన నివాసం లేకపోవడంతో పూరిగుడిసెలే వారికి ఆశ్రయాన్నిస్తున్నాయి.

## పాండవుల కథలోని వివిధ ఘట్టాలు

పాండవుల కథలోని వివిధ ఘట్టాలకు సంబంధించిన సన్నివేశాల ను చక్కని పాటలు, పద్యాల రూపంలో కాకిపడగల కళాకారులు చక్కగా ఆలపిస్తారు. వాటిలో కొన్ని ఇక్కడ ఉదాహరిస్తున్నాము.

*'శ్రీ రాధమనియదరమున – కోరి ముద్దాడినట్టి*
*కోమలగాత్ర – సారంబునయనుల బ్రోవుమి*
*ధరణీబీపేటవార – దాశకి పోష'*

కురుక్షేత్రంలో భీముని పరాక్రమం గూర్చి

*'బండన భీముడు*
*వార్జన బ్రాణతోన – ఉజ్వల బాల ప్రచాండ*
*భుజభల తాండవవార్తికి – రామమూర్తికి*
*కడగట్టి బేరి ముదియ*
*కరుణించవే జగదాంబ*
*నీకు శరణు జేసేద శారదాంబ*
*కరుణించు నీపాద – కమలములిప్పుడు*
*మరమక సాధుతీతు*
*మదిలోన నాతల్లి*
*మమ్ము ప్రస్తుతించు కల్పవల్లి'*

కీచకుడు ద్రౌపదిని చెరబట్టాలని ప్రయత్నించే సమయంలో...

*'శృంగార గుణమణి*
*వయ్యారి నా ప్రాణమణీ*
*భంగము సాయల*
*రంగిన నీమోము*
*శృంగార మిటుజూపవే*
*ఓ సుందరి నేతళనే*
*విందుకూ నాతో వాదము*
*కీచక నిందే వచ్చున ముందే కీడు*
*అందాని మాకూల్లో దూపండ్లు కోయుట*
*అందెసందమా కీచకా*
*ననుకోరరాకురా దూషకా*
*ఓజాలపు సరసూమణి*
*వయ్యారి నాప్రాణమణి*
*రంకేలా చేసేవు*
*ఊ పంకాజాక్షిరో*
*ఓపరాత్రిలో కీడింతమా'*

## ఆదరణ అవసరం

అపురూపమైన ఈ కళారూపాన్ని చూసి ఎందరో ప్రశంసిస్తున్నా, తగిన ఆర్థిక, హార్థిక, సహకారం అందించాల్సిన అవసరం ఎంతో ఉందని కళాకారులు అంటున్నారు. ప్రభుత్వపరంగా తమకు చేయూత కావాలని వారంటున్నారు. తమకు ప్రభుత్వం గృహాలు నిర్మించి ఇవ్వాలని, పిల్లలకు విద్యా సౌకరాన్ని కలిగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎందరో బీద కళాకారులతో నడుస్తున్న తమ కళారూపానికి ఆకాశవాణి, దూరదర్శన్‌లు అండగా నిలవాలని వారు కోరుతున్నారు. రాష్ట్ర జాతీయ కళాసాంస్కృతిక సంస్థలు తమతోపాటు ఈ కళారూపం అంతరించిపోకుండా ఉండేందుకు గాను అన్ని స్థాయిలలో తమ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

గ్రామాలలో ఆబాలగోపాలాన్ని అలరింపజేసే 'పాండవుల కథ' కనుమరుగవుతున్న వర్తమానంలో ఈ కళాప్రక్రియపైన పరిశోధకులు దృష్టి మళ్ళించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**– ఎ.ఎమ్. ఫీచర్స్**

షెడ్యూలు (గిరిజన) ప్రాంతాలలో సామాజిక ఆర్థిక పరిస్థితులు వేరుగా ఉంటాయి కాబట్టి, ఆ ప్రాంతాలకు పంచాయితీరాజ్ చట్టాన్ని కొన్ని మార్పులతో చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించి భూరియా కమిటి వారి సలహాలతో 1996లో పార్లమెంటు (40 చట్టం 1996), 1998లో మన రాష్ట్రం అసెంబ్లీ (7వ చట్టం, 1998) ఆమోదించటమైనది. వీటి అమలుకు కావలసిన నియమాలను మన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయవలసి ఉంది.

ఈ మధ్యనే కేంద్రప్రభుత్వ పంచాయితీరాజ్ శాఖకు డాక్టర్ బి. డి. శర్మగారి నేతృత్వంలో నియమించబడ్డ సబ్-కమిటీ, వారి నివేదికను సమర్పించింది. అయితే 'పీసా' చట్టం ద్వారా షెడ్యూలు ప్రాంతాలలో గ్రామసభలకు, పంచాయితీలకు సంక్రమించే అధికారాలు గురించి ఆయా సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తెలియచేయుటమే ఈ వ్యాసం ముఖ్యఉద్దేశం.

### షెడ్యూలు గ్రామాల గుర్తింపు

భారత రాజ్యాంగం 5వ షెడ్యూలు ప్రకారం, ఏదైనా ప్రాంతాన్ని షెడ్యూలు ప్రాంతంగా గుర్తించటానికి, షెడ్యూలు ప్రాంతాల సరిహద్దులను మార్చడానికి భారత రాష్ట్రపతికి అధికారాలు ఉన్నాయి. అధికారాలు ఉన్నాయి. ఏదైనా అమలులో ఉన్న కేంద్ర, రాష్ట్ర చట్టాన్ని షెడ్యూలు ప్రాంతాలకు పూర్తిగా వర్తింపచేసేందుకు, మార్పులతో వర్తింప చేసేందుకు, అసలు వర్తింపకుండా చేసేందుకు అధికారాలు ఉన్నాయి. ఉదాహరణకు, మైదాన ప్రాంతాలలో ఆరు శాతం ఉపాధ్యాయుల ఉద్యోగాలు గిరిజనులకు కేటాయిస్తే, షెడ్యూలు ప్రాంతంలో మాత్రం నూటికి నూరు శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలలో స్థానిక గిరిజనులనే నియమించాలని ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు ఈ అధికారంతో ఇచ్చినవే. అదే కాక షెడ్యూలు ప్రాంతాలలోని భూమిని రక్షించేందుకు, వడ్డీ వ్యాపారుల వ్యాపారాన్ని క్రమబద్ధీకరించేందుకు కొత్త చట్టాలు తెచ్చేందుకు గవర్నరుకు అధికారాలు ఉన్నాయి. ఇందుకోసం గిరిజన సలహామండలి ఆమోదం, రాష్ట్రపతి ఆమోదం పొందవలసి ఉంది. 5వ షెడ్యూలు క్రింద గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేస్తారు. ఇందులో షెడ్యూలు ప్రాంతాల నుండి ఎన్నికకాబడిన అందరు గిరిజన శాసనసభ్యులు ఉంటారు. గిరిజన వ్యవహారాలపై ఈ మండలి సలహా ప్రభుత్వం తీసుకోవాలి. అందుకే దీనిని చిన్న శాసనసభగా వర్ణిస్తారు. షెడ్యూలు ప్రాంతాల (భూమి బదలాయింపు) చట్టం 1959, దానికి 1970లో సవరణ, వడ్డీ వ్యాపారస్థుల చట్టం లాంటివి యీ 5వ షెడ్యూలు ద్వారా సంక్రమించిన అధికారాలతో వచ్చిన చట్టాలే.

# 'పీసా' చట్టం ద్వారా షెడ్యూలు ప్రాంతాలలో గ్రామసభలకు అధికారాలు బదలాయింపు

### షెడ్యూలు ప్రాంతాల గుర్తింపు, ప్రకటన

భారత రాజ్యాంగం 5వ షెడ్యూలు ప్రకారం, భారత రాష్ట్రపతి ఏదైనా ప్రాంతాన్ని షెడ్యూలు ప్రాంతంగా గుర్తించటానికి, షెడ్యూలు ప్రాంతాల సరిహద్దులు మార్చటానికి అధికారాలు ఉన్నాయి. రాజ్యాంగపరంగా, రాష్ట్రపతికి సంక్రమించిన ఈ అధికారాలతో షెడ్యూలు ప్రాంతాలను ప్రకటిస్తారు. ఈ ప్రాంతాలను గుర్తించేందుకు నాలుగు సూత్రాలను పాటిస్తారు.

i) షెడ్యూలు తెగలు 50 శాతం కంటే ఎక్కువగా నివశించే ప్రాంతం,

ii) సంఘటిత ప్రాంతాలుగా ఉండి, సబబైన విస్తీర్ణం కలిగి ఉండడం,

iii) పాలనాపరంగా అనుకూలంగా ఉండే ప్రాంతం,

vi) బాగా వెనుకబడిన ప్రాంతం.

ఈ విధంగా మనదేశంలో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా, రాజస్థాన్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ మరియు జార్ఖండ్ వంటి (9) రాష్ట్రాలలో 5వ షెడ్యూలు ప్రాంతాలను ప్రకటించారు.

5వ షెడ్యూలు ప్రాంతాలలో రాష్ట్ర గవర్నరుకు ప్రత్యేకమైన

షెడ్యూలు ప్రాంతాలను ప్రకటించినట్లే, భారత రాష్ట్రపతి షెడ్యూలు తెగలను కూడా రాష్ట్రాల వారీగా ప్రకటిస్తారు. అయితే షెడ్యూలు తెగల జాబితాలో కొత్త తెగలను చేర్చటం కాని, ఉన్న వాటిని తొలగించేందుకు కాని పార్లమెంటుకు అధికారం ఉంది. దేశం మొత్తంలో ఇప్పుడు 700 షెడ్యూలు తెగలు ఉంటే వాటిలో 75 తెగలు చాలా ప్రాచీనంగాను, వెనుకబడినవిగాను ఉన్నట్లు కేంద్రప్రభుత్వం గుర్తించింది. దేశంలో 84.30 కోట్ల షెడ్యూలు తెగల జనాభా ఉంటే వీరిలో ఎక్కువమంది 5వ షెడ్యూలు ప్రాంతాలలోనే నివశిస్తున్నారు. అందువల్ల వీరి రక్షణకు, ప్రగతికి ఎన్నో చట్టాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలుపరుస్తున్నారు.

మన రాష్ట్రంలో 35 షెడ్యూలు తెగలవారు ఉన్నారు. వాటిలో 8 తెగలు ప్రాచీనంగాను, వెనుకబడినవి గాను గుర్తించారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్లు, ఆదిలాబాదు, మహబూబ్‌నగర్ జిల్లాలలో 31,485.34 చ॥కి॥మీ॥ వైశాల్యంలో విస్తరించి ఉంది. రాష్ట్రంలోని 31 షెడ్యూలు తెగలు (60 శాతం జనాభా) యీ ప్రాంతంలోనే నివశిస్తున్నారు. రాష్ట్రంలోని 60 శాతం అడవి యీ


ప్రాంతంలోనే ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాలు బయటి ప్రాంతాలతో సంబంధం లేకుండా ఉంటాయి.

తరతరాలుగా అడవి కొండ ప్రాంతాలలో బయటి ప్రపంచానికి సంబంధం లేకుండా ఉండడం వల్ల షెడ్యూలు (గిరిజన) తెగలు వారిదైన జీవనవిధానాన్ని (సంస్క ృతి) రూపొందించుకున్నారు. చెట్లు, జంతువులు, సెలయేళ్ళు, కొండలు లాంటివి వారి సంస్కృతిలో భాగం. ప్రతి గ్రామానికి ఒక సరిహద్దు నిర్ణయించుకున్నారు. ఆ సరిహద్దులోని వనరులన్నింటిని ఆ గ్రామస్థుల ఉమ్మడి ఆస్తిగా నిర్ణయించుకున్నారు. జీవనాధారాలు అయిన ఆ వనరుల సమిష్టి యాజమాన్యానికి కూడా, నియమాలు రూపొందించుకున్నారు. ఒక గ్రామ పొలిమేరు లేక సరిహద్దు లేక శివారును ప్రక్క గ్రామాలు గౌరవిస్తాయి. ఒకరి ఆస్తిలోకి మరొకరు చేరబడకుండా నియమాలు ఉన్నాయి. యీ నియమాలను ఉల్లంఘించినవారిపై సంస్కృతిపరంగా చర్య తీసుకునేందుకు కులపంచాయితీలు, గ్రామపంచాయితీలు, కొన్ని గ్రామాలను కలిపిన పంచాయితీలు లాంటివి ఏర్పరుచుకున్నారు. ఈ మధ్యనే (2005) ఈ రచయిత రంపచోడవరం, ఆదిలాబాదు, నల్లమల అడవులలో జరిపిన పరిశోధనల ప్రకారం 98 శాతం తగవులను వారి కుల లేక గ్రామ పంచాయితీలే తీరుస్తున్నాయని తేలింది. హత్య, హత్యాప్రయత్నం లాంటి నేరాలు మాత్రం పోలీసుస్టేషన్‌లో నమోదు అయి కోర్టులలో నడవడం గమనించడం జరిగింది.

గిరిజన సంస్కృతిలో మరొక ముఖ్యభాగం మతం. గిరిజనుల మతాన్ని మానవ శాస్త్రజ్ఞులు క్లుప్తంగా చెబుతూ అది 'మానవాతీతశక్తిపై నమ్మకంగా' వర్ణించారు. ఎల్. పి. విద్యార్థి గారి దృష్టిలో మానవుడు ప్రకృతి-మానవాతీతశక్తుల సంకీర్ణమే గిరిజన మతానికి ముఖ్యం. అందువల్ల ప్రకృతి వనరుల యాజమాన్యంలో నమ్మకాలు కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. దీనివల్లే అటవీ ఫలసాయం (బీడి ఆకులు కూడా) అడవి మామిడి లాంటివి పరిపక్వానికి వచ్చిన తరువాత ప్రకృతి దేవతలకు ధన్యవాదాలు తెలిపే పూజలు చేసి కాని వాటిని కోయరు. ఇవన్నీ పరిశీలిస్తే తెలిసేదంటే, గిరిజనులు వారిదైన యాజమాన్య పద్ధతులను తరతరాలుగా అభివృద్ధి చేసుకుని, అవలింబిస్తున్నారు. అందువల్ల చాలా గిరిజన గ్రామాలలో కుల గ్రామపంచాయితీ వ్యవస్థ ఇప్పటికీ చాలా పటిష్టంగా ఉందని తెలుస్తోంది.

అయితే, గిరిజన ప్రాంతాలకు రోడ్లువేసి, పాఠశాలలు పెట్టి మార్కెట్లు అభివృద్ధి చేశారు. ఆ తరువాత వార్తాపత్రికలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ పథకాలు మొదలగునవి పెరిగాక బయటి ప్రపంచంతో గిరిజనులతో సంబంధాలు పెరిగాయి. బయటి వ్యాపారస్థుల తాకిడి కూడా పెరిగింది. షెడ్యూలు ప్రాంతాలకు గిరిజనేతరుల వలసలు కూడా పెరిగి కొన్ని ప్రాంతాలలో 50 శాతం వరకు గిరిజనేతరులు చేరుకున్నారు.

మారుతున్న ఆర్థిక, సామాజిక వాతావరణాన్ని ఎదుర్కొని, నిలబడేందుకు గిరిజనులకు కొత్త స్తోమత కావాలి. కుల పంచాయితీల స్తోమత, నియమాలు చాలవు. రాజ్యాంగపరంగా ఈ కొత్త స్తోమతను షెడ్యూలు ప్రాంతాలలోని గ్రామసభలకు కొన్ని ప్రత్యేక అధికారాలు




ద్వారా కల్పించటమే పీసా చట్టం ఉద్దేశం.

భారత రాజ్యాంగం (73వ సవరణ) చట్టం, 1992 లో చేసిన తరువాత ఆ చట్టాన్ని 5వ షెడ్యూలు ప్రాంతాలకు వర్తింపచేసేటప్పుడు పరిశీలించవలసిన అంశాలను గుర్తించి అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేందుకు పార్లమెంటు సభ్యులు శ్రీ దిలీప్‌సింగ్ భూరియా గారి అధ్యక్షతన ప్లామెంటు సభ్యుల కమిటీని కేంద్ర ప్రభుత్వం (గ్రామీణాభివృద్ధి శాఖ) జూన్ 10, 1994లో నియమించింది. వారి సూచనల మేరకు చేసిన, పంచాయితీ చట్టం (షెడ్యూల్ ప్రాంతాలకు వర్తింపు) 1996 (40వ చట్టం, 1996), డిసెంబర్ 24, 1996న రాష్ట్రపతి ఆమోదం పొందింది. అలాగే మన రాష్ట్రంలో కూడా ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ (సవరణ) చట్టం, 1988 (7వ చట్టం, 1998) జనవరి 16, 1998 నాడు రాష్ట్ర గవర్నర్ ఆమోదం పొందింది. మన రాష్ట్ర చట్టంలోని వివరాలు, సంబంధిత చట్టాలు, అమలులో అధిగమించవలసిన ఇబ్బందులు ఇప్పుడు పరిశీలిద్దాం.

షెడ్యూలు ప్రాంతాలలో గిరిజనులకు తమదైన జీవనశైలి ఉందని గుర్తించిన ప్రభుత్వం, పీసా చట్టం ద్వారా పంచాయితీరాజ్ చట్టంలో పొందుపరచిన సవరణలో ముఖ్యమైనది 'గ్రామం' యొక్క నిర్వచనం (24 ఎ), గ్రామం అంటే ఆవాసం, ఆవాసాల గుంపు, శివారుగ్రామం, శివారు గ్రామాల గుంపు - ఒకే సమాజం కాని, కొన్ని సమాజాలు కాని కలిసి ఉండి ఆ గ్రామానికి సంబంధించిన వ్యవహారాలన్ని, ఆచార వ్యవహారాల ద్వారా వారే నిర్వర్తించుకునేదే గ్రామం. ఈ నిర్వచనం ఇంతముందు వివరించిన గిరిజన సంస్కృతికి అనుగుణంగా ఉంది. అయితే ప్రభుత్వ అటవీ యాజమాన్యానికి సంబంధించిన వరకు వారి సరిహద్దులు వేరేగా ఉంటాయి. కాబట్టి తగవులు వచ్చే అవకాశం ఉంది. కొంతవరకు సామాజిక అటవీ యాజమాన్యానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులో మాత్రం, గిరిజనులు గుర్తించిన సరిహద్దులకు లోబడే వనసంరక్షణ సమితి హద్దులు కూడా నిర్ణయించటం వల్ల గ్రామాలు / శివార్ల మధ్య యాజమాన్య తగువులకు షెడ్యూలు ప్రాంతంలో ఆస్కారం లేకుండాపోయింది. రాబోయే నిబంధనల్లో ఈ విధంగా సమన్వయం ఉంటే బాగుంటుంది.


గిరిజనుల ఆచారం, వ్యవహారాలు, సంస్కృతిపరంగా గుర్తింపు, సామాజిక వనరుల నిర్వహణ బాధ్యత గ్రామసభకు (242 బి) అప్పచెప్పటం జరిగింది. ఇది ఎలాగూ గిరిజనుల పంచాయితీలు చేస్తున్నాయి కాబట్టి ఏ సమస్య ఇంతవరకు రాలేదు. అయితే

గిరిజనేతరులు కూడా ఎక్కువగా ఉన్న గ్రామంలో దీనిని ఎలాగ నిర్వహించాలి అనేది ఆలోచించవలసిన విషయం.

242 సి ప్రకారం, గ్రామసభలకు కొన్ని కర్తవ్యాలు ఇవ్వబడ్డాయి. గ్రామపంచాయితీ చేపట్టే సామాజిక, ఆర్థికాభివృద్ధి ప్రతి పథకం రూపకల్పన, అమలు పర్యవేక్షణ గ్రామసభ బాధ్యత దారిద్రరేఖకు క్రింద ఉన్న వారి అభివృద్ధికై చేపట్టే పథకాలకు సంబంధించిన లబ్దిదారుల ఎన్నిక బాధ్యత గ్రామసభదే. సరైన నియామావళి రూపొందించపోవటం వల్ల ఈ బాధ్యత నిర్వర్తించ లేకపోతున్నారు. పీసాచట్టం వచ్చిన పది సంవత్సరాల తరువాత కూడా సామాజిక అటవీ యాజమాన్యాల పథకం అమలు వనసంరక్షణ సమితుల ద్వారా జరుగుతోంది. అలాగే గ్రామీణ పేదరిక నిర్మూలనా పథకాలు సమాఖ్యల ద్వారా అమలు జరుగుతున్నాయి. ఇలాగే గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు కూడా గ్రామ సభల ద్వారా అమలు జరుగటంలేదు. రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పడ్డ గ్రామసభలు నిర్వర్తించాల్సిన పనిని, అధికార, అనధికార గ్రూపులు ద్వారా నిర్వర్తించటం వల్ల చట్టపరమైన వ్యాజ్యాలకు తావు లేకుండా చూసుకోవాలి.

షెడ్యూలు ప్రాంతాలలో మత్తు, మాదక పదార్థాల అమ్మకంపై నియంత్రణ కూడా గ్రామసభకు అప్పచెప్పటం జరిగింది. అయితే రాష్ట్ర అబ్కారీ చట్టం మాదక ద్రవ్యాల చట్టాలలో దీని గురించి మార్పులు చేయాలి. లేకపోతే గ్రామసభ ఈ పనిని నిర్వర్తించలేవు.

చిన్న / తరహా అటవీ ఫలసాయం గ్రామసభ ఆస్తిగా పీసా చట్టంలో పేర్కొనబడింది. అయితే ఇది అనుభవించే ఆస్తి హక్కా, సంపూర్ణ ఆస్తి హక్కా అనేది నిర్వచించాలి. ఇదే కాకుండా ఇప్పటికే చిన్నతరహా అటవీ ఫలసాయం వ్యాపారంపై ఉన్న చట్టాలను కూడా తగువిధంగా సవరించవలసి రావచ్చు. 5వ షెడ్యూలు క్రింద గవర్నర్‌గారు 1979లో ఇచ్చిన రెగ్యులేషన్ ప్రకారం షెడ్యూలు ప్రాంతాలలో ప్రభుత్వం ప్రకటించిన చిన్నతరహా అటవీ ఫలసాయం యొక్క వ్యాపారం కోసం గిరిజన సహకార సంస్థను ఏకైక అధికారిక సంస్థగా నిర్ణయించటం జరిగింది. అంటే వేరే వారికి అమ్మటం నిషేధించబడిందన్న మాట. అమ్మితే కొన్నవారు, అమ్మినవారు శిక్షార్హులు. అదేకాక బీడీ ఆకుల వ్యాపారంపై కూడా 1979లో జారీచేసిన చట్టం ప్రకారం, అటవీశాఖకు సర్వహక్కులు ఉన్నాయి. వారు పెట్టిన కళ్ళాలలోనే అమ్మాలి. పీసా చట్టం గ్రామసభకు చిన్నతరహా అటవీ ఫలసాయంపై ఆస్థిహక్కు ఇస్తే,




అదే ఫలసాయాన్ని మరో రెండు చట్టాలు ఒకే సంస్థకు తప్ప వేరెవరికీ అమ్మకూడదనే నిబంధన ఒకదానికొకటి విరుద్ధమా అనే అంశాన్ని కూడా పరిశీలించాలి.

గ్రామ మార్కెట్ల నిర్వహణ బాధ్యత కూడా గ్రామసభలకు అప్పగించటమైనది. అయితే ఇప్పటికీ అమలులో ఉన్న మార్కెట్ చట్టాలలో అవసరమైన సవరణలు చేయాలి. అలాగే సామాజికరంగంలో ఉండే ప్రభుత్వ సంస్థలు అంటే విద్య, వైద్యం లాంటి వాటి మీద కూడా గ్రామసభలకు ఆధిపత్యం ఇవ్వాలని చట్టం చెబుతోంది. సంబంధిత చట్టాలలో ఎంతవరకు మార్పులు చేయాలనే దానిమీద కూడా సుదీర్ఘ చర్చ జరగాలి. షెడ్యూలు ప్రాంతాలలో భూమి బదలాయింపు (1/70) చట్టం అమలు అధికారంకూడా పీసా చట్టంలో గ్రామ సభలకు ఇవ్వబడింది. ఇది ప్రస్తుతం స్పెషల్ డిప్యూటి కలక్టర్ (భూమి) చేస్తున్నారు. నియమాలను రూపొందించేటప్పుడు యీ వివరాలు జాగ్రత్తగా పరిశీలించాలి.

పీసా చట్టంలో గ్రామసభలకే కాక మండల పరిషత్‌కు కూడా అధికారాలు కల్పించబడ్డాయి. దీనిలో ముఖ్యమైనది భూసేకరణకు సంబంధించింది. అభివృద్ధి ప్రాజెక్టు (ఉదాహరణకు సేద్యపునీరు, పరిశ్రమలు) కు భూసేకరణ చేపట్టవలసినప్పుడు భూసేకరణకు ముందు, పునరావాస ప్రణాళిక తయారు చేసేముందు, దాని అమలులోను మండల పరిషత్‌తో తప్పక చర్చించాలని చట్టం చెబుతోంది. అయితే, మన రాష్ట్రంలో అమలులో ఉన్న పునరావాస విధానంలో షెడ్యూలు ప్రాంతాలలో అమలుపరచవలసిన విధానంపై ప్రత్యేక అధ్యాయం ఉంది. ఈ మధ్య చేపట్టిన భారీ, మధ్యతరహా సేద్యపు ప్రాజెక్టులు, సెజ్‌లకు కావలసిన భూసేకరణలో పీసా చట్టం పునరావాసా విధాన ఉల్లంఘన జరుగుతోందని హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఈ విషయంపై కూడా చర్చించి అమలులో లోపాల్ని సరిదిద్దాలి.

చిన్నతరహా నీటి వనరుల యాజమాన్యం బాధ్యత గ్రామపంచాయితీపై ఉంచబడింది. అదే విధంగా రంగురాళ్లు లాంటివి తవ్వేందుకు ముందు గ్రామపంచాయితీ సిఫార్సు తప్పనిసరి. దీని అమలులో లోపాలు కూడా సరిదిద్దితే గ్రామపంచాయితీ బలపడుతుంది.

షెడ్యూలు ప్రాంతాలలో గ్రామపంచాయితీ, మండల పరిషత్‌కు రిజర్వేషన్‌లు ఉన్నాయి. అలాగే జిల్లాపరిషత్ టెరిటోరియల్ కమిటీ, మండల పరిషత్ టెరిటోరియల్ కమిటీ ప్రతినిధుల ఎన్నికలో రిజర్వేషన్‌లు ఉండాలని గిరిజనులు కోరుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులాంటి నూటికి నూరుశాతం షెడ్యూలు ప్రాంతాలలో గిరిజనేతరులు జడ్.పి.టి.సి.లుగా ఎన్నిక అవుతున్నారని గిరిజన సంఘాల వాదన. ఇది కూడా పరిశీలించి, అవసరమైతే చట్ట సవరణ చేపట్టితే షెడ్యూల్ ప్రాంతాల నుండి షెడ్యూలు తెగలే ప్రాతినిధ్యం వహించే పరిస్థితిని కల్పించవచ్చు.

– డాక్టర్ వి.ఎస్.వి.కె. శాస్త్రి
*సలహాదారుడు (ప్రచురణలు), అపార్డు*



# కలియుగ భీములు

**మనం తరచూ సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాల్లో అసాధారణమైన బలం, శక్తి ఉన్న మనుషులను చూస్తుంటాం. కొంతమంది పురుషులు, అఖరికి స్త్రీలు కూడా అసాధారణమైన పనులు చేస్తుంటారు. ఉదాహరణకు కొందరు తమ పళ్లతోనో, వెంట్రుకలకు కట్టుకునో ట్రక్కుని కాని, కారుని కాని, విమానాన్ని కాని లాగుతుంటారు, మరి కొందరు పడుకుని, వాహనాలను తమపై నుంచి పోనిస్తుంటారు.**

అటువంటి దృశ్యాలు చూసినప్పుడు పిల్లలు వెంటనే 'ఓ' అంటూ ఆశ్చర్యానందాలలో మునిగిపోతుంటారు, నోటమాట రాక మాన్పడిపోయి చూస్తుంటారు. అయితే, కుటుంబంలోని పెద్దలకు ముఖ్యంగా తాతగార్లకు ఇలాంటివి పెద్ద విషయాలుగా అన్పించవు. "ఇలాంటివి మాకేమీ కొత్త కాదు, కోడి రామ్మూర్తి ఇట్లాంటి పనులెన్నో చేసేవాడు," అని తాతగార్లు చెప్తుంటారు.

కోడి రామ్మూర్తా! అని పిల్లలు ఆశ్చర్యపోవచ్చు. ఆయన గురించి మరింత తెలుసుకోవడానికి ఆసక్తి కనబరచవచ్చు,

20వ శతాబ్దపు తొలి అర్ధ భాగంలో కోడి రామ్మూర్తి పేరు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటింటా మారుమోగింది. ఆయన చూపిన అసాధారణ బలానికి భారతదేశ వ్యాప్తంగా ఆయనకు పేరు వచ్చింది. ఇంగ్లాండు, ఇతర యూరప్ దేశాల్లో ఆయన తన అసాధారణ బలాలను ప్రదర్శించి, మెప్పు పొందారు.

1882 ఏప్రిల్‌లో శ్రీకాకుళంలోని వీరఘట్టంలో జన్మించిన కోడి రామ్మూర్తి బాల్యంలోనే తన శక్తిని చాటారు. రామ్మూర్తి గొలుసుతో పులిపిల్లను బంధించి లాగుతూ రోడ్డుపై నడుస్తుంటే, ప్రజలు తమప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగెత్తేవారు. చదువు సంధ్యలపై శ్రద్ధ చూపనందుకు తండ్రి వెంకన్న కోప్పడటంలో రామ్మూర్తి ఒకసారి దగ్గరి అడవుల్లోకి పారిపోయారట. వారం తరువాత ఆయన ఆ పులి పిల్లతో తిరిగివచ్చారు.

రామ్మూర్తి పోకడతో విసిగిపోయిన వెంకన్న విజయనగరంలో పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న తన సోదరుడు నారాయణ స్వామి దగ్గరికి చదువు కొనసాగింపు కోసం రామ్మూర్తిని పంపారు. రామ్మూర్తి లోని శక్తిని, నైపుణ్యాన్ని గమనించిన నారాయణస్వామి అతన్ని ఒక వ్యాయామశాలలో చేర్పించారు. ఈ వ్యాయామశాలలో రామ్మూర్తి మల్ల విద్య నేర్చుకున్నారు. తరువాత ఉన్నత శిక్షణకు రామ్మూర్తిని మద్రాసుకి పంపించారు ఆయన, మద్రాసు నుంచి తిరిగివచ్చిన తరువాత విజయనగరంలోని ఒక ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా రామ్మూర్తి చేరారు.

కొత్తగా సంపాదించిన నైపుణ్యాలు, శక్తియుక్తులను ప్రదర్శించడానికి






రామ్మూర్తి త్వరలోనే ఒక సర్కస్ కంపెనీని స్థాపించారు. దేశంలోని ప్రాంతాలన్నిటినీ ఈ కంపెనీ సందర్శించింది. అనేక ప్రాంతాల్లో రామ్మూర్తి సర్కస్ కంపెనీకి మంచి పేరొచ్చింది. ఈ కంపెనీ ద్వారా అద్భుతమైన విన్యాసాలను ప్రదర్శించే వారు.

రెండు విభిన్న దిశలవైపు వెళ్తున్న రెండుకార్లను గొలుసులతో పట్టుకుని ఏక కాలంలో రామ్మూర్తి ఆపేవారు. ఆ కార్లు ఒక అంగుళం కూడా ముందుకు కదిలేవి కాదు. పూర్తి ఏక్సిలరేటర్ ఇచ్చినా కూడా కదిలేవి కాదు. కోడి రామ్మూర్తి వాటిని ముందుకు కదలనిచ్చే వారు కాదు. ఈ ప్రదర్శన ప్రజలకు అద్భుతంగా తోచేది.

ఇనుప గొలుసులతో తన శరీరాన్ని బంధించినప్పటికీ, గట్టిగా ఊపిరిపీల్చి, కండరాలను బిగించటం ద్వారా వాటిని విడదీయగలిగేవారు. ఐదు నిమిషాలపాటు తన ఛాతీపై ఏనుగుని నిలబెట్టుకుని ఆయన పడుకుని ఉంటే ప్రేక్షకులు నోరెళ్ల బెట్టుకొని చూసేవారు.



ఆ తరువాత కోడి రామ్మూర్తి స్వాతంత్ర్యోద్యమంలో కూడా ప్రవేశించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అలహాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రామ్మూర్తి ప్రదర్శనను చూసిన పండిట్ మదన్‌మోహన్ మాలవీయ ఆ ప్రదర్శనకు ఉబ్బితబ్బిబ్బయి, రామ్మూర్తి బృందానికి లండన్ టూర్ ఏర్పాటు చేశారు.

లండన్‌లో రామ్మూర్తి ప్రదర్శనను చూసిన చక్రవర్తి జార్జి, రాణి మేరి ఆయనను ఎంతగానో ప్రశంసించి, 'ఇండియన్ హెర్కులస్' అనే బిరుదుని ప్రదానం చేశారు. రామ్మూర్తి బృందం ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల్లో కూడా పర్యటించి ప్రదర్శనలు ఇచ్చింది.

స్పెయిన్ దేశం ఎద్దు పోరాట విద్యకు పెట్టింది పేరు. అటువంటి చోట రామ్మూర్తి తన విద్యతో ప్రజలను అబ్బురపరిచారు. ఒక బలమైన ఎద్దుని దాని కొమ్ములతో నిలువరించి గిరగిరా తిప్పి నేలకేసి కొట్టి స్పెయిన్ ప్రజలను ఉద్రూత లూగించారు.

భారతదేశ వైస్రాయి లార్డ్ మింటో రామ్మూర్తి బలాన్ని పరీక్షించదలుచుకున్నారు. రామ్మూర్తి పైకి ఆయన తన కారుని నడిపారు. అయితే, ఇండియన్ హెర్కులస్ ఆ కారుని కదలనీయకుండా గొలుసులతో పట్టుకుని ఆపారు. ఈ ప్రదర్శనతో కోడి రామ్మూర్తి కీర్తి ఆకాశానికి ఎగిసింది.

కోడిరామ్మూర్తి తన విద్యలతో ఎంతో ధనాన్ని సంపాదించారు. కాని అందులో చాలా భాగాన్ని దానధర్మాలకి, స్వాతంత్ర్యోద్యమానికి ఖర్చు చేశారు.

ఒకసారి ఆయనకు కాలుపై ఒక గడ్డ లేచింది. దానికి శస్త్రచికిత్స



చేయవలసిన అవసరం ఏర్పడింది. మత్తుమందు లేనిదే శస్త్రచికిత్స చేయరు. అటువంటిది మత్తు మందు లేకుండానే శస్త్రచికిత్స చేయించుకుని, అంత బాధను కూడా ఆయన ఓర్చుకున్నారు. ఇందుకు ఆయన నేర్చుకున్న యోగవిద్యలు ఉపయోగపడ్డాయి. 1940లో కోడి రామ్మూర్తి తన 58 సంవత్సరాల వయస్సులో మరణించారు.

కోడి రామ్మూర్తి మల్ల విద్యలో, బారీబిల్డింగ్‌లో సాధించిన ఘనతను, వారసత్వాన్ని కొనసాగించేవారు కొందరున్నారు. దండమూడి రాజగోపాలరావు, కామినేని ఈశ్వరరావు, అర్జా జనార్ధనరావు, కరణం మల్లీశ్వరి వంటి వారు తాము సాధించిన విజయాలతో రాష్ట్రాన్ని గర్వపడేలా చేశారు. విశాఖపట్నంలోని ఇండోర్ స్టేడియానికి, శ్రీకాకుళంలోని క్రికెట్ స్టేడియానికి కోడిరామ్మూర్తి పేరు పెట్టారు. కోడిరామ్మూర్తి విగ్రహాన్ని విశాఖ బీచ్‌రోడ్‌లో నెలకొల్పారు.

1948లో లండన్‌లో జరిగిన ఒలింపిక్స్, 1956లో మెల్‌బోర్న్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిథ్యం వహించిన దండమూడి రాజగోపాలరావు గొప్ప వెయిట్‌లిఫ్టర్. సినిమా ప్రపంచంలో కూడా ఆయన మంచి ప్రఖ్యాతి సంపాదించారు. ఆయన నటించిన సినిమాల్లో 'నర్తనశాల' గొప్ప విజయం సాధించింది. ఈ చిత్రానికి అంతర్జాతీయ అవార్డు కూడా లభించింది. స్త్రీ వేషంలో వచ్చి కీచకుడిని హతమార్చిన భీముడిగా ఆయన నటించారు. ఈ పాత్రను తరువాత దివంగత ఎస్వీరంగారావు పోషించి, జకార్తాలో జరిగిన ఆఫ్రో ఆసియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమనటుడి అవార్డు పొందారు. విజయవాడలోని ఒక ఇన్‌డోర్ స్టేడియంకి దండమూడి రాజగోపాలరావు పేరు పెట్టారు.

దండమూడి రాజగోపాలరావు మాదిరిగానే కామినేని ఈశ్వరరావు కూడా కృష్ణాజిల్లాకు చెందినవారు. 1952లో హెల్సింకిలో జరిగిన ఒలంపిక్స్‌లో, 1956లో మెల్‌బోర్న్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఆయన పాల్గొన్నారు. తన విద్యలో ఆయన సొంత ప్రమాణాలను నెలకొల్పారు,

1954లో ఢిల్లీలో జరిగిన జాతీయక్రీడల్లో భారతదేశంలోనే బలమైన





పురుషుడిగా ఈశ్వరరావుని నిర్ణయించారు (90 కిలోల విభాగం). ఆయన ఒకటి కాదు, రెండుకాదు, ఏకంగా 25 జాతీయ రికార్డులను నెలకొల్పారు.

మొట్టమొదటిసారి జరిగిన ఆసియా క్రీడల్లో వెండిపతకం సాధించిన తొలి భారతీయ వెయిట్ లిఫ్టర్ కామినేని ఈశ్వరరావు. లండన్‌లో మిస్టర్ యూనివర్స్ టైటిల్‌ను కూడా ఆయన సాధించారు.

బాబ్ హాఫ్‌మాన్ అనే అమెరికన్ కోచ్ ఈశ్వరరావు గురించి ఇలా వ్యాఖ్యానించారు - "కామినేని ఈశ్వరరావులో మహాశక్తి ఉంది. దానికి శాస్త్రీయపరంగా శిక్షణ ఇస్తే సరిపోతుంది".

2002 డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని జియంసి బాలయోగి స్టేడియంలో జరిగిన 32వ జాతీయ క్రీడల్లో క్రీడా జ్యోతి వెలిగించే అవకాశం కామినేని ఈశ్వరరావుకి దక్కింది. 1963లోనే ఈశ్వరరావుకి అర్జున అవార్డుకూడా లభించింది. 89 ఏళ్ల వయస్సులో 2007 నవంబర్‌లో విజయవాడ సమీపంలోని తన స్వంత భట్ల పెనుమర్రు



గ్రామంలో ఈశ్వరరావు మరణించారు. 1966లో వచ్చిన 'భీమాంజనేయ యుద్ధం' చిత్రంలో ఈశ్వరరావు, దండమూడి రాజగోపాలరావు నటించారు.

చలనచిత్రాల్లో కూడా ప్రతిభ నిరూపించుకున్న మరొక బాడీబిల్డర్ అర్జా జనార్ధనరావు. ఆంజనేయ స్వామి పాత్రకు ఆయన జీవం పోశారు. 1926 డిసెంబర్‌లో మచిలీపట్నంలో జన్మించిన ఆయన '1955లో మిస్టర్ ఇండియా'గా ఎంపికయ్యారు. అనేక చిత్రాల్లో ఆయన నటించారు. అయితే బాపు దర్శకత్వం వహించిన ముత్యాలముగ్గు, సంపూర్ణ రామాయణం చిత్రాల్లో పోషించిన పాత్రలు ఆయనకు మంచి పేరు సంపాదించి పెట్టాయి. 2007 నవంబర్‌లో జనార్ధనరావు మరణించారు.

ఇనాల్టి తరం అనుకోవచ్చు - "ఈనాటి విషయాలు మాకు గానీ, నిన్నటి గురించి మాకెందుకు ? రేపు ఇంకా రాలేదు. దాని గొడవెందుకు?" అని అయితే గతంలో ఘనత సాధించిన గొప్ప భరతమాత బిడ్డల గురించి, వారి విజయాల గురించి ఈనాటి యువతీయువకులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఇట్లా తెలుసుకోవటం ద్వారా గతంలోని ఘనకీర్తిని పునశ్చరణ చేసుకుంటూ యువతీయువకులు మరింత గొప్ప విజయాలు సాధించడానికి స్ఫూర్తి పొందుతారు.

**- దాసు కేశవరావు**

(అనువాదం: వై.సరోజ)



# కొలాముల జీవితంలో వెలుగు నింపిన వెదురు

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో లొద్దిగూడ అనే చిన్న కుగ్రామం. ఆ గ్రామంలో మొత్తం 40 కొలాముల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామం మండల కేంద్రం నుండి దాదాపుగా 15 కిలోమీటర్ల దూరంలో చాలా మారుమూల ప్రాంతంలో ఉంది. గ్రామానికి సరైన బస్సు సౌకర్యంగానీ, మంచినీటి సౌకర్యం గానీ లేదు. విద్యా సౌకర్యం, ఆరోగ్యం ఇలా అన్ని సౌకర్యాలకూ ఆమడ దూరంలో ఉంది. గ్రామం నుండి బస్సు వెళ్ళే రోడ్డుకు చేరాలంటే కనీసం 5 లేక 6 కిలోమీటర్లు కాలినడక ద్వారా వెళ్ళాల్సిందే. వీరు చౌక ధరల డిపో నుండి బియ్యం, చక్కెర తీసుకుపోవాలన్నా 4 కి.మీ. దూరంలోఉన్న ధాబా అనే గ్రామానికి రావాల్సిందే.

గ్రామంలోని కొలాముల ముఖ్య జీవనోపాధి వ్యవసాయం. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. వీరు ముఖ్యంగా పత్తి, జొన్నలు, కందులు, సజ్జలు మొదలగు పంటలు పండిస్తున్నారు. వీరికి ఈ వ్యవసాయం చేయటం తప్ప వేరే జీవనోపాధి మార్గం ఉండేది కాదు. వేసవికాలంలో ఒక నెల రోజుల పాటు కలపేతర అటవీ ఉత్పత్తులు సేకరించి అమ్ముకునేవారు. వాటిని అమ్మడంలో కూడా వీరు దళారీల చేతులలో బాగా మోసపోయి సరైన ధరలు పొందలేకపోయేవారు. ఈ విధంగా అనేక సమస్యలతో సతమతమవుతూ జీవనం సాగిస్తుండేవారు.

ఇది ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ సామాజిక అటవీ యాజమాన్య' (ఎ.పి.సి.ఎఫ్.యం.) పథకం క్రింద ఆ గ్రామాన్ని వన సంరక్షణ సమితి గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. అందులో భాగంగా అటవీశాఖ అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించారు. మొట్టమొదటిసారి ఆ గ్రామానికి వచ్చిన అధికారులకు చేదు అనుభవమే ఎదురైంది. అధికారులు వనసంరక్షణ సమితి గురించి, ఎ.పి.సి.ఎఫ్.ఎమ్ గురించి వివరించడానికి ప్రయత్నించినా కొలాములు ఎవ్వరూ వారి దగ్గరకు వెళ్ళలేదు. వార చెప్పిన మాటలు వినలేదు. వారు వచ్చిన వెంటనే ఎవరి ఇంట్లోకి వార పోయి తలుపులు వేసుకోవడం జరిగింది. ఇలా అధికారులు 23 సార్ల క్రమంగా ఆ గ్రామానికి వచ్చి అందరినీ సమావేశపరిచి పథకం గురించి వివరించడానికి నానా తంటాలు పడాల్సి వచ్చింది. అధికారులు క్రమంగా వచ్చి గ్రామ పెద్ద (పటేల్)తో మాట్లాడి ఆయనకు పథకం గురించి వివరించి మిగతా కొలాములకు కూడా ఆయన (పటేల్)తో చెప్పించి వారిని ఒక దారి కి తీసుకురావడానికి ఒక సంవత్సరం కాలం పట్టింది.

కొలాములకు చాలా మందికి తెలుగు భాష మాట్లాడం రాదు అధికారులు ఏమైన చెప్పినా, వారు విని మౌనంగానే ఉండేవారు తప్ప



తిరిగి మాట్లాడేవారు కాదు. అధికారులు తరచూ గ్రామానికి వెళ్ళి కొలాములందరితో సమావేశాలు ఏర్పాటు చేసి పథకం ద్వారా వారు పొందబోయే ప్రయోజనాల గురించి, చేయబోయే పనులు గురించి పనుల ప్రణాళిక తయారీ గురించి, వివరించడం ద్వారా కొంతవరకు కొలాములు అంగీకారానికి రావడం జరిగింది.

తద్వారా అటవీశాఖ అధికారులు, కొలాములు కలిసి వి.ఎస్.ఎస్. ప్రాంతంలో చేపట్టబోయే పనుల కోసం సూక్ష్మ ప్రణాళిక, జీవనోపాధుల అభివృద్ధి కోసం ఒక ప్రణాళిక తయారు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కొలాముల ఉపాధి అవకాశాలు మెరుగుపడటం జరిగింది. వి.ఎన్.ఎన్. లో భాగంగా అటవీ అభివృద్ధి పనులు (సమతల కందకాలు, రాళ్ళ కట్టలు, చెట్ల పెంపకం, ఉన్న చెట్లను ఏపుగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవడం, అక్రమ కలప రవాణా, అగ్ని ప్రమాదాలు నివారించడం, విచక్షణా రహితంగా చెట్లు నరకడాన్ని నివారించడం మొదలగు పనులన్నింటినీ చేయడం జరిగింది. ఈ విధమైన పనులన్నింటినీ చేయడం వలన వి.ఎస్.ఎస్. ప్రాంతంలో పచ్చదనం పెరుగుదల, నీరు నిల్వ ఉండటం, అక్రమంగా చెట్లు నరకడం నివారణ మొదలైన ప్రయోజనాలు కలిగినట్లు గుర్తించారు.

ముఖ్యంగా సహజంగా ఉన్నవి, కొత్త వెదురు చెట్లను బాగా అభివృద్ధి చేయడం జరిగింది. వి.ఎస్.ఎస్. రాక మునుపు కొలాములకు అటవీ సంరక్షణ పనుల చేపట్టడం గానీ, వాటి ద్వారా పొందే ప్రయోజనాల గురించి గానీ పెద్దగా అవగాహన లేకపోవడంతో వాటిపై శ్రద్ధ కనబరచలేకపోయారు. ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు అటవీ సంపదను వాడుకుంటుండేవారు. కొంతమంది వేసవికాలంలో అడవిలో దొరికే కలపేతర అటవీ ఉత్పత్తులను (విప్పపూలు, విప్ప విత్తనాలు, బీడి ఆకులు, బంక, తేనె మొదలగు వాటిని) సేకరించేవారు. వి.ఎస్.ఎస్. కార్యక్రమాలు చేపట్టడం ద్వారా వారిలో అవగాహన స్థాయి, సామాజిక చైతన్యం పెంపొందించడం జరిగింది.

ప్రస్తుతం వారు ప్రతి సంవత్సరం ఒక ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి చుట్టు ప్రక్కల గ్రామాల వారికి వైద్య సేవలు అందిస్తూ సామాజిక సేవలో కూడా పాలు పంచుకుంటున్నారు. దాదాపుగా 1,14,000 రూపాయలు ఆరోగ్య శిబిరం కోసం ఖర్చు చేయడం జరిగింది.

వి.ఎస్.ఎస్. ద్వారా కొలాముల భాగస్వామ్యంతో చేపట్టిన పనుల ద్వారా అటవీ సంపదను పెంపొందించడం జరిగింది. పెంపొందించిన అటవీ సంపదను కొలాముల జీవనోపాధులు పెంపొందించడానికి ఉపయోగపడే విధంగా చేయాలని ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులు, కొలాములు సమావేశమై నిర్ణయించుకోవడం జరిగింది. అందులో భాగంగా మొదట ఏపుగా పెరిగిన వెదురు చెట్లపై కొలాములకు వాటిని ఉపయోగించుకునే విధంగా హక్కులు కల్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వాటిని సేకరించి వాటి ద్వారా అగర్‌బత్తీ పుల్లలు తయారు చేయడం గురించి వారికి తెలియజేశారు. వాటిని తయారు చేయడంపైన వారికి అదే గ్రామంలో ఒక వారం రోజుల పాటు అనుభవమున్న వ్యక్తులతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు.

అదే విధంగా వాటి తయారీకి కావలసిన పనిముట్లను అధికారులు కొలాములకు అందజేశారు. పనిముట్లు పొందిన తరువాత కొలాములు 2005 ఏప్రిల్ నుండి అగర్‌బత్తీ పుల్లలు తయారు చేయడంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు.





ఈ క్రమంలో అటవీ శాఖ అధికారులు కొలాములు తయారు చేసిన అగర్‌బత్తీ పుల్లలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడానికి వివిధ అగర్ బత్తీలు తయారు చేసే కంపెనీలతో సంప్రదింపులు చేసి గ్రామంలో తయారు చేసిన అగర్‌బత్తీ పుల్లలకు గిట్టుబాటు ధరతో పాటు అదే గ్రామానికి కంపెనీ వారు వచ్చి పుల్లలను తీసుకుపోవడానికి ఏర్పాట్లు చేశారు.

మొట్టమొదట అంబికా దర్బార్ కంపెనీ వాళ్ళు కిలో 18 రూపాయలతో కొనుగోలు చేయడం జరిగింది. ఏడాదికి 5 లేక 6 లారీల సరుకును ఈ గ్రామంలో తయారు చేయడం జరుగుతున్నది.

ప్రతి సంవత్సరం లొద్దిగూడ గ్రామంలోని కొలాములందరూ వ్యవసాయ పనులు పూర్తి అయిన వెంటనే, ఫిబ్రవరి నుండి మే నెల వరకు 4 నెలల కాలం పాటు ఈ అగర్‌బత్తీ పుల్లలు తయారీ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ విధంగా ప్రతి రోజు కొలాములు అందరూ ఒకే చోట కూర్చుని ఈ కార్యక్రమాన్ని మొదలుపెడతారు. ప్రతి కుటుంబం నుండి ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది భాగస్వాములై అగర్‌బత్తీ పుల్లల తయారీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో కొలాములు అందరూ ఐకమత్యంతో కలసిమెలసి అగర్‌బత్తీ పుల్లల తయారీలో ఉన్న అన్నీ పనులలో పాల్గొంటూ చాలా చక్కటి సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నారు. 40 కుటుంబాలు ఒకే దగ్గర కూర్చొని ఎటువంటి సమస్యలు లేకుండా ఎటువంటి రికార్డులు గాని రిజిస్టర్లు గాని నిర్వహించకుండా, ఎంత వస్తే అంత మొత్తాన్ని అందరూ సమానంగా పంచుకుంటూ ఆనందంగా కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నారు. అగర్‌బత్తీ తయారీ ప్రక్రియలో ఈ క్రింది అంశాలు ఇమిడి ఉన్నాయి.

- వెదురు బొంగులను అడవి నుండి తెల్లవారు జామునే వెళ్ళి తీసుకురావడం.
- తెచ్చిన బొంగులను గ్రాస్ కట్టింగ్ చేయడం అంటే పెద్ద బొంగును చిన్న చిన్న బొంగులుగా కట్ చేయడం.
- చిన్న చిన్న బొంగుల నుండి కావాల్సిన మందంతో స్ట్రిప్స్‌ను తయారు చేసుకోవడం.
- స్ట్రిప్స్ నుండి అగర్‌బత్తీ పుల్లలు తయారు చేయడం.
- తయారు చేసిన పుల్లలను ఎండకు ఎండబెట్టడం.
- ఎండిన తరువాత పుల్లలను గరక బండపైన అటు ఇటూ నూర్పుతూ నునుపుగా తయారు చేయడం.





- నాణ్యతాపరంగా వాటిని విభజించడం.
- చివరగా కొలత వేయడం, లోడు చేయడానికి అనుగుణంగా ప్యాకింగ్ చేయడం.

పై అన్ని పనులను ఎవరు చేసే పనులు వారు విభజించుకొని ఎటువంటి తారతమ్యం లేకుండా సాఫీగా అగర్‌బత్తీ పుల్లల తయారీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. మారుమూల ప్రాంతవాసులు, నిరుద్యోగులు, కనీస సౌకర్యాలకు నోచుకోని వారైనప్పటికినీ 40 కుటుంబాలు కలిసి ఒక కార్యక్రమాన్ని నిర్వహించుకుంటూ వచ్చిన ఆదాయాన్ని అందరూ సమానంగా పంచుకుంటూ జీవనం సాగిస్తున్నారంటే చాలా అభినందించదగ్గ విషయమని చెప్పవచ్చును.

అటవీ శాఖ అధికారులు వీరికి అగర్‌బత్తీలు తయారు చేసిన అగర్‌బత్తెలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అదే విధంగా వీరికి వెదురుతో అనేక రకాల కళాకృతులు తయారు చేసే విధంగా శిక్షణలు ఏర్పాటు చేసి వారు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించినట్లయితే వారి సామాజిక ఆర్థిక స్థితిగతులను పెంపొందించడానికి అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. అగర్‌బత్తీ పుల్లల తయారీలో కొలాములకు ఈ క్రింది సౌకర్యాలు కల్పించినట్లయితే వారు ఇంకా మెరుగ్గా తయారు చేయడానికి అవకాశాలున్నాయి.

- తయారు చేసిన పుల్లలు భద్రపరచడానికి సౌకర్యం.
- పుల్లల తయారీకి అనువైన షెడ్‌ను ఏర్పాటు చేయడం.
- నాణ్యతను పెంచడానికి ఎప్పటికప్పుడు శిక్షణలు ఏర్పాటు చేయడం.
- గిట్టుబాటు ధరలు కల్పించడం.
- నాణ్యమైన పనిముట్లను అందజేయడం.
- గ్రామానికి మంచినీటి సౌకర్యాలను కల్పించడం.
- అటవీ ప్రాంతంలో వెదురు చెట్లు పెంపొందించే చర్యలు చేపట్టడం.
- అగర్‌బత్తీలు తయారు చేయడానికి మంచి శిక్షణ ఏర్పాటు చేసి మంచి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం.

పై అంశాలన్నింటినీ వారికి అందుబాటులోకి తీసుకురాగలిగితే వారి జీవనోపాధులు మరింత మెరుగుపడటానికి దోహదపడిన వాళ్ళమవుతాం.

**– యం. ముత్యాలు,** *జూనియర్ ఫ్యాకల్టీ*

*సి.డి.యస్., అపార్డ్*



"దుర్మార్గాలకీ, దుఃఖాలకీ ఇవతలి గట్టున తొంగి చూస్తున్న లోకం బాల్యం. బాలలు ఈ లోకం ఎత్తిన వెన్నెల బావుటాలు. బతుకులో చల్లదనాన్ని రెపరెపలాడిస్తారు" అన్నాడొక మహాకవి.

అందుకే చిట్టిపొట్టి బాలల్లో సృజనాత్మక శక్తిని, వ్యక్తిగత వికాసాన్ని

# హైదరాబాద్‌లో 16వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం

## నవంబర్ 14 నుంచి 20 వరకు



పెంపొందించవలసిన తక్షణ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం బాలల కోసం ప్రత్యేకంగా చలనచిత్రాలు నిర్మించడానికి, బాలల చిత్రాలను పంపిణీ చేయడానికి ఒక ప్రత్యేక సంస్థ - "చిల్డ్రన్ ఫిలం సొసైటీ ఆఫ్ ఇండియా"ను 1995లో ఏర్పాటు చేసింది.

బాలల్లో చక్కని సంస్కృతిని, విజ్ఞానాన్ని పెంపొందించడం ఈ సొసైటీ లక్ష్యాలలో ప్రధానమైనవి. ఈ సొసైటీ దేశంలోను, విదేశాలలోను జరిగే జాతీయ, అంతర్జాతీయ స్థాయి చలనచిత్రోత్సవాలలో పాల్గొని తాము నిర్మిస్తున్న చిత్రాలకు ప్రచారం చేసేది. అయితే 1968లో ఈ చిల్డ్రన్ ఫిలం సొసైటీ పని చేస్తున్న తీరుపై అధ్యయనం చేయించిన కేంద్ర ప్రభుత్వం, ఆ నిపుణులు చేసిన సిఫారసు మేరకు అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలను జరపాలని నిర్ణయించింది. దేశంలోని బాలబాలికలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాలల చిత్రాల్లోని నూతన ధోరణులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడానికి వీలుగా... అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాలను తొలుదొలుత 1979లో ముంబైలో ఏర్పాటు చేసింది. ఈ చలనచిత్రోత్సవాలలో... కేవలం చలనచిత్రాల ప్రదర్శనే కాకుండా బాలల చిత్రాలకు సంబంధించిన వివిధ అంశాలపై సదస్సులు, గోష్ఠులు, చర్చలు నిర్వహించడం ప్రారంభించారు.

మనదేశంలో శ్రీకారం చుట్టిన ఈ అంతర్జాతీయ బాలల

చలనచిత్రోత్సవానికి ప్రతిష్ఠాత్మకమైన పారిస్‌లోని అంతర్జాతీయ చలనచిత్ర నిర్మాతల సంఘం గుర్తింపు లభించింది. అంతేకాదు, పారిస్‌లోని "ది ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ ఫిల్మ్ ఫర్ చిల్డ్రన్ అండ్ ఎంగ్ పీపుల్ (సీఫెజ్)" 'ఎ' శ్రేణి చలనచిత్రోత్సవంగా దీన్ని వర్గీకరించింది. పారిస్, లాస్‌ఏంజిల్స్, మాస్కో ఇత్యాది చోట్ల జరిగే చలనచిత్రోత్సవాలతో సరిసమానమైన మేటి ఉత్సవంగా దీన్ని పరిగణించింది.

## హైదరాబాద్ శాశ్వత వేదిక

ఈ బాలల చలనచిత్రోత్సవాన్ని రెండేళ్ళకు ఒకసారి భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజు - దేశమంతా బాలల దినోత్సవంగా వేడుకలు జరుపుకునే నవంబర్ 14వ తేదీ నుంచి ప్రారంభించి, పది రోజులపాటు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. ముంబై తర్వాత చెన్నై (1981), కోల్‌కతా (1983), బెంగుళూరు (1985), భువనేశ్వర్ (1987), ఢిల్లీ (1989), త్రివేండ్రం (1991), ఉదయ్‌పూర్ (1993), హైదరాబాద్ (1995) నగరాల్లో ఈ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాలు వరుసగా జరిపారు. ఎక్కడ జరిపినా, ప్రతిసారీ సుమారు పాతిక, ముప్పై దేశాల నుంచి వందకు పైగా చలనచిత్రాలు ఈ ఉత్సవంలో పాల్గొన్నాయి. అనంతరం పదవ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాన్ని కూడా 1997లో ఘనంగా నిర్వహించిన తరువాత హైదరాబాద్ నగరాన్ని భారత అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాలు నిర్వహించే శాశ్వత వేదికగా ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో 1999,2001, 2003, 2005, 2007లలో బాలల అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను - ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫర్ చిల్డ్రన్ అండ్ యంగ్‌పీపుల్ (ఐసిఫైసి), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, రంగస్థల అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

## ఏడెనిమిది విభాగాల్లో ప్రదర్శనలు

సాధారణంగా ఈ చలనచిత్రోత్సవాన్ని వెసులుబాటును బట్టి ఏడెనిమిది విభాగాలుగా ఏర్పాటు చేస్తారు. ఇందులో ప్రధానమైనది పోటీ చలనచిత్రాల విభాగం. ఈ విభాగానికి ఎంట్రీలుగా వచ్చిన వివిధ దేశాల చిత్రాలను అంతకుముందే నియామకం చేసిన నిపుణులతో కూడిన అంతర్జాతీయ జ్యూరీ పరిశీలించి ఎంపిక చేస్తుంది. 60 నిమిషాల కంటే ఎక్కువ నిడివిగల చిత్రాల విభాగంలో ఉత్తమ కథాచిత్రంగా వీరు ఎంపిక చేసిన చిత్రానికి బంగారు ఏనుగు, రెండు లక్షల రూపాయల నగదు ప్రదానం చేస్తారు. ద్వితీయ ఉత్తమ చిత్రానికి వెండి ఏనుగు, లక్ష రూపాయల నగదు అందజేస్తారు.

అలాగే 60 నిమిషాలలోపు నిడివిగల ఉత్తమ లఘు కథాచిత్రానికి వెండి ఏనుగు, లక్ష రూపాయల బహుమతి ఇస్తారు. ఉత్తమ యానిమేషన్ చిత్రానికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు అందజేస్తారు. ఉత్తమ కథారహిత చిత్రానికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు ఇస్తారు. ఉత్తమ దర్శకుడికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు, ఉత్తమ సంగీతానికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు ప్రదానం చేస్తారు. ఉత్తమ బాల నటుడు లేదా నటికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు ప్రదానం చేస్తారు.



జ్యూరీ ప్రత్యేక అవార్డులు ప్రకటిస్తే సర్టిఫికెట్లు అందజేస్తారు. ఇదే విభాగం చిత్రాలను తిలకించి ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేయడానికి ప్రతిభావంతులైన బాలలతో జ్యూరీ ఏర్పాటు చేస్తారు. ఈ జ్యూరీ ఎంపిక చేసిన ఉత్తమ చిత్రానికి వెండి ఏనుగు, 50 వేల రూపాయలు ప్రదానం చేస్తారు.

ఇది కాకుండా ఆసియన్ పనోరమా విభాగం చిత్రాలు తిలకించి ఉత్తమ చిత్రాలు ఎంపిక చేయడానికి నిపుణులతో మరో జ్యూరీని నియామకం చేస్తారు. ఈ విభాగంలో జ్యూరీ ఎంపిక చేసిన ఉత్తమ చిత్రానికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు ప్రదానం చేస్తారు. ఉత్తమ లఘు చిత్రానికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు అందజేస్తారు. ఉత్తమ బాల నటుడు లేదా నటికి వెండి ఏనుగు, లక్ష రూపాయలు బహూకరిస్తారు.

ఈ రెండు విభాగాలతో పాటు బాలల ప్రపంచం విభాగంలో పాల్గొన్న అన్ని చిత్రాలకు సర్టిఫికెట్లు ఇస్తారు. ఇవికాకుండా - నోస్టాల్జియా, ఫోకస్, రిట్రాస్పెక్టివ్, సమాచార విభాగాల్లో బాలలకు స్ఫూర్తినిచ్చే విభిన్న చిత్రాలు ప్రదర్శిస్తారు. బాలలకు ఎంతో ఇష్టమైన యానిమేషన్ చిత్రాలు కూడా ఈ ఉత్సవాల్లో ఎక్కువగా పాల్గొంటాయి. మార్కెటింగ్ విభాగం కూడా ఉంటుంది.

## వారం రోజుల పాటు ప్రదర్శనలు

ఒక వంక ప్రసాద్స్ ఐమాక్స్‌లో ఈ చిత్రాలు బాల ప్రతినిధులు, పత్రికా విలేకరులకు ప్రదర్శించే ప్రధాన థియేటర్లు ఉన్నప్పటికీ, హైదరాబాద్ - సికింద్రాబాద్ జంటనగరాల్లోని వివిధ ప్రాంతాలలో ఉన్న కొన్ని సినిమా థియేటర్లు ఎంపికచేసి ప్రత్యేకంగా పిల్లల కోసం ఈ బాలల చలనచిత్రాలను వారం రోజులపాటు ప్రదర్శిస్తారు. ఎక్కడో పొరుగు దేశంలో ఎంతో వైవిధ్యంగా లేదా విజ్ఞానాత్మకంగా లేదా వినోదాత్మకంగా తీసిన చిత్రాలను చూసే అవకాశం వెదుక్కుంటూ మన ముందుకొస్తే, దీన్ని జారవిడువడం ఎంతమాత్రం విజ్ఞత కాదు.


ముందుగానే ఏ ఏ చిత్రాలు, ఏ ఏ థియేటర్లో ఎప్పుడు ప్రదర్శిస్తారో జాబితా ప్రకటిస్తారు. వాటిలో నచ్చిన చిత్రాలను తమ పిల్లాపాపలతో లేదా ఉపాధ్యాయులతో, తమ విద్యార్థులతో కలిసివెళ్ళి చూడడానికి సిద్ధంగా ఉంటే మంచిది.

## సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్ఠులు

ఇంకా ఈ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాలను పురస్కరించుకుని చలనచిత్రాలతో పాటు లలితకళాతోరణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. చలనచిత్రాలపై చర్చాగోష్ఠులు ఏర్పాటు చేస్తారు. బాలలకు చలనచిత్రాల నిర్మాణంలో ఒక అవగాహన కల్పించడానికి వివిధ సాంకేతిక విభాగాలలో 'వర్క్‌షాప్'లు ఏర్పాటు చేస్తారు. వాటిలో పాల్గొని, బుల్లి, బుల్లి చేతులతో బాలల చలనచిత్రాలు నిర్మించడం నేర్చుకోవచ్చు.

తిరిగి ఈ నవంబర్ 14వ తేదీ నుంచి హైదరాబాద్ - సికింద్రాబాద్ జంటనగరాల్లో అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం జరుగుతుంది. ఎక్కడ ఏ థియేటర్‌లో ఏ చిత్రాన్ని ఏ రోజు చూడాలో ముందుగానే నిర్ణయించుకోండి. ఆలస్యం చేసే అవకాశం కోల్పోతారు.

– ఆర్.కె.





ప్రతిచోటా కనపడుతుండేది. 1952 సంవత్సరం గాంధీ జయంతి నాడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎన్. ఇ. ఎస్. (నేషనల్ ఎక్స్‌టెన్షన్ స్కీమ్) బ్లాక్‌లను, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బ్లాక్‌లను ప్రారంభించారు.

అమెరికా, తదితర దేశాల్లో అవలంబించిన 4-హెచ్ క్లబ్‌లు, మొదలైన విధానాలలో కొన్నింటిని మనమూ అనుసరించాం. గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చాలని, పునర్నిర్మించాలని కలలు కన్నాం.

పంచాయితీరాజ్ వ్యవస్థ గురించి విశదీకరిస్తూ, పండిట్ జవహర్‌లాల్ ఒకసారి ఇలా అన్నారు- "ఇప్పుడు భరతమాత నూతన వస్త్రాలు ధరించి, అందమైన ఇంటిలో ఉండాలని మనం కోరుకుంటున్నాం. మన

# మన పంచాయితీరాజ్ వ్యవస్థ - తొలి జ్ఞాపకాలు

ఈ నవంబర్ ఒకటవ తేదీనాటికి మన రాష్ట్రంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

1959 సంవత్సరం అక్టోబర్ 12 వ తేదీన అప్పటి కేంద్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్, పంచాయితీ రాజ్ మంత్రి శ్రీ ఎస్.కె.డే డైరీలో ఈ విధంగా రాసి ఉంది.

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధానమంత్రి అధికారాల పంపిణీ, ప్రజాస్వామికీకరణ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. నవంబర్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వస్తుంది. ఇతర రాష్ట్రాలు కూడా ఈ విషయంలో ముందడుగు వేస్తున్నాయి."

ఆంధ్రప్రదేశ్ కంటే ముందుగా, 1959 అక్టోబర్ 2వ తేదిన గాంధీ జయంతి నాడు రాజస్థాన్ రాష్ట్రం పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రారంభించి, ఈ విషయంలో మొదటి రాష్ట్రంగా నిలిచింది.

స్వాతంత్ర్యం వచ్చినప్పటినాటి గ్రామీణ ప్రాంత పరిస్థితిని తలచుకోవటం ఆసక్తికరంగా ఉంటుంది. మన గ్రామాల్లో దుర్భర దారిద్ర్యం, నిరక్షరాస్యత తాండవిస్తూ ఉండేవి.

అయితే, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే తపన

దేశానికి ఇప్పుడు అన్ని అవసరాలు తీర్చాలి. మన దేశ ప్రజలు సరిపడినంత ఆహారం, నివాసం వంటి వాటితో హాయిగా ఉండాలని కోరుకుంటున్నాం" అని నెహ్రూ పేర్కొన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు, "మనం మన స్వంత శ్రమతో, కృషితో కష్టపడి పనిచేయటం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. ఇది మన ముందున్న బృహత్తర కర్తవ్యం.



మన పిల్లలు పెరిగేనరికి ఒక నూతన భారతదేశం తయారవ్వాలి. పేదరికం, ఆకలి లేని సరికొత్త భారతావని ఆవిర్భవించాలన్నదే మన కల.”

“ఏడు సంవత్సరాల క్రితం, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు, నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ వంటి అభివృద్ధి పథకాలను మనం ప్రారంభించాం. అయితే లక్షలాది గ్రామాలను అభివృద్ధి చేయటం సాధారణమైన విషయమేమీ కాదని మీరు గుర్తించి తీరాలి. అభివృద్ధి నెమ్మదిగా జరగటానికి మనం అధికార యంత్రాంగంపై ఎక్కువగా ఆధారపడటమే కారణం.”



“అందువల్ల, మనం ధైర్యంగా ముందడుగు వేసి, కొన్ని చర్యలు తీసుకోవలసివచ్చింది. ఇందులో భాగంగా, మరిన్ని బాధ్యతలను ప్రజలకు బదిలీ చేయవలసి వచ్చింది. ప్రజలను కేవలం సంప్రదిస్తే చాలదు. వారికి తగినన్ని అధికారాలు కూడా అప్పగించి తీరాలి.”

“మనం చేసిన కృషికి తగిన ఫలితాలు వచ్చినప్పుడే మనకు నిజమైన ఆనందం లభిస్తుంది. మనం ధైర్య స్థైర్యాలతో కష్టపడి పనిచేయటం ద్వారా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలం. అప్పుడే అది మనకు తగిన బలాన్నిచ్చి, మొత్తం దేశాన్ని బలోపేతం చేస్తుంది.”

“పంచవర్ష ప్రణాళికల అమలు విషయంలో గ్రామీణ ప్రజలతో భాగస్వామ్యం నెరపటం ద్వారా మనం విజయాలను, సంచలనాలను సాధించాలి. పంచవర్ష ప్రణాళిక ప్రజల ప్రణాళిక. దీని అమలులో ప్రజలు పూర్తి మమేకం కావాలి. తద్వారా, ప్రతి పురుషుడు, స్త్రీ, బాలలు భారతదేశం అభివృద్ధిలో తామూ భాగస్వాములని భావిస్తారు. అందులో సమిష్టిగా పాలుపంచుకుని ఒక నూతన భారతదేశాన్ని నిర్మిస్తారు.”

పంచాయితీరాజ్ వ్యవస్థ గురించి నెహ్రూ కలలను పైన పేర్కొన్న వ్యాఖ్యలు స్పష్టపరుస్తున్నాయి.

కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అమలు జరిగిన కాలంలో, పంచాయితీ రాజ్ వ్యవస్థ ప్రారంభమైన తొలి 10 సంవత్సరాల కాలంలో ఒక విషయం ప్రస్ఫుటంగా కనపడేది. ప్రజలు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. గ్రామంలోని రోడ్లు, చెరువులు, పాఠశాలలు, ఆసుపత్రి భవనాల నిర్మాణం, మొక్కలు నాటడం, వాటిని పోషించటం మొదలైన అన్ని కార్యక్రమాల్లో ప్రతి కుటుంబం పాలు పంచుకునేది. ఆయా పనుల్లో శారీరక శ్రమ రూపేణా కాని, ధనం రూపేణా కాని, రెండింటి రూపేణా కాని పాల్గొనేది.

గాంధీజీ కలలుకన్న పంచాయితీరాజ్ వ్యవస్థ గ్రామస్థాయిలో గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసే వ్యవస్థ. గ్రామస్థాయిలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ విధులను నిర్వహించే వ్యవస్థ. ఈ వ్యవస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను ఆకలి నుంచి, వ్యాధుల నుంచి. అజ్ఞానం నుంచి రక్షించాయి.

పంచాయితీరాజ్ వ్యవస్థ ప్రారంభమైన తొలి 10 సంవత్సరాల కాలంలో పంచాయితీ సమితి, జిల్లా పరిషత్‌లకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు తమ పదవీకాలంలో ఒక్కసారి కూడా వేతనాన్ని కానీ, ప్రయాణ ఖర్చుల భత్యాన్ని కాని తీసుకోవటం నేను చూడలేదు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌లు, సమితి అధ్యక్షులు ఎంతో ఆదర్శంగా పనిచేసేవారు. కార్యాలయాలకు వచ్చే అతిథులకు, ఇతర సందర్శకులకు మర్యాదలు చేయటానికి, వారి అవసరాలు తీర్చడానికి ఖర్చు పెట్టేందుకు ఆయా మొత్తాలను కార్యాలయ సిబ్బంది దగ్గర ఉంచేవారు.

ఎప్పుడైనా ఆరోగ్య కేంద్రాలు, ఉన్నత పాఠశాలలు, ఇతర సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రకటన ఇస్తే తక్షణమే అనేక రూపాల్లో స్వచ్ఛందంగా నిధులు సమకూరేవి. భూమి రూపంలో కాని, ధనం రూపంలో కాని, శ్రమదానం రూపంలో కాని ఆ పనుల్లో పాలుపంచుకోవటానికి అనేకమంది ముందుకొచ్చేవారు.







1959, నవంబర్ 1వ తేదీన అమల్లోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్‌ల చట్టం అనేక అంశాలను పంచాయితీల పరిధిలో చేర్చింది. వీటిలో వ్యవసాయం, పశు సంవర్ధకం, మత్స్య రంగం, కుటీర పరిశ్రమలు, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, వయోజన విద్య, మహిళా, శిశు అభివృద్ధి, అంతర్గత గ్రామీణ రోడ్లు, మంచినీటి సరఫరా, ఆరోగ్యం, పోషకాహారం మొదలైనవి ఉన్నాయి. వీటిని పంచాయితీల పరిధిలో చేర్చటం ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధికి ఈ చట్టం బాటలు వేసింది.

పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పడిన తొలి 10 సంవత్సరాల కాలం చాలా ఫలితాలను అందించింది. 1970 తరువాత, నెమ్మదిగా వివిధ విభాగాలు పంచాయితీరాజ్ వ్యవస్థ నుంచి తమ తమ అధికారులు, సిబ్బందిని వెనక్కు తీసుకోవటం ప్రారంభించాయి.

పంచాయితీ రాజ్ వ్యవస్థ తొలినాళ్లలో రెండు దృశ్యాలు తరచూ కనపడేవి. రోడ్డు నిర్మాణం పనులు, చెరువుల పూడికతీత, చెట్లు నాటటం వంటి కార్యక్రమాల్లో పాలు పంచుకోవటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడి శ్రమదానం చేసేవారు. ఆయా కార్యక్రమాల గురించి కొంచెం ముందుగా సమాచారం తెలిస్తే చాలు, వచ్చి వాలిపోయేవారు.

మరొక దృశ్యం ఏమిటంటే, ప్రతినెల 30 వ తేదీన హరిజన దినంగా నిర్వహించేవారు. ఎస్.సి వర్గం ప్రజలతో మిగిలిన అందరూ కలిసి ఆ రోజున సామూహిక భోజనాలు చేసేవారు. అస్పృశ్యతను రూపుమాపాలనే అవగాహనను ప్రజల్లో కల్గించటానికి ఆ అవకాశాన్ని ఉపయోగించుకునేవారు. సమితి ఎక్స్‌టెన్షన్ కార్యాలయానికి చెందిన ఒక ఉద్యోగి అక్కడ హాజరై, స్థానిక నిర్వాహకులకు చేదోడు వాదోడుగా ఉండేవారు.

వివిధ పనులు చేపట్టిన సంస్థలకు చెల్లించే మొత్తాలనుంచి ప్రజల శ్రమదానం విలువను మినహాయించి, మిగిలిన మొత్తానికి చెక్‌లను ఇచ్చేవారు.


భూదానం, గ్రామదానం వంటి ప్రత్యేక కార్యక్రమాలకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి ప్రోత్సాహం, ఆదరణ లభించేవి. ప్రజోపయోగ కార్యక్రమాలకు కాని, భూమిలేని పేదలకు పంచటానికి కాని భూమిని దానం చేయవలసిందిగా ప్రభుత్వం పిలుపు ఇస్తే ప్రజలనుంచి విపరీతమైన స్పందన వచ్చేది.

1993 లో 73వ రాజ్యాంగ సవరణ చేసిన తరువాత, పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగ బద్ధమైన హోదా లభించింది. అనేక రాష్ట్రాలు నిధులను, విధులను, సిబ్బందిని పంచాయితీరాజ్ సంస్థలకు అందించాయి. రాజ్యాంగంలో 243వ సెక్షన్‌లోని 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలలో కొన్నిటిని మన రాష్ట్రం ఇంకా పంచాయితీరాజ్ సంస్థలకు అప్పగించవలసి ఉంది.


– ఎం. సెబాస్టియన్ రాజు,
ఎపిఎఎస్ (రిటైర్డ్)
కన్సల్టెంట్, సెంటర్ హెడ్, సిఎస్ఇ, అపార్డ్
(అనువాదం: టి. నర్మద)






ప్రపంచ ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగలు కేవలం రెండు మాత్రమే. అవి రమజాన్ మరియు బక్రీద్. ఇస్లాం ధర్మంలో రమజాన్‌కు ఎంతైతే ప్రాధాన్యత ఉందో, అంతే ప్రాధాన్యత బక్రీద్‌కూ ఉంది.

బక్రీద్ పండుగ ఇబ్రహీం ప్రవక్త త్యాగనిరతిని, సహనశీలతను, ఋజు వర్తనాన్ని సూచిస్తుంది. మానవాళికి మార్గదర్శకం వహించడానికి దైవం తరపున ప్రభవించిన ప్రవక్తల్లో హజ్రత్ ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరా లకు పూర్వం ప్రవక్త ఇబ్రహీం జన్మించారు. ఆయనది మహోన్నత వ్యక్తిత్వం.

విశ్వప్రభు చరాచర జీవసృష్టికి మూలాధారమని, సృష్టి లయకారుడు అతడేనని, ఏకేశ్వరునికి దాస్యం చేయడం ద్వారా ముక్తిని పొందమని ఇబ్రహీం తన జాతి జనులకు పిలుపునిచ్చేవారు. ఏకేశ్వర వాదం నచ్చని ఆయన జాతి ప్రజలు ఆయనపై కక్ష గట్టారు. ఆయనను శారీరక, మానసిక చిత్రహింసలకు గురి చేయడమే కాక, తుదముట్టించేందుకు చితిని పేర్చి ఆ మంటల్లో ఆయన్ను నెట్టారు.

‘ఇబ్రహీంకు చల్లదనాన్ని చేకూర్చమని మేము అగ్నిని ఆదేశించాము. మా ఆదేశంతో భగ భగ మండే అగ్ని సైతం ఆయన కోసం పూలపాన్పుగా మారింది.’

*(దివ్యఖురాన్*

దైవప్రమేయాలతో బతికి బయటపడిన ఇబ్రహీం ఏకేశ్వర వాదాన్ని ఇంకా కొనసాగించడాన్ని ఇష్టపడని ఆయన జాతి జనులు ఆయనతో వేగలేక ఆయన్ను దేశం నుండే బహిష్కరించారు. స్వజాతీయుల తిరస్కారంతో పుట్టిన గడ్డనుంచి నిష్క్రమించిన హజ్రత్ ఇబ్రహీం సువిశాల ప్రపంచాన్నే వేదికగా చేసుకుంటూ దేశాటనలు చేస్తూ, ధర్మ ప్రచారం గావించేవారు.

వయస్సు మీదపడుతున్న కొద్దీ సంతానం లేని బెంగ ఆయన్ను వేధించేది. తన తదనంతరం దైవకార్యం బాధ్యతలు నిర్వహించే వారెవరు? అని ఆయన నిత్యం మథనపడేవారు. నిజధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు తనకు సంతానాన్ని ప్రసాదించమని ఆయన తరచు దైవాన్ని ప్రార్థించేవారు.

ఇబ్రహీం వద్దకు ఒకనాడు దైవదూతలు శుభవార్త తెచ్చారు. మీకు సలాం అని పలికారు. ఇబ్రహీం ప్రతి సలాం చేశారు. అప్పుడు వారు ఆయనకు ఇస్మాయిల్ జననం శుభవార్తను, ఆతరువాత 'యాఖూబ్' శుభవార్తను అందజేశారు. *(సూరెహుద్ - 69)*

86 ఏళ్ళ పండు ముదుసలి వయస్సులో దైవం ఇబ్రహీంకు వారసుని ప్రసాదించాడు. సుపుత్రుడిని పొందిన ఆనందడోలికల్లో తేలియాడుతున్న సమయంలో ఇబ్రహీం భక్తి ప్రపత్తులను విశ్వ ప్రభువు పరీక్షించదలిచాడు.

దైవప్రసన్నత కోసం ముద్దుల తనయుడిని జనసంచారం లేని ఎడారి ప్రాంతంలో వదిలివేయమని దైవాజ్ఞ అవుతుంది. పుత్ర వాత్సల్యం కంటే దైవప్రసన్నతనే మిన్నగా భావించిన హజ్రత్ ఇబ్రహీం తన భార్య బీబీ హాజరాను, తన కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్‌ను దైవం సూచించిన ఎడారి ప్రాంతంలో వదిలేస్తారు.

సమకూర్చిన అన్ని పానీయాలు అయిపోగా, తల్లీ బిడ్డా ఆకలితో అలమటించసాగారు. చిన్నారి ఆకలి తీర్చడానికి ఆ తల్లి జనసంచారం లేని ఆ నిర్జన ప్రదేశంలో మానవమాత్రులెవరైనా ఆదుకుంటారేమోనని ఆందోళనతో ఆ ప్రాంతాన్ని కలియతిరుగుతుంది. అక్కడే ఉన్న 'సఫా' మర్వా కొండల పైకి ఎక్కి దిగుతూ గుక్కెడు నీళ్లయినా దొరికితే బాగుండు అని అలమటిస్తుంది.

అప్పుడు దైవానుగ్రహం మేరకు అక్కడ ఇస్మాయిల్ కాలిమడమల వద్ద ఒక నీటి ఊట చిమ్ముతుంది. అదే ఊట ఒక సెలయేరుగా మారి నేటికీ స్థిరంగా ఉంది. హజ్ యాత్రకు వెళ్ళిన లక్షలాదిమంది ఆ పవిత్ర జలాన్ని తాము సేవించడమేకాక తమతో పాటు తమదేశాలకూ తీసుకెళ్తారు.

చిన్నారి దప్పికను తీర్చడానికి ఆ తల్లి పడిన తపనను ప్రళయాంతం వరకు ప్రపంచం గుర్తించుకునే విధంగా విశ్వప్రభువు నీటిచెలమ పుట్టిన సఫా, మర్వా కొండ ప్రాంతాలను ప్రశస్తమైనవిగా చేశాడు.

ఆ తరువాత కొంతకాలానికి హజ్రత్ ఇబ్రహీం తన భార్యాబిడ్డలను కలుస్తారు. ఎడబాటు వీడి కుటుంబంతో సుఖసంతోషాన్ని పొందుతున్న దశలో హజ్రత్ ఇబ్రహీం మరోమారు విషమ పరీక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈమారు దైవం ఆయనను మరింతగా కఠిన పరీక్షకు గురిచేసి ఆయన విశ్వాసాన్ని నిగ్గుతేల్చదల్చాడు. తన ముద్దుల తనయుడిని దైవప్రసన్నత కోసం బలిస్తున్నట్లు ఇబ్రహీం కలగంటాడు. కలలోని సూచనలు దైవాదేశాలై ఉంటాయని, దైవప్రసన్నత కోసమే ఆ తరహా సంకేతం వచ్చి ఉంటుందని భావించిన ఇబ్రహీం తన స్వప్నాన్ని నిజం చేయదలిచాడు. తన స్వప్న వృత్తాంతాన్ని తన కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్‌కు వివరిస్తాడు.


తన ఆత్మార్పణలోనే దైవప్రసన్నత ఇమిడి ఉంటే, అదేవిధంగా ఆచరించమని అందుకు తాను సర్వదా సంసిద్ధుడనని ఇస్మాయిల్ తండ్రికి విన్నవిస్తాడు. కన్నపేగు కంటే ఈశ్వరేచ్ఛయే మిన్నగా భావించిన హజ్రత్ ఇబ్రహీం పుత్ర వాత్సల్యం అడ్డురాకూడదని కళ్ళకు గంతలు కట్టుకొని దైవమార్గంలో కొడుకుని జిబాహ్ చేయడానికి సిద్ధపడతారు. అప్పుడు దైవవాణి వినిపిస్తుంది.

"ఓ ఇబ్రహీం ! నీవు నీ కలను నిజం చేసి చూపించావు మా ఆజ్ఞను నిర్వర్తించే విశ్వాసులకు గొప్ప ప్రతిఫలం ఒసుగుతాము"

దైవ సందేశం విన్న ఇబ్రహీం కళ్ళ గంతలు తీసి చూస్తారు. తన కుమారుడికి బదులుగా గొర్రెపోతు ఒకటి 'జిబాహ్' చేయబడి ఉండటం నిత్యనూతనంగా తన కుమారుడు తేజంతో వెలిగిపోవడం చూసి ఆనంద పరవశుడౌతాడు. హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతిని మెచ్చిన విశ్వప్రభువు ఆయనకు ప్రపంచ మానవులపై ఆధిక్యతను ఒసగుతాడు. సర్వమానవాళికి ఆయనను నాయకుడిగా చేస్తాడు.

దైవ ప్రసన్నత కోసం హజ్రత్ ఇబ్రహీం చేసిన మహోన్నత త్యాగానికి గుర్తుగా ఆ మహనీయుని త్యాగనిరతిని మననం చేసుకుంటూ ముస్లిం సమాజం ఏటా జరుపుకునే పండుగే ఈ బక్రీద్.

దైవమార్గంలో త్యాగాలు చేయమని, అందుకు సతతం సిద్ధంగా ఉండమని ప్రబోధించడమే బక్రీద్ పరమార్థం. ఆ త్యాగ నిరతిని అలవర్చుకోవడానికి ఆనాటి సాంప్రదాయం కొనసాగింపుగా ముస్లింలు నేటికీ, తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు.




"ఖుర్బానీ జంతువు రక్తమాంసాలు అల్లాహ్‌కు చేరవు. కేవలం మీ భయభక్తులే చేరుతాయి".

(దివ్యఖురాన్)

హజ్రత్ ఇబ్రహీం సాంప్రదాయం అజరామరం. ఆయన త్యాగం నిరుపమానం. దైవప్రసన్నత కోసం ఆయన నిర్వహించిన ప్రతి కార్యాచరణా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది.

*- ఎ.ఎమ్. ఫీచర్స్*



# మానవ హక్కుల ఉద్యమాల మహానేత డాక్టర్ కె. బాలగోపాల్

**2009, అక్టోబర్ 8వ తేదీ ఒక విషాద దినంగా చరిత్రలో మిగిలిపోతుంది.**

మానవహక్కులు, ప్రజాస్వామిక హక్కులు, పౌరహక్కుల జాతీయ, అంతర్జాతీయ ఉద్యమాలను ఆ రోజు అకస్మాత్తుగా దెబ్బతీసింది.

పౌరహక్కుల ఉద్యమనేతగా మారిన ఒక గణిత శాస్త్రవేత్త డాక్టర్ కె.బాలగోపాల్ గుండెపోటుతో ఆ రోజున మరణించారు. ఆయనది అనితర సాధ్యమైన ధైర్యం.

ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని ఆర్థిక, పర్యావరణ వినాశనం మన చుట్టూ కమ్ముకున్న వేళ బాలగోపాల్ మన మధ్యనుంచి వెళ్లిపోయారు. మానవ హక్కుల ఉల్లంఘనలు ప్రతిచోటా వ్యాపించి ఉన్నాయి. ఆధునిక అభివృద్ధికి చెందిన ప్రతి కోణమూ ప్రజాబాహుళ్యాన్ని బలోపేతం చేసే బదులు ప్రజలకు, అభివృద్ధి పథకాలను అమలు చేసే సంస్థలకు మధ్య ఘర్షణలకు కారణభూతమైంది.

ప్రత్యేక ఆర్థిక మండలాలు, అణువిద్యుత్ కర్మాగారాలు, ఓపెన్ కాస్ట్ కోల్ మైనింగ్, కోస్తాప్రాంతాల్లో థర్మల్ ప్లాంట్లు, అటవీ ప్రాంతాల్లో బాక్సైట్ మైనింగ్, పారిశ్రామిక కారిడార్లు...ఇట్లా ఏది తీసుకున్నా దేశంలో స్థానిక ప్రజల మానవ, ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగించని పరిణామం ఏదీ లేదు. ఈ 'అభివృద్ధి చోదకా'లన్నీ వందలాది యుద్ధరంగాలను సృష్టించాయి.

అనేక సంవత్సరాలుగా ఈ యుద్ధరంగాలలో బాలగోపాల్ తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఈ యుద్ధరంగాలలో ఆయన ఉనికి ఇప్పుడు మరీ అవసరం. ఇట్లాంటి సమయంలోనే ఆయన మన మధ్యనుంచి వెళ్లిపోయారు. ఎప్పుడూ నవ్వుతూండే ఆయన ముఖం మరిక మనకు కన్పించదు. దేశంలోని ప్రజాఉద్యమం అందుకే దుఃఖిస్తోంది.

అతి సాధారణమైన ప్యాంటు, చొక్కా, మందపాటి పాతకాలపు కళ్లద్దాలు ధరించి కనపడే బాలగోపాల్ అలుపెరుగని ఒక 'గెరిల్లా'

యోధుడు. ఆయన తన కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌కి, చుట్టుపక్కల రాష్ట్రాలకు మాత్రమే పరిమితం చేయలేదు. న్యాయం కోసం ఆయన పడే తపన సుదూరంగా ఉన్న కాశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలకు ఆయనను తీసుకెళ్లింది.

మానవహక్కుల ఉల్లంఘనలు జరిగి బాధితులైన ప్రజలకు ఆపన్నహస్తం అందించడానికి మనదేశంలో బాలగోపాల్ వెళ్లని ప్రాంతమంటూ లేదు. ఆఖరికి జమ్ము-కాశ్మీర్‌లోని మారుమూల పల్లెలకు కూడా నిజనిర్ధారణ బృందాలను ఆయన తీసుకెళ్లేవారు. జమ్ము-కాశ్మీర్‌ను ఆయన ఒకసారి ఇట్లా అభివర్ణించారు "అప్రకటిత మార్షల్‌లా కింద ఉన్న స్వర్గం" అని.

కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో బాలగోపాల్ తన విలువైన సమయాన్ని, శక్తిని ఎంతగానో వెచ్చించారు. ఈ రాష్ట్రాల్లోని ప్రజల మానవ హక్కులపై అన్ని దిక్కులుగా జరుగుతున్న దాడులను ఆయన బహిర్గతపరిచేవారు. బాలగోపాల్ నాయకత్వంలోని నిజనిర్ధారణ బృందాలు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జరిగిన మానవహక్కుల ఉల్లంఘనలను చాలా సార్లు బయటపెట్టాయి. 2002లో జమ్ము-కాశ్మీర్‌లో జరిగిన ఎన్నికల నిర్వహణను పలు పౌరహక్కుల బృందాలతో కలిసి ఆయన పర్యవేక్షించారు.

మానవహక్కులను ఉల్లంఘిస్తున్న వ్యక్తులు, రైతులు, గిరిజనులపై హింసకు పాల్పడుతున్న వ్యక్తులపై బాలగోపాల్ అనేకసార్లు ఏక వ్యక్తి సైన్యంలా పనిచేశారు. తరువాత జరిగే దారుణ పరిణామాలను కూడా పట్టించుకోకుండా ఆయన తక్షణమే సంఘటనా స్థలానికి పరిగెత్తి పోరాటం ప్రారంభించేవారు.

ఈ క్రమంలో అనేకసార్లు ఆయన అవమానాలకు, బెదిరింపులకు, కిడ్నాప్‌లకు లోనయ్యారు. ఆఖరికి జైలు పాలు కూడా అయ్యారు. బాలగోపాల్ అనేకసార్లు అరెస్టయ్యారు. ఒకసారి ఆయనను గ్రీన్‌టైగర్లు కిడ్నాప్ చేశారు. అయితే, బెదిరింపులకు, దాడులకు, పశుబలానికి ఆయన ఎప్పుడూ లొంగిపోలేదు. తన దృఢ నిశ్చయం నుంచి పక్కకు తప్పుకోలేదు.

బాలగోపాల్ గొప్ప వక్త కాకపోయినప్పటికీ, వాదనా పటిమలో గొప్ప నిపుణుడు.1997లో జాతీయ మానవహక్కుల కమీషన్ ముందు బాలగోపాల్ చేసిన వాదనలు చరిత్రలో నిలిచిపోతాయి. రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్' మరణాలకు కారణమైన వారిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి, ప్రాసిక్యూట్ చేయాలని జాతీయ మానవహక్కుల కమిషన్ సిఫార్సు చేసింది. ఇదే విషయంపై హైకోర్టులో బాలగోపాల్ చేసిన వాదనలు కూడా ఫలితాన్నిచ్చాయి. 'ఎన్‌కౌంటర్' మరణాలకు బాధ్యులైన వారిపై కేసు పెట్టాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే, గత ఏడాది ఈ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

ప్రజల మానవహక్కుల, పౌరహక్కులు, ప్రజాస్వామిక హక్కుల రక్షణకు ఆయన చివరిరోజుల్లో చాలా కృషి చేశారు. అందులో ఒకటి - బాలగోపాల్ ఆధ్వర్యంలోని నిపుణుల బృందం ప్రణాళికాసంఘం ఆదేశాలపై 'అతివాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్లు' అనే నివేదికను రూపొందించింది.

అప్పటికే స్థిరపడిపోయి ఉన్న విషయాలను సవాలు చేయటానికి బాలగోపాల్ భయపడేవారు కాదు. 1980ల దశకం నుంచి తాను కలిసి పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంతో బాలగోపాల్ విభేదించి బయటకు వచ్చారు. ఇదివరకటి సిపిఐ-ఎంఎల్ పీపుల్స్‌వార్ సాగిస్తున్న హింసాకాండను ఆయన వ్యతిరేకించారు.

మానవహక్కులు, పౌరహక్కుల కోసం పోరాడటానికి బాలగోపాల్ ఆ తరువాత మానవహక్కుల ఫోరమ్‌ను నెలకొల్పారు. ఆఖరికి నక్సలైట్లు, మావోయిస్టులు పాల్పడుతున్న హింసాకాండను నిర్భయంగా, ధైర్యంగా వ్యతిరేకిస్తూ, బహిరంగంగా మాట్లాడటానికి బాలగోపాల్ ఎప్పుడూ జంకలేదు.

రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో 1952 సంవత్సరం జూన్ 10వ తేదీన బాలగోపాల్ జన్మించారు. తిరుపతిలో విద్యాభ్యాసం చేసిన ఆయన గణితంలో డాక్టరేట్ అయ్యారు. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా పనిచేశారు. అదే రంగంలో కొనసాగిఉంటే, అందులో అత్యున్నత శిఖరాలకు ఎదగటమేకాక, దేశంలోని గణిత మేధావుల్లో ఒకరిగా మిగిలిపోయేవారు. అయితే, ఆయన కాకతీయ విశ్వవిద్యాలయాన్ని వదిలిపెట్టి, మానవహక్కుల ఉల్లంఘనలపై పోరాడటానికి ఉద్యుక్తులై, పోరాటరంగంలోకి దూకారు.

తరువాత ఆయన న్యాయశాస్త్రం అభ్యసించి, న్యాయవాదిగా మారారు. అశక్తులైన వారి హక్కులను కోర్టు ద్వారా కూడా రక్షించడానికి న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు. ఆయన వాదించిన కేసులన్నీ దాదాపు సమాజంలోని దిగువస్థాయి ప్రజానీకానికి జరిగిన అన్యాయం, మానవహక్కుల ఉల్లంఘనలకు సంబంధించినవే కావటం గమనార్హం.

బాలగోపాల్ స్థాపించిన మానవహక్కుల ఫోరమ్ దేశంలోని పౌరహక్కుల ఉద్యమకారులు ఎంచుకున్న మార్గానికి భిన్నంగా నడిచింది.

పౌరహక్కులకు సంబంధించిన విషయాలను బాలగోపాల్ సామాజిక - ఆర్థిక సమస్యలకు జోడించేవారు. ఆయన రాసిన అసంఖ్యాక వ్యాసాల్లోనూ, ఆయన చేపట్టిన వివిధ సమస్యల్లోనూ అది కనపడుతుంది.

బాలగోపాల్ ఆలోచనల్లో స్పష్టత ఉంది. ఆయనలో వివేకం, విస్తారమైన విజ్ఞానం ఉన్నాయి. మానవహక్కుల రంగంలో ఆయన చేసిన కృషి వల్ల ప్రజల్లో అవగాహన పెరగటానికి అవి దోహదపడ్డాయి.

తమ జీవనోపాధికే నానాటికీ ముప్పు పెరుగుతున్న స్థితిలో ఉన్న భారతదేశ ప్రజలకు బాలగోపాల్ లేని లోటు పూడ్చలేనిది. ఇదొక బాధాకరమైన వాస్తవం.

**– జింకా నాగరాజు**

(అనువాదం : టి.నర్మద)

**సుదీర్ఘ చరిత్ర, ఉన్నత నాగరికత, సిరి సంపదలు గల 'భారతదేశం' ఇక్కడకు దాదాపు పదివేల కి.మీ. దూరంలో గల ఒక చిన్నదేశం 'ఇంగ్లాండ్' పాలన క్రిందకు రావడం చరిత్రలో ఓ మరువలేని ఘట్టం. ఆ పరాయి దేశానికి చెందిన ఓ చిన్న వ్యాపార సంస్థ 'ఈస్ట్ ఇండియా కంపెనీ' వ్యాపార నెపంతో దేశంలో అడుగిడిగి ఇక్కడి పాలకుల అంతఃకలహాలను ఆసరాగా చేసుకుని కుట్రలు, కుతంత్రాలతో రాజ్యాధికారం సాధించడం, పాల నావ్యవస్థ నేర్పరచడం దేశచరిత్రలో దురదృష్ట సంఘటన.**

# స్థానిక స్వపరిపాలనా పితామహుడు

1757 ప్లాసీయుద్ధంతో బెంగాల్‌లో అధికారస్థాపన ప్రారంభించిన కంపెని 1857 నాటికి దేశంలో అత్యధిక భాగాన్ని తన పాలనలోకి తెచ్చుకొని రాజకీయ ఆర్థిక సాంఘిక మతపరంగా ప్రజలకు పరాయిపాలన రుచి చూపింది. కంపెనీ నిరంకుశ క్రూరపాలనకు వ్యతిరేకంగా జరిగిన సిపాయిల తిరుగుబాటు ద్వారా వెల్లడయిన భారతీయుల ఆగ్రహాన్ని మన్నించి, నాటి బ్రిటన్ పాలకురాలైన విక్టోరియా మహారాణి, కంపెనీ పాలన రద్దుచేసి, భారతదేశ పాలనను బ్రిటిష్ ప్రభుత్వం స్వీకరించింది. అయినా భారత్‌లో పరాయి పాలకుల ఆర్థికదోపిడి, జాత్యాహంకార విధానం, నిరంకుశపాలన కొనసాగింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయి, ప్రజలనేక కష్టనష్టాలకు గురై, స్వదేశంలోనే బానిసలుగా బ్రతకవలసి వచ్చింది. నాటి బ్రిటిష్ పాలకులు అత్యధికులు అవినీతిపరులు, అహంకారులు, అక్రమార్జనాపరులు. తమ తెల్లజాతి అగ్రజాతి అను అత్యున్నతమైనదని, భారతీయులు నల్లజాతి అని, అధములని, వారి నాగరికత, సంస్కృతులు పాలనా విధానంలో తమకు సమానులుకారని, జాత్యహంకారం–జాతి విచక్షణ చూపిస్తూ, నిరంకుశవైఖరి ప్రదర్శించేవారు.

భారతీయుల పట్ల ప్రతివిషయంలో కఠినవైఖరినవలంబించేవారు. కరువు కాటకాలు, అంటువ్యాధుల మూలంగా ప్రజలు కష్టాల పాలవుతున్నా కనికరం చూపేవారు కారు. కంపెనీ పాలన అంతమొంది, బ్రిటిష్ ప్రభుత్వపాలన కొనసాగినా స్వదేశ ప్రజలపట్ల, పాలనపట్ల, విదేశీ పాలకులలో మార్పులు శూన్యం. అలాంటి చీకటి రోజుల్లో కాంతిరేఖల్లా మానవతావాదం ఉదారవిధానం ప్రదర్శించిన, అరుదైన బ్రిటిష్ పాలకుల్లో ఓ మహోన్నత వ్యక్తి 'లార్డ్ రిప్పన్'.

లార్డ్ రిప్పన్ 1880 ఏప్రిల్‌లో ఇండియాలో బ్రిటిష్ రాజప్రతినిధిగా నియామకం కావడంతో దేశచరిత్రలో నూతనశకం ప్రారంభమైంది. రిప్పన్ ఉదారవాది. శాంతి, స్వేచ్ఛావాదం, స్వయంపాలన పట్ల రిప్పన్‌కు అత్యంత విశ్వాసం. తన నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో జాతివైషమ్యాలు నిరంకుశపాలనా విధానాలను ప్రక్కనబెట్టి ప్రజోపయోగమైన సంస్కరణలు కార్యక్రమాలు చేబట్టి భారతీయల మదిలో చిరస్మరణీయుడుగా నిలిచాడు. అధికారం చేపట్టగానే ఆఫ్ఘన్ యుద్ధాన్ని అంతమొందించి అక్కడి అమీర్‌తో స్నేహం నెలకొల్పాడు. బర్మాలో యుద్ధం తప్పనిసరైనా నివారించి తమ ప్రాబల్యాన్ని కొనసాగించాడు. విలియం బెంటింగ్ కాలంలో తాము వశపరచుకొన్న మైసూరు రాజ్యాన్ని తిరిగి ఆ రాజవంశం వారికి అప్పగించాడు. సామ్రాజ్యవాదానికి స్వస్తిపలికి శాంతియుతంగా పరిపాలన ప్రారంభించాడు.



**లార్డ్ రిప్పన్**

పరిపాలనలో ఉదార విధానాలను ప్రవేశపెట్టి అనేక ప్రజోపయోగ కార్యక్రమాలను రిప్పన్ చేపట్టాడు. ఆయన కాలంలో 1200 మైళ్ళ పొడవు కాలువల త్రవ్వకం జరిగి, నూతనంగా ఒక మిలియన్ ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. రైలుమార్గాల అవశ్యకత గుర్తించి నూతనంగా 2000 మైళ్ళ రైలు మార్గం వేయించాడు. విద్యారంగంపై శ్రద్ధ వహించి, 'హంటర్ కమిటి' నియమించి వారి సూచనల మేరకు ప్రాథమిక విద్యలో మార్పులు చేశాడు. ప్రభుత్వ గ్రాంట్లతో ప్రైవేటు విద్యాసంస్థలు నెలకొల్పాడు. కళాశాలలు, పాఠశాలలను ఇనస్పెక్టరులతో తరచు తనిఖీ చేయించేవాడు. భారతీయులు విద్యావంతులుగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని సంకల్పించాడు. పాలనలో ఖర్చు తగ్గించి పొదుపు పాటించాడు. సైనిక వ్యయం తగ్గించాడు. అనేక దిగుమతి సుంకాలు రద్దు చేసి స్వేచ్ఛా వ్యాపార విధానం ప్రోత్సహించాడు. ఉప్పుపై పన్ను తగ్గించాడు. భూస్వాముల బారి నుండి పేదరైతులకు రక్షణ కల్పించాడు.

భారతదేశంలో మొదటి ఫ్యాక్టరీ చట్టం 1881లో అమలు జరిపిన ఘనత రిప్పన్‌కు లభించింది. నాడు ప్యాక్టరీలలో పనిచేసే కార్మికులు సరైన జీతం, విశ్రాంతి, నిర్ణీత పనిగంటలకు నోచుకోక దుర్భరజీవితం అనుభవించేవారు. పరిస్థితులను మెరుగుపరచడానికి రిప్పన్ ప్యాక్టరీ చట్టం చేసి పన్నెండ్ల వయసుకన్న తక్కువ వయసువారు తొమ్మిది గంటలకు మించి పనిచేయరాదని, ప్రమాదకరమైన పనులు వారికి అప్పగించరాదని, కార్మికులకు రోజుకు ఒక గంట విశ్రాంతి, నెలకు నాలుగు రోజులు సెలవు దినాలుండాలని నిర్ణయించాడు. ప్రత్యేక అధికారులను నియమించి చట్టం ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించాడు. ఈ చట్టం ద్వారా రిప్పన్ తన మానవతావాదం నిరూపించాడు.

తనకు ముందు రాజప్రతినిధిగా వ్యవహరించిన లిట్టన్ ప్రభువు కాలంలో రూపొందించిన జాతివిచక్షణ చూపే చట్టాలను రిప్పన్ తన విశాల హృదయంతో రద్దు చేశాడు. భారతీయ భాషల్లో వెలువడే పత్రికలపై అనేక నిబంధనలు విధిస్తూ పత్రికా స్వాతంత్ర్యం హరించి వేసే లిట్టన్ కాలపు దేశభాషా పత్రికల చట్టం 1878ని రిప్పన్ రద్దు పరచాడు. ఫలితంగా భారతీయులలో ఆయన పట్ల గౌరవం పెరిగింది. నాటి నుండి భారతీయ పత్రికలు పాతిక సంవత్సరాలు పూర్తి స్వేచ్ఛననుభవించాయి. లిట్టన్ కాలంలో రూపొందించబడిన ఆయుధాల చట్టం 1871 కి సైతం రిప్పన్ సవరణలు సంకల్పించాడు.

లిట్టన్ కాలంలో బ్రిటిష్ పాలనా యంత్రాంగంలో యూరోపియనుల గుత్తాధిపత్యం కొనసాగించడానికి ఇండియన్ సివిల్ సర్వీసు పరీక్షకు హాజరయ్యే భారతీయుల వయోపరిమితిని 21 సంవత్సరాల నుండి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ, నిబంధనలు రూపొందించారు. భారతీయులకు సైతం ఉన్నతోద్యోగాలలో అత్యున్నత స్థానాల అవకాశం ఉండాల నే సదాశయంతో రిప్పన్ ఐ.సి.యస్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల వయోపరిమితి పెంచమని, ఆ పరీక్షలను ఇంగ్లాండ్‌తో బాటు, ఇండియాలో కూడా నిర్వహించాలని సిఫార్సు చేశాడు. కానీ ఇంగ్లాండ్‌లోని ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. విద్యావంతులైన భారతీయుల్లో ఈ చర్య తీవ్ర అసంతృప్తి రేపింది. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిచర్డ్ గర్త్ సెలవుపై వెళ్ళగా ఆ ఖాళీలో భారతీయ న్యాయమూర్తి రమేష్‌చందర్ మిట్టల్‌ను రిప్పన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. ఈ చర్యపట్ల కలకత్తాలోని యూరోపియన్‌లలో కలకలం రేగినా రిప్పన్ తన నిర్ణయం మార్చుకోలేదు. భారతీయులకు, బ్రిటిష్ వారికి స్నేహసంబంధాలేర్పడితే అది బ్రిటిష్ సామ్రాజ్యానికి క్షేమమని గుర్తించాడు.

విద్యావంతులైన భారతీయుల అభీష్టం-వాంఛ గుర్తించి పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించడం తన బాధ్యతగా భావించాడు. వారికి స్థానిక సంస్థల ద్వారా ప్రజాస్వామ్య విధానాలను అభ్యసింపదలచాడు. రిప్పన్ 1882లో ఆమోదించిన తీర్మానం ప్రకారం స్థానికపాలనకై నూతనంగా అనేక జిల్లా బోర్డులు, తాలుకా బోర్డులు ఏర్పాటు చేయడమైంది. మున్సిపాలిటీల అధికారాలు పెంచడమైంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం స్థానిక సంస్థల్లో అనధికార సభ్యుల సంఖ్యను 2/3 వంతుకు పెంచడం ద్వారా స్థానిక వ్యవహారాలు పాలన సాగాలని నిర్దేశించాడు. స్థానిక సంస్థలకు ఆర్థిక వనరులు సమకూర్చాలని ప్రాంతీయ ప్రభుత్వాలను ఆదేశించాడు. ఏ పాలనాంశాలను స్థానిక సంస్థలకు అప్పగించాలో గుర్తించాడు.

స్థానిక సంస్థల పాలనపై ప్రాంతీయ ప్రభుత్వాల జోక్యం ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు. అధికారుల ప్రమేయం లేక పాలనలో కొద్ది పొరపాట్లు జరుగవచ్చుని తెలిసినా, అచిరకాలంలో అనధికారులు ప్రజాస్వామ్య విధానంలో అనుభవం గడించి అవరోధాలను అధిగమించగల రని ఆశించాడు. ప్రభుత్వ అజమాయిషీ గాక ప్రభుత్వ సహకారం స్థానిక సంస్థలకు అవసరమని పేర్కొన్నాడు. ఎక్కడయినా స్థానిక సంస్థలు అధికార దుర్వినియోగానికి పాల్పడినా, పాలనపట్ల నిర్లక్ష్యం వహించినా ప్రాంతీయ ప్రభుత్వాలు వాటిని సస్పెండ్ చేయాలే గానీ, కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా వాటిని రద్దు చేయరాదని శాసించాడు. ఈ చర్యల ద్వారా రిప్పన్ ప్రభువు భారతదేశ చరిత్రలో 'స్థానిక సంస్థల పితామహుడు'గా కీర్తికెక్కాడు.

రిప్పన్ ప్రభువు కాలంలో 'ఇల్బర్టు బిల్లు' ప్రతిపాదన అత్యంత వివాదాంశంగా మారింది. రిప్పన్ కాలానికి అనేకమంది భారతీయ న్యాయమూర్తులు జిల్లా మేజిస్ట్రేటులుగా ఉన్నారు. కానీ భారతీయ నేరస్థులతో సమానంగా యూరోపియనులను విచారించే అధికారం 1873 నాటి క్రిమినల్ ప్రొసీజర్ కోడు ప్రకారం వారికి లేదు. న్యాయ విచారణలో ఈ జాతి విచక్షణ ఉండరాదని చట్టం ముందు అందరూ సమానులేనని రిప్పన్ భావించాడు. న్యాయ వివక్షతను తొలగిస్తూ భారతీయ న్యాయమూర్తులకు యూరోపియనులను విచారించే అధికారం ఇస్తూ తన కార్యనిర్వహణ మండలిలోని న్యాయశాఖ సభ్యుడు సి. పి. ఇల్బర్ట్ చే ఒక బిల్లు ప్రతిపాదింప చేశాడు. రిప్పన్ చర్యలు యూరోపియన్‌లలో తీవ్ర అసంతృప్తి, అలజడి రేకెత్తించాయి.

యూరోపియన్‌ల ఆత్మగౌరవానికి 'ఇల్బర్ట్ బిల్లు గొడ్డలి పెట్టు' అని, రిప్పన్ విధానాలు తమ హక్కులు హరించేవిగా ఉన్నాయని యూరోపియన్లు రిప్పన్‌ను ప్రత్యక్షంగా పత్రికాముఖంగా విమర్శించారు. రిప్పన్‌ను సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఎంతో ఉదారవాదియైన గ్లాడ్‌స్టన్ కూడా ఇల్బర్ట్ బిల్లును విమర్శించాడు. కలకత్తా, సిమ్లాలో యూరోపియన్ మహిళలు సైతం ఆయనను అవమానంగా దూషించారు. చివరకు భారతీయ జిల్లా జడ్జికోర్టుకు యూరోపియనుల కేసు విచారణకు వస్తే, వారిని విచారించడానికి జడ్జితో బాటు ఒక జ్యూరీ ఉండాలని ఆ జ్యూరీలో సగం మందికి తక్కువ గాకుండా యూరోపియనులు ఉండాలని ఇల్బర్టు బిల్లును సవరించడమైంది. జాతి విచక్షణ రద్దుపరచడానికి రిప్పన్ ప్రభువు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ వివాదం మూలంగా ఇంగ్లీషు వారు ప్రదర్శించిన జాతి వైషమ్యం, జాత్యహంకారం భారతీయుల్లో జాతీయోద్యమానికి స్ఫూర్తి కలిగించాయి.

పదవీ విరమణ చేసి 1884లో స్వదేశానికి మరలిన రిప్పన్ ప్రభువు పట్ల భారతీయులు చూపిన ఆదరాభిమానాలు మిన్నంటాయి. సిమ్లా నుండి బొంబాయి వరకు మార్గమధ్యం వెంట 70 మిలియన్లకు పైగా భారతీయులు ఆయనకు వీడ్కోలు పలికారు. 1915 సంవత్సరంలో కలకత్తాలో రిప్పన్ విగ్రహం నెలకొల్పదలిస్తే ఏ యూరోపియన్ కూడా ఒక్క రూపాయి కూడా విరాళంగా అందించకపోగా, భారతీయులే తమ స్వంత విరాళాలతో విగ్రహ ప్రతిష్ఠ గావించి తమ అభిమానం చాటారు. చివరగా బొంబాయిలో మున్సిపల్ భవనం శంకుస్థాపన కార్యక్రమానికి రిప్పన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, వేదిక వెండి బంగారు జ్ఞాపికలు, కుప్పలుగా పూలమాలలు, వేలాదిగా బ్యానర్లు, సన్మాన పత్రాలతో నిండిపోయింది. బొంబాయి నగరం సుందరంగా అలంకరించబడి, రిప్పన్ వెడుతున్న దారి వెంబడి వేలాది భారతీయులు ముకుళితహస్తాలతో నిలబడి వీడ్కోలు పలికారు. వ్యాపారస్థులు ముత్యాలు, వజ్రాలు పొదిగిన దండలతో ఆయనను సత్కరించారు.

రిప్పన్ ప్రయాణిస్తున్న గుఱ్ఱపుబండి భులేశ్వర్, ముంబాదేవి దేవాల యాలకు సమీపించగా అక్కడి బ్రాహ్మణులు రిప్పన్ ప్రభువుకు నొసట కుంకుమ దిద్ది, వెండిపళ్లేలలో నారికేళాలు సమర్పించి అక్షింతలతో ఆశీర్వదించారు. భారత దేశానికేతించిన మరెవరికీ లభించని గొప్ప గౌరవం రిప్పన్‌కు లభించింది.

స్థానిక సంస్థల ఏర్పాటు, వాటికి విధులు, నిధుల ఏర్పాటు, అధికారాల కేటాయింపు విషయాల్లో రిప్పన్ ప్రభువు మన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి మార్గదర్శకుడని పేర్కొనవచ్చు.

'గ్రామ స్వరాజ్యం' కలలు కన్న మహాత్మగాంధీ, స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు రాజ్యాంగం సవరించిన స్వర్గీయ రాజీవ్‌గాంధీల మాదిరిగానే, దేశ చరిత్రలో స్థానిక స్వపరిపాలన పితామహుడుగా రిప్పన్ ప్రభువు భారతజాతి మరువలేని మహామనిషి.

**- ఎ. సిద్దయ్యనాయుడు**

# ఇంద్రియ నిగ్రహం




రామాపూరం అనే ఓ మారుమూల గ్రామానికి ఒకరోజు పట్నం నుంచి సుబ్బారావనే మెడికల్ రిప్రజెంటెటివ్ వస్తాడు. ఆ రోజే తను వచ్చిన పూర్తి కాకపోవడంతో ఆ పనినే మర్నాడు కూడా వుండాల్సొచ్చి, ఆ రాత్రికి తల దాచుకునేందుకు తనకు ఏదైనా బస దొరుకుతుందేమోనని నలుగుర్నీ వాకబు చేస్తాడు. ఎంత శ్రమ పడ్డా తన ప్రయత్నం ఫలించదు. చివరికి బస్టాండులో కనబడ్డ ఒకాయన్ని అడిగితే, ఆయన అలాంటి బస ఏర్పాట్లేవీ తమ వూళ్ళో దొరకడం దుర్లభమని అంటూ, ఆ వూరి పొలిమేరలో వున్న వసంత విహార్ అనే ఓ చిన్న గెస్ట్ హౌస్ లాంటి చోట తన అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చని ఓ ఉచిత సలహా పారేస్తాడు. పాపం సుబ్బారావు ఆ రాత్రంతా కాళ్లరిగేలా తిరిగి, వూరి చివరనున్న ఓ పాడుబడ్డ బంగళాకి చేరుకుంటాడు. అదే వసంతవిహార్‌గా గుర్తించ గలుగుతాడు. అప్పటికి రాత్రి 10 గంటలు దాటుతుంటుంది.

సుబ్బారావు ఆ గెస్ట్‌హౌస్ లోపలికి వెళ్లేసరికి అక్కడంతా నిర్మానుష్యంగా, కీచురాళ్ళ శబ్దంతో నిండి వుంటుంది. అక్కడ వరండాలో ఓ మూల, చిన్న గుడ్డి దీపం వెలుగులో, కునికిపాట్లు పడుతూ ఓ నడి వయస్కుడు కనబడతాడు. సుబ్బారావు మెల్లమెల్లగా అడుగులేసుకుంటూ అతన్ని సమీపించి, దీర్ఘ నిద్రలో వున్న అతన్ని తట్టి లేపుతాడు. దాంతో ఉలిక్కి పడ్డ అతను ఆ గెస్ట్‌హౌస్ మేనేజర్‌గా తనని తాను పరిచయం చేసుకుంటూ, సుబ్బారావు వివరాలన్నీ నిదానంగా కూపీ లాగుతాడు. ఆ రాత్రికి, ఆ ఒక్క రాత్రికి మాత్రమే, ఆ గెస్ట్‌హౌస్‌లో నిద్రపోయేందుకు తనకేమైనా కాస్తంత చోటు దొరుకుతుందా అని సుబ్బారావు ప్రాధేయపడతాడు. దానికి ఆ మేనేజర్ పెదవి విరుస్తూ, అక్కడున్నది బొత్తిగా నాలుగు గదులేననీ, కానీ ఆ నాలుగూ ఎప్పుడో బుక్కయి పోయాయని, అస్సలు ఖాళీ ప్రసక్తే లేదని



అంటాడు. దాంతో సుబ్బారావు ఆ మేనేజరు కాళ్లు పట్టుకున్నంత పని చేసి. తనకేదైనా తరుణోపాయం చూపమంటూ దీనంగా అర్థిస్తాడు.

సుబ్బారావు పరిస్థితికి కాస్త మెత్తబడ్డ ఆ మేనేజరు అతనికి సాయపడ్డానికి తనకో చిన్న మార్గం తోస్తోందని అంటూ, సుబ్బారావు గనక ఓ చిన్న ఎడ్జస్టుమెంటుకి సిద్ధం కాగలిగితే, అతనికో మంచి పరిష్కారాన్ని చూపగల నంటాడు. తన నిస్సహాయ స్థితిని ఎంత చక్కగా ఎన్‌కాష్ చేసుకోబోతున్నాడో అర్థం కాక, వేరే తరుణోపాయం తోచక, దానికి సుబ్బారావు సరే నంటాడు. ఎందుకైనా మంచిదని అద్దె ఎంత ఇచ్చుకోవాలని అడుగుతాడు. ఎంత – ఓ ఇరవై రూపాయలే అని చెప్పగానే, సుబ్బారావుకి మతి పోయినంత పనౌతుంది. మరి తను చేసుకోవాల్సిన అడ్జస్టుమెంటు ఏమిటన్నది అతనికి అర్థంకాదు. ఆ విషయాన్నే కాస్త విపులంగా చెప్పమని మేనేజర్ని సుబ్బారావు అడుగుతాడు. దానికి ఆ మేనేజరు ఇలా చెప్పడం మొదలెడతాడు.

"ఇందాక మీతో చెప్పినట్టు ఈ గెస్ట్‌హౌస్‌లో నాలుగంటే నాలుగే గదులున్నాయ్. కానీ, ఆ నాలుగూ ఆల్రెడీ బుక్కయి పోయి వాటిలో ఇద్దరిద్దరు గెస్టులు బస చేస్తున్నారు. ఐతే, ఒక గదిలో మాత్రం ఒక్క గెస్టు మాత్రమే వున్నారు. అదీ ఓ యంగ్ లేడీ. దాదాపు పాతికేళ్ల వయసున్న యువతి. ఆ గదిలో రెండు బెడ్లు వున్నాయి. వాటి రెండింటి నడుమ ఓ మందమైన నల్ల కర్టెన్ వేలాడుతుంటుంది. ఇప్పుడు విషయమేమంటే, ఆ యువతికి ఓ చిన్న కంప్లయింట్ వుంది. నిజానికి అదో అలవాటు మాత్రమే.

అదేమంటే, ప్రతిరోజూ రాత్రి 9.00 గంటలకల్లా పడుకొని మర్నాడు పొద్దున్న 7.00 కొట్టేదాకా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవిడ నిద్ర లేవదు. పక్కనే బాంబులు కానీ, పిడుగులే పడినా కానీ, పెద్ద భూకంపాలొచ్చినా ఆవిడ పిసరంతైనా చలించదు. కాబట్టి, మీరు ఈ రాత్రికి ఆవిడున్న గదిలోని ఇవతలి బెడ్ మీద పడుకొని, రేపు ఆ అమ్మాయి నిద్ర లేచే లోపు బయట పడగలిగేలా ఎడ్జస్టు కాగలిగితే...." అని తన మాట పూర్తి చేసేలోపే సుబ్బారావు చటుక్కున లేచి నిలబడి.

"ఇంకా ఆలోచిస్తారేవిటి సార్? దానికంత మీమాంస అఖ్ఖర్లేదు. నాకు మీరు చెప్పిన ఎడ్జస్టుమెంటు నూటికి నూరు పాళ్లు సమ్మతమే – ఇదిగో, అడ్వాన్సు తీసుకోండి.." అంటూ తన పర్సులోంచి ఇరవై రూపాయలు తీసి ఇస్తాడు. అక్కడి రిజిస్టర్‌లో సంతకం చేస్తుండగా సుబ్బారావుకో డౌటొస్తుంది. అప్పటికే రాత్రి 10.30 దాటుతోంది గనక, ఒకవేళ ఆవిడ గది లోపల లాక్ చేసుకొని పడుకుంటే ఎలా ప్రవేశించాలని అడుగుతాడు.

దానికి స్పందిస్తూ మేనేజరు సుబ్బారావుకి ఆ గది డూప్లికేట్ తాళం చెవినందిస్తూ దాని సాయంతో ప్రవేశించే అవకాశం వుందని, జాగ్రత్తగా మేనేజ్ చెయ్యమని సూచిస్తాడు. దాన్నందుకున్న సుబ్బారావు ఉరకలేసే ఉత్సాహంతో ఆ గది వేపు వెళ్తాడు.

సరిగ్గా ఓ అరగంట గడిచీ గడవక మునుపే సుబ్బారావు అప్పుడే రిలీజైన స్ప్రింగులా బయటికి దూసుకొస్తాడు. అలా వస్తూనే, అక్కడ గుర్రు పెట్టి నిద్రపోతున్న మేనేజర్ని నిద్ర లేపుతూ– "ఏవండోయ్....ఏవండీ....ఏవండోయ్ మిమ్మల్నే..ఇదేంపనండీ.... ఆ? అసలిదేం పనీ అనడుగుతున్నా మిమ్మల్ని.... మరీ ఇంత ఘోరమైన అన్యాయమా? నాకు మీ బెడ్డూ వద్దు... గాడిద గుడ్డూ వద్దు..మీ ఎడ్జస్టుమెంటు అసలే వద్దు... బతికుంటే బయట రోడ్డుమీదో, పేవ్‌మెంట్ మీదో దొర్లేసి బతికేస్తాను...శలవ్..."

దానికి ఆ మేనేజర్ ఉలిక్కి పడి లేస్తూ, విషయం చెప్పకుండా అలా గావుకేకలు పెడితే తానేం చేయలేనంటాడు. అంతగా గగ్గోలు పెట్టడం దేనికని నిలదీస్తాడు. దానికి సుబ్బారావు బదులిస్తూ –

"అది కాదండీ..నా ఖర్మ కాలిపోయి అడక్కడక్క మిమ్మల్ని రవంత సాయం చేయమడిగితే, మరీ ఇంత ఘోరానికొడిగడతారా? ఆ? ఓ డెడ్ బాడీ పక్కనున్న బెడ్ మీద నన్ను పడుకోమని చెప్తారా? అ ?ఇదేం ఘోరమండీ? అలా బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడరేమండీ? అసలు ఆ అమ్మాయి చచ్చి పోయిందన్న విషయం మీకు నిజంగా తెలియదా అనడుగుతుంటే మాట్లాడరేమండీ ?"

ఇది విన్న అ మేనేజరు, కాస్త తేరుకొని పకపకా నవ్వుతాడు. దాంతో మళ్ళీ తిరగబడబోతున్న సుబ్బారావుతో కాస్త ఆగమని సూచిస్తూ, ఇలా అడుగుతాడు –

"అవునండీ... మీరన్నట్టుగానే ఆవిడ చచ్చిపోయిన మాట నిజమే, ఆ విషయం నాకు ఇంతకు ముందే తెలుసు కూడా... ఐతే ఆ సంగతి మీరెలా కనుక్కున్నారూ?"

అంతే, దీనికి ఎలా జవాబివ్వాలో అర్థంకాక పాపం సుబ్బారావు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టై, వెంటనే అక్కణ్ణుంచి తన తోక ముడుస్తాడు. అలా జారుకుంటున్న సుబ్బారావును చూస్తూ ఆ మేనేజరు –

దొంగ ఎదవ...హహ్హా..హహ్హా...హ...ఇంకో ఎదవా...

అలా ఆ రాత్రి అంతకు ముందు ఆ గదిలోకి పంపిన ఇంకొందరిని కూడా తలుచుకొని నవ్వుకుంటాడు.

* * * * *

ఈ కథ ముగించిన పండితుడు దీనిలో అంతర్లీనంగా వున్న అమూల్య సందేశాన్ని ఓ శ్లోకంతో ఇలా ప్రవచిస్తాడు :

*ఇంద్రియ పరవశుం డధముం*
*డింద్రియ పరవశుండె భక్తియెడ మధ్యముండౌ*
*డింద్రియ జయుండుత్తముండు జి*
*తేంద్రియ సమధికుండు విన మహేశుండు వేమా ..*

అనగా ఇంద్రియములకు లొంగిన వాడధముడు. ఇంద్రియ పశుడైనను భక్తియున్నచో మధ్యముడగును. ఇంద్రియములకు లొంగని వాడు ఉత్తముడు, ఈశ్వర స్వరూపుడు.

☆

# ఆంధ్రప్రదేశ్‌లో 50 సంవత్సరాల పంచాయతీరాజ్ పాలన - అధిగమించవలసిన సవాళ్ళు

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ 2009 నవంబర్ 1నాటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. గత 50 సం.లలో రాష్ట్రంలోని పంచాయతీరాజ్ వ్యవస్థ పలు ఉత్థాన పతనాలకు లోనయింది. కాలానుగుణంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలో వచ్చిన పలు మార్పులు ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు నాంది పలికి, ఈ వ్యవస్థను రాజ్యాంగ బద్ధమైన స్థానికప్రభుత్వాలుగా మలచటంలో కీలక భూమికను పోషించాయి. బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫారసులకనుగుణంగా 1958 సం.లో భారతదేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో తొలిసారిగా ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఘనత మన రాష్ట్రానిదే.

ఈ ప్రక్రియ మనరాష్ట్రంలో ప్రయోగదశలో ఉన్న సమయంలోనే మూడంచల పంచాయతీరాజ్ వ్యవస్థను 1959 అక్టోబరు 2న రాజస్థాన్ అంకురార్పణ చేయగా ఒక్క నెలరోజుల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్‌లో 1959 నవంబర్ 1న పంచాయతీరాజ్ వ్యవస్థను అమలులోకి తీసుకొని వచ్చింది. మనరాష్ట్రంలో మూడంచల  పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చే సమయానికే గ్రామీణ ప్రాంతాలలో పరిపాలనా వ్యవహారాలను గ్రామ పంచాయతీలు, తాలూకాబోర్డులు, జిల్లా బోర్డులు నిర్వహిస్తూ ఉండేవి. జిల్లా బోర్డు వ్యవహారాలు కోస్తా ఆంధ్ర ప్రాంతాలలో మద్రాసు జిల్లాబోర్డుల చట్టం 1920 ప్రకారం, గ్రామ పంచాయతీ వ్యవహారాలను మద్రాసు పంచాయతీల చట్టం 1950 ప్రకారం నిర్వహించబడుతుండేవి. ఇదే సమయంలో ఈ వ్యవహారాలు తెలంగాణా ప్రాంతంలో హైదరాబాద్ జిల్లాబోర్డుల చట్టం 1951, హైదరాబాద్ గ్రామపంచాయతీల చట్టం 1951 ప్రకారం నిర్వహించబడేవి.

రాష్ట్రంలో మూడంచల పంచాయతీరాజ్ వ్యవస్థను అమలులోకి తీసుకొనివచ్చే సందర్భంలో గ్రామస్థాయి పరిపాలనకు అప్పటికే అమలులో ఉన్న గ్రామపంచాయతీ చట్టాల ప్రకారం జరిగేటట్లు, తాలూకా బోర్డు, జిల్లా బోర్డుల స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన సమితిలు, జిల్లా పరిషత్తుల నిర్వహణకొరకు పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తుల చట్టం 1959ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చింది. 1959-60 మధ్య కాలంలో 20 జిల్లా పరిషత్తులను, సుమారు 448 పంచాయతీ సమితులను రాష్ట్రంలో ఏర్పరిచారు. గ్రామపంచాయతీల పరిపాలన రాష్ట్రవ్యాప్తంగా ఒకే పద్ధతిలో జరిగే విధంగా అప్పటికే అమలులో ఉన్న మద్రాసు గ్రామ పంచాయతీల చట్టం, హైదరాబాద్ గ్రామపంచాయతీల చట్టాలను సమగ్ర పరుస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామపంచాయతీల చట్టం 1964ను అమలులోకి తీసుకొనివచ్చారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రారంభమయిన తదుపరి కొద్ది సంవత్సరాల పాటు అంటే 1959-63 వరకూ ఈ సంస్థలు ఆశాజనకంగా పనిచేసినప్పటికీ, తరువాత కాలంలో పంచాయతీరాజ్ సంస్థలు వివిధ కారణాల వల్ల తమ ప్రాభవాన్ని కోల్పోయాయనే చెప్పవచ్చు. పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చిన పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తు చట్టం 1959 ప్రకారం స్థానికశాసన సభ్యులకు, శాసన మండలి సభ్యులకు కూడ పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తులకు అధ్యక్షత వహించటానికి అవకాశం కల్పించారు. ద్వంద్వ పదవులు అనుభవించటం ద్వారా శాసనసభ్యులలో ఎక్కువభాగం పంచాయతీరాజ్ సంస్థలలో తమ అధిపత్యాన్ని చెలాయించటానికి అవకాశం కలిగింది. ఐతే ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తుల చట్టం 1959 కి 1963లో సవరణలు చెయ్యటం ద్వారా స్థానిక శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు జంటపదవులు నిర్వహించటానికి అవకాశం లేకుండా నియంత్రించారు. ఏదో ఒక పదవిమాత్రమే నిర్వహించవలెనన్న నిబంధన వల్ల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఈ సంస్థల కార్యక్రమాల పట్ల నిరాసక్తత కనపర్చటమే కాక సమితి, జిల్లా పరిషత్తులలో సమర్థవంతమైన నాయకత్వం ఉన్న చోట తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందనే భయంతో ఈ సంస్థలతో సత్సంబంధాలను నెరపలేకపోయారు. సమితి అధ్యక్షుని పరిధి ఇంచుమించు శాసనసభా నియోజక వర్గమంతా ఉండటంతో వీరిరువురి మధ్య సంబంధాలు దెబ్బతిని, ఆధిపత్యపోరుకు దారి తీసాయి. సమితి ప్రెసిడెంట్లు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు, శాసనసభ్యుల మధ్య ఆధిపత్య పోరుతో, ఇతర రాజకీయ, సాంఘిక కారణాల రీత్యా పంచాయతీరాజ్ సంస్థలు ఆశించిన రీతిలో ప్రజలకు సేవలను అందించలేక ప్రజామోదాన్ని కూడా పొందలేక పోయాయి. ఈ సంస్థల ద్వారా అమలు పరచబడిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలన్నీ సమాజంలోని కొన్ని వర్గాలకే చేరటం, అధికారం కొద్ది మంది చేతిలో కేంద్రీకృతం కావటం వంటివి చోటు చేసుకొన్నాయి.

ఈ దశలో ప్రభుత్వం 1963లో ఎం.ఆర్ పాయ్, 1967లో ఎం.టి.రాజుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీలు పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిలో పెట్టడానికి పలు మార్పులు, చేర్పులు కోసం సిఫారసు చేసాయి. ఎక్కువ సంఖ్యలో ఉన్న పంచాయతీ సమితులను 448 నుండి 290కి కుదించటానికి ఎం.ఆర్ పాయ్ కమిటీ సిఫారసు చేయగా ఈ సంఖ్యను ప్రభుత్వం 321 సమితులకు తగ్గించటం, వెనుకబాటు తనం ప్రాతిపదికన సమితులను అభివృద్ధి చెందిన, సాధారణ, వెనుకబడిన, గిరిజన తరగతులుగా వర్గీకరించటం జరిగింది. ఎం.టి. రాజు కమిటీ సిఫారసు ప్రకారం జిల్లా పరిషత్తు అధికారాలను కత్తిరిస్తూ జిల్లా కలక్టరు అధ్యక్షతన జిల్లా అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేసి జిల్లాపరిషత్తు కన్నా కలక్టరుకు కీలక పాత్ర అప్పగించటం జరిగింది. ఈ చర్య వల్ల కూడా పంచాయతీరాజ్ వ్యవస్థలు బలహీనమయ్యాయని చెప్పవచ్చు. జిల్లా పరిషత్తు / సమితుల ప్రజాప్రతినిధుల వత్తిడి ఫలితంగా పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి తీసుకోవాల్సిన చర్యల గూర్చి సిఫారసు చేయటం కోసం 1968 మార్చిలో జలగం వెంగళరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లెజిస్లేచరు పార్టీ ఒక కమిటీని ఏర్పరచింది. ఈ కమిటీ ప్రధానంగా పంచాయతీరాజ్ సంస్థల ఆర్థిక వనరులపైన, ఎన్నికల విధానం పైన, సంస్థలు నిర్వహించే విధులపైన కీలకమైన సిఫారసులను చేసింది. జిల్లా అభివృద్ధి బోర్డులను రద్దు చేయాలని సిఫారసు చేసింది. అదే విధంగా 1971 లో సి.నరసింహం అధ్యక్షతన

ఒక ఉన్నతస్థాయి కమిటీని కూడ ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసారు. ఈ కమిటీ చేసిన సిఫారసులలో ప్రధానంగా పంచాయతీ సర్పంచ్, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తు సభ్యుల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలుండాలని, జిల్లా పరిషత్తు స్థాయీ సంఘాలలో కలక్టరుకు సభ్యత్వం ఉండరాదనీ, పంచాయతీరాజ్ సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు ఉండాలని, శాసన సభ సభ్యులకు సమితి, జిల్లా పరిషత్తులలో సభ్యత్వం కల్పించరాదనీ, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తు ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరపాలన్నవి ముఖ్యమైనవి.

జలగం వెంగళరావు కమిటీ, సి.నరసింహం కమిటీల సిఫారసులకనుగుణంగా 1976 లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితి, జిల్లాపరిషత్తు చట్టం 1959 కి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1964 కు సవరణలు జరిగాయి. గ్రామపంచాయతీ సర్పంచ్, సమితి అధ్యక్ష ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిపై జరిగేందుకు ఈ సవరణలు వీలు కల్పించాయి. జిల్లాపరిషత్తులో జిల్లాకలక్టరుకు గల సభ్యత్వ తొలగింపు, స్థాయి సంఘాల అధ్యక్ష పదవినుండి జిల్లాకలక్టరును తొలగించటం వంటివి 1976 సవరణలో చోటు చేసుకొన్నాయి.

పంచాయతీరాజ్ వ్యవస్థను సంస్కరించటం కోసం కేంద్రస్థాయిలో ఏర్పాటుచేసిన అశోకమెహతా కమిటీ సిఫారసులు 1978లో రావటంతో ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో తీసుకొనిరావలసిన మార్పులు గూర్చి సిఫారసు చేయటం కోసం సి.నరసింహం నేతృత్వంతో ఒక కమిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చేసిన సిఫారసులలో పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని, ఎన్నికలను క్రమం తప్పకుండ నిర్వహించాలని, రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి నిధులు ప్రత్యేకంగా విడుదల చేయాలని, స్పష్టమైన విధులను బదలాయించాలని చేసిన సిఫారసులు ముఖ్యమైనవి. ఈ సిఫారసులను పూర్తి స్థాయిలో అమలుచేయనప్పటికీ 1979 లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తు చట్టం 1959కి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1964కి మరల సవరణలు జరిగాయి. ఈ సవరణల వల్ల ఓటు హక్కు 21 సం.నుండి 16 సం.కు తగ్గించటం, సర్పంచ్, సమితి అధ్యక్ష స్థానాలో ఎస్.సి మరియు ఎస్.టి.లకు రిజర్వేషన్లు వర్తించటం జరిగింది.

1964 నుండి 1981సం. మధ్య కాలంలో పంచాయతీరాజ్ వ్యవస్థల పనితీరు ఏ మాత్రం ఆశాజనకంగా లేదనే చెప్పవచ్చు. 1970 లో ఏర్పడిన పాలకవర్గాల పదవీకాలం 1975 పూర్తి అయినప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా వీటి పదవీకాలాన్ని ఒక సంవత్సరం పొడిగించారు. 1976లో ఈ సంస్థలకు ఎన్నికలు నిర్వహించబడతాయని భావించినప్పటికీ, ప్రభుత్వం ఈ సంస్థలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. ఎన్నికకాబడిన పాలకవర్గాలు ఉండవలసిన సమితి, జిల్లా పరిషత్తుల స్థానంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులకు సహకరించేందుకు గాను ప్రభుత్వం కొన్ని సలహా మండలులను పంచాయతీ రాజ్ సంస్థలకు నియమించింది. మరల 1979లో రాష్ట్రంలో క్రొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ, హైకోర్టు ఉత్తర్వుల వల్ల ఈ ప్రక్రియకు గండి పడింది. ఎట్టకేలకు దశాబ్దకాలం తర్వాత 1981లో రాష్ట్రప్రభుత్వం అన్ని స్థాయిలలోని పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది. ఐతే పంచాయతీ రాజ్ స్ఫూర్తి అప్పటికే దెబ్బతిని ఉండటంతో క్రొత్తగా ఏర్పడిన పాలక వర్గాలు కూడా సమర్థవంతంగా పనిచేయలేని పరిస్థితులు ఆనాడు ఉన్నాయి.

1983లో రాజకీయ అధికార మార్పిడి ఫలితంగా అధికారపగ్గాలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం గ్రామీణ పరిపాలనా వ్యవస్థలో పెనుమార్పుకు శ్రీకారం చుట్టింది. పరిపాలనను ప్రజల చెంతకు తీసుకొనివెళ్ళే క్రమంలో అప్పటికే అమలులో ఉన్న 330 పంచాయతీ సమితులను 1104 మండల ప్రజాపరిషత్తులుగా పునర్వ్యవస్థీకరించి మండల వ్యవస్థను తీసుకొనివస్తూ 1986లో ఆంధ్రప్రదేశ్ మండల ప్రజాపరిషత్తు, జిల్లా ప్రజాపరిషత్తు, జిల్లా అభివృద్ధి మరియు సమీక్షామండలి చట్టాన్ని తీసుకొనివచ్చింది. ఈ చట్ట ప్రకారం మండల ప్రజాపరిషత్తు అధ్యక్షుని ఎన్నిక, జిల్లా ప్రజాపరిషత్తు అధ్యక్షుని ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగాలి. సర్పంచులు, శాసనసభ, పార్లమెంటు సభ్యులు పదవి రీత్యా మండల పరిషత్తులో సభ్యులౌతారు. మండల ప్రజాపరిషత్తు అధ్యక్షులు, శాసనసభ, పార్లమెంటు సభ్యులు పదవిరీత్యా జిల్లా ప్రజా పరిషత్తులో సభ్యులౌతారు. కొత్త చట్టాన్ని అనుసరించి 1986లో గ్రామపంచాయతీలకు, 1987లో మండల ప్రజాపరిషత్తులకు, జిల్లా ప్రజాపరిషత్తులకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ప్రజాపరిషత్తు, మండల ప్రజాపరిషత్తు అధ్యక్షుల ఎన్నిక పార్టీ ప్రాతిపదికన ప్రత్యక్ష పద్ధతిలో జరగటం వల్ల అధ్యక్ష స్థానాలు అధికార ప్రాంతీయ పార్టీ దక్కించుకోవటం, సభ్యత్వ స్థానాలలో ఎక్కువ భాగం ప్రతిపక్ష పార్టీలకు చెందినవారుండటం లేదా దీనికి విరుద్ధంగా అధ్యక్షుని స్థానంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు ఎంపిక కావటం సభలలో మెజారిటీ సభ్యులు అధికార పార్టీకి చెందినవారు ఎన్నిక కావటం వంటి విచిత్ర సంఘటనలకు ఈ చట్టం దారితీసింది. పలు సందర్భాలలో ఇటువంటి పరిస్థితులు అభివృద్ధి నిరోధకాలుగా పరిణమించాయి. పంచాయతీ సమితి నిర్వహించే అన్ని కార్యక్రమాలను మండలపరిషత్తుకు దఖలు పర్చినప్పటికీ అందుకు కావలసిన సిబ్బందిని, నిధులకు సమకూర్చటంలో ప్రభుత్వ ప్రయత్నం సఫలీకృతం కాలేదని చెప్పవచ్చు. ఐతే ఈ మార్పు ప్రజలకు, పరిపాలనా వ్యవస్థకు మధ్య దూరాన్ని తగ్గించినప్పటికీ, పూర్వపు సమితులకు ఉన్న ప్రాభవాన్ని మాత్రం ఇవ్వలేకపోయిందనే చెప్పవచ్చు. అంతేగాకుండా ఇదే సమయంలో జిల్లా అభివృద్ధి మరియు సమీక్షామండలిని రాష్ట్రప్రభుత్వంచే నియామకం చేయబడిన రాష్ట్రమంత్రి అధ్యక్షతన, జిల్లా కలక్టరు, జిల్లా ప్రజాపరిషత్తు ఛైర్మను, కొంతమంది ప్రభుత్వంచే నామినేట్ చేయబడిన శాసన సభ్యులు, ఇతర సభ్యులతో ఏర్పాటు చేయటం వల్ల పంచాయతీరాజ్ స్ఫూర్తి దెబ్బతిన్నదనే చెప్పవచ్చు. ఈ అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వం ఈ వ్యవస్థలోని లోపాలను గూర్చి కూలంకషంగా పరిశీలించటానికి బి.పి.ఆర్. విఠల్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ పలు సిఫారసులు చేసినప్పటికీ, 1992లో కేంద్ర ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ తీసుకొనిరావటంతో పంచాయతీరాజ్ వ్యవస్థను రాజ్యాంగ నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించవలసిన అవసరం ఏర్పడింది.1992 సం.లో ఈ సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, వివిధ కారణాల వల్ల 1995 వరకూ ప్రత్యేక అధికారుల పాలనలోనే పంచాయతీరాజ్ సంస్థలు పనిచేసాయి.


1959 నాటి నుండి 1993 సం.లో 73 రాజ్యాంగసవరణ అమలులోకి వచ్చేవరకూ వరకూ ఈ సంస్థలు పైన చర్చించిన విధంగా పలు మార్పులకు లోనయ్యాయి. 73వ రాజ్యాంగ సవరణ అనంతరం 1994లో రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థలో చోటుచేసుకొన్న వ్యవస్థాగత మార్పులు పంచాయతీ రాజ్ సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దటానికి దిశానిర్దేశం చేశాయని చెప్పవచ్చు.

73వ రాజ్యాంగ సవరణను అనుసరించి పంచాయతీరాజ్

సంస్థలను బలోపేతం చేయటానికి రాష్ట్రప్రభుత్వం అంతకు ముందు రాష్ట్రంలో అమలులోఉన్న గ్రామపంచాయతీ చట్టం(1964) మండల ప్రజాపరిషత్తు, జిల్లా ప్రజాపరిషత్తు మరియు జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలి చట్టం (1986) లను ఏకీకృత పరిచి గ్రామపంచాయతీ, మండలపరిషత్తు మరియు జిల్లా పరిషత్తులకు కలిపి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని 1994లో అమలులోకి తీసుకొని వచ్చింది. ఈ చట్టాన్ని అనుసరించి పంచాయతీ రాజ్ సంస్థలలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించటం, పదవులలో మహిళలకు 1/3వ వంతు ప్రాతినిధ్యం కల్పించటం, నాయకత్వ స్థానాలలో సైతం షెడ్యూల్డుకులాలు/తెగలు, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించటం, రాష్ట్ర ఆర్థిక కమీషన్‌ను, రాష్ట్ర ఎన్నికల కమీషన్‌లను ఏర్పరచటం వంటి పలు చర్యలు చేపట్టింది.1998 సం.లో షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరించిన పంచాయతీరాజ్ చట్టాన్ని కూడ అమలు లోనికి తెచ్చింది.

రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థల పరిణామ క్రమంలో 73వ రాజ్యాంగ సవరణ ఒక బలమైన పునాదిని ఏర్పరచినదని చెప్పవచ్చు. ఎందుకంటే 1959 సం. నుండి 1993 వరకూ అనగా 73వ రాజ్యాంగ సవరణకు పూర్వం సుమారు 34సం.లలో కేవలం 5 సార్లు (1959, 1964, 1970, 1981 మరియు 1987) మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ సంస్థలకు ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఐతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 73వ రాజ్యాంగ సవరణ అనంతరం, అంటే గత 15 సం.లలో పంచాయతీరాజ్ సంస్థలకు క్రమం తప్పకుండా 3 విడతలుగా ఎన్నికలు నిర్వహించబడటం గుర్తించదగిన మార్పు అనటంలో ఏ మాత్రం సందేహం లేదు. అలాగే 1994లో మొదటి రాష్ట్ర ఆర్థిక కమీషన్‌ను, 1998లో రెండవ ఆర్థిక కమీషన్‌ను ఏర్పాటు చేసి ఈ కమిటీలు చేసిన సిఫారసులకనుగుణంగా స్థానిక సంస్థలకు నిధులను కూడా ప్రత్యేకంగా విడుదల చేయటం జరిగింది. అలాగే 2004 సం.లో 3వ ఆర్థిక సంఘంను నియమించగా, ఈ కమిటీ కూడా ఇటీవలే తన తుది నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రభుత్వ ఆమోదం పొందవలసిఉన్నది.

73వ రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243 (జి). నందు పంచాయతీరాజ్ సంస్థలకు స్థానిక ప్రాంతాల ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం సాధించటానికి ప్రణాళికలు తయారుచేయటమే గాక, ఈ రెండు లక్ష్యాల సాధనకు ఉద్దేశించబడిన పథకాలను నిర్వర్తించటానికి అవసరమైన నిధులు, విధులు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వాలు బదలాయించవలసినదిగా సూచించబడినది. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడిన ఆర్టికల్ 243 జడ్. (డి) ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో జిల్లా ప్రణాళికా కమిటీలను ఏర్పరచి జిల్లా అభివృద్ధి ప్రణాళికా రచనను చేపట్టాలని సూచించబడినది. అయితే నేటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యలు పంచాయతీరాజ్ సంస్థల ఏర్పాటును ప్రాథమికంగా సమర్థించేవి తప్పితే రాజ్యాంగంలోకి ఆర్టికల్ 243 (జి) మరియు 243 జడ్ (డి) లో పేరొన్న విధంగా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి తమంతట తామే ప్రణాళికలు తయారు చేసుకొని అమలు పరిచే స్వయం ప్రతిపత్తిని కలిగించే చర్యలు కావు. అందువల్ల ప్రస్తుతం కొన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు పరిచే ఏజన్సీలుగా మినహా పంచాయతీరాజ్ సంస్థలు తమ ప్రాంత అభివృద్ధి కొరకు తామే ప్రణాళికలు తయారు చేసుకొని అమలు పరిచే స్థానిక ప్రభుత్వాలుగా బాధ్యతలను నిర్వర్తించలేక పోతున్నాయి.




1990వ దశకంలో ప్రవేశ పెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా నేడు దేశంలో ఆర్థిక వృద్ధి 9 శాతం పైగా పురోగమిస్తూ కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపు పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ, ఈ అభివృద్ధి ఫలాలు పేదలకు, మరీ ముఖ్యంగా ఎస్.సి/ ఎస్.టి / వెనుకబడిన తరగుతుల వంటి అణగారిన వర్గాలకు అందటం లేదన్నది జగమెరిగిన సత్యం. ఈ నిధులతో గ్రామీణ పేదల అభివృద్ధి కోసం చేపట్టే వివిధ పథకాల నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించాలంటే ఈ పథక రచనలో, మరియు ప్రణాళికలు రూపకల్పనను అమలు పరిచే బాధ్యతను పంచాయతీరాజ్ సంస్థలకు అప్పగించాలని పదకొండవ పంచవర్ష ప్రణాళికా వ్యూహ రచనలో ప్రణాళికా సంఘం అభిప్రాయ పడింది. దీనివలన గ్రామీణ ప్రాంతాలలో జరిగే ప్రతీ రూపాయి ఖర్చు సమాచారం ప్రజలకు చేరువలో ఉండటమే కాక జరిగే కార్యక్రమాలలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం సాధించటానికి అవకాశం ఉంటుందని కూడా ప్రణాళికా సంఘం పేర్కొనటం జరిగింది.

రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికార వికేంద్రీకరణ ప్రక్రియను వేగవంతం చేయటమే గాక, ప్రణాళికా వికేంద్రీకరణను కూడా ప్రోత్సహించాలి. ఈ ప్రక్రియకు ఇప్పటికే నాంది పలికిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి ఈ దిగువ చర్చించిన సమస్యలను అధిగమించాల్సి ఉన్నది.

## నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపు

పంచాయతీరాజ్ వ్యవస్థలను బలోపేతం చేసే దిశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2006 సం.లో కేంద్ర ప్రభుత్వంతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం పంచాయతీరాజ్ సంస్థలకు మూడు అంచెల వారీగా విధుల విభజనను, అధికారాల బదలాయింపునకు సంబంధించిన యాక్టివిటి మ్యాపింగు ప్రక్రియను చేపట్టి జనవరి 2008 నాటికి వ్యవసాయం, విద్య, వైద్యం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, త్రాగునీరు, వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పశుసంవర్ధన, ఫిషరీస్ వంటి 9 కీలక శాఖలకు సంబంధించిన అధికారాలను, విధులను, నిధులను పంచాయతీరాజ్ సంస్థలకు 2008 జనవరి నాటికి బదలాయించినది. అంతేగాక బదలాయించబడిన విధులను సమర్థవంతంగా అమలు పరచటానికి అవసరమైన నిధులు, సిబ్బందిని, నిర్ణయీకరణలో స్వేచ్ఛని పంచాయతీరాజ్ సంస్థలకు పూర్తి స్థాయిలో బదలాయించటానికి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా ఈ విధమయిన

బదలాయింపును 11వ షెడ్యూలులో సూచించిన మిగిలిన అంశాలలో కూడా చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.


## మరిన్ని అధికారాల బదలాయింపు

పంచాయతీరాజ్ సంస్థలకు మరిన్ని అధికారాల బదలాయింపు అనే అంశం పూర్తిగా రాష్ట్రప్రభుత్వ జాబితాలోనిది. రాజ్యాంగం నిర్వచించిన రీతిలో స్థానిక ప్రభుత్వాలుగా పనిచేయాలంటే రాష్ట్రస్థాయిలో స్థిరమైన రాజకీయ సంకల్పం తప్పనిసరి.ఇటీవల పంచాయతీరాజ్ శాఖామాత్యులు శ్రీ బొత్సా సత్యనారాయణ సంబంధిత శాఖామాత్యులు, కార్యదర్శులతో సమావేశం జరిపారు. పంచాయతీరాజ్ సంస్థలకు మరిన్ని అధికారాలు బదలాయించే విషయాలపై ఉన్నత స్థాయి చర్చ దీనితో ప్రారంభం అయింది.

## పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యాలు

జిల్లా ప్రణాళికా కమిటీ చట్టం (చట్టం 40/ 2005) ను రాష్ట్ర ప్రభుత్వం 2003 నుండి వెనుక తేదీ నుండి అమలులోకి తెచ్చింది. అన్ని జిల్లాల్లో జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పాటు అయ్యాయి. ఈ చట్టాన్ని అనుసరించి స్థానికసంస్థలకు అభివృద్ధి ప్రణాళికల తయారీ బాధ్యతలు కట్ట పెట్టినా ఈ కమిటీ వెంటనే గ్రామపంచాయతీ, మండలపరిషత్తు మరియు జిల్లా పరిషత్తులచే అభివృద్ధి ప్రణాళికలు తయారుచేయించగల పరిస్థితులు లేవు. వివిధ రంగాలలో జిల్లా సాధించిన ప్రగతిని సమీక్షించుకొని జిల్లా యొక్క అనుకూలతలు, బలహీనతలు, అభివృద్ధికి గల వివిధ అవకాశాలను బేరిజు వేసుకొని సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయటానికి అవసరమైన ప్రణాళికా నిపుణులను డి.పి.సి.కి అందుబాటులో ఉంచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అందువల్ల ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యత కల్గిన అంశంగా పరిగణిస్తూ పంచాయతీరాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా పనిచేస్తూ ఆయా ప్రాంతాల అభివృద్ధి కొరకు ప్రణాళికలు తయారుచేయటం, అమలు పరచటం, పర్యవేక్షించటం, అమలు చేసిన పథకాలను మదింపు చేసుకొనటం వంటి పనులను చేపట్టటానికి అవసరమైన శిక్షణను ఈ సంస్థలకు ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులకు, ఈ సంస్థలతో పనిచేస్తున్నటువంటి అధికారులకు తప్పని సరిగా అందచేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలకు సుమారు 2.61 లక్షలమంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కన మనరాష్ట్రంలో ప్రతీ 213 మంది జనాభాకు సగటున ఒక ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధి అందుబాటులో ఉన్నట్లుగా అర్థం చేసుకొనవచ్చు. ఇంత మందికి పరిపాలనా పరమైన విషయాలలో, ప్రణాళికా తయారీలో శిక్షణ అందించటమన్నది ఒక బృహత్తర కార్యక్రమం. శిక్షణను ఒక నిరంతరం ప్రక్రియలాగా పూర్తి స్థాయిలో చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.




## పథకాల మార్గదర్శకాలు

గ్రామీణ ప్రాంతాలలో అమలయ్యే పథకాలలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలే అగ్రభాగాన నిలుస్తాయి. ప్రపంచబ్యాంకు, కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాలు స్వంత వనరులతో చేపట్టే పథకాలలోని మార్గనిర్దేశక నియమాలు ఎక్కువ శాతం స్థానిక సంస్థల ప్రమేయం లేకుండా అమలు చేయటానికి మొగ్గు చూపుతూ స్వతంత్ర ఏజన్సీల ద్వారా పథకాలను అమలు చేయటానికి ప్రాధాన్యత నిస్తున్నాయి.

ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం 11వ పంచవర్ష ప్రణాళికా కాలం ( 2007 -2012) లో త్రాగునీరు పారిశుద్ధ్యం, విద్య గ్రామీణ విద్యుదీకరణ, ఆరోగ్యం వంటి రంగాలలో కనీస మౌలిక వసతుల కల్పనకు పెద్దపీటవేసి ఆయా రంగాలలో ప్రస్తుతం ప్రజలకు అందుతున్న సేవలను మరింత చేరువలోనికి తీసుకొని రావటానికి విద్యారంగంలో రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షాఅభియాన్), వైద్యరంగంలో జాతీయ గ్రామీణ  ఆరోగ్యమిషన్, పారిశుద్ధ్యం కొరకు సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం, త్రాగునీటి రంగంలో జాతీయ త్రాగునీటి మరియు పారిశుద్ధ్యమిషన్, ఉపాధి రంగంలో జాతీయ ఉపాధి హామీ పథకం, పోషకాహార లోప నివారణకోసం మధ్యాహ్న భోజన పథకం, బాలికల మరియు స్త్రీల అభివృద్ధిని ఉద్దేశించి ఐ.సి.డి.ఎస్ వంటి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోంది. వీటిలో ఉపాధిహామీ పథకం తప్ప మిగిలిన అన్ని పథకాలను వివిధ సంస్థలు లేదా భాగస్వామ్య కమిటీల ద్వారా అమలు చేయటానికి నిబంధనలు తయారు చేయబడ్డాయి. అయితే గ్రామీణ ప్రజానీకానికి ఈ పథకాల నుండి సేవలను సంతృప్తికర స్థాయిలో అందించాలంటే, స్థానిక సంస్థలకు ఈ పథకాల, అమలు, పర్యవేక్షణ మరియు మదింపు ప్రక్రియలో పూర్తిస్థాయి భాగస్వామ్యం కల్పించాల్సిఉన్నది.

## సమాంతర వ్యవస్థలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక పథకాల క్రింద ఏర్పాటు చేసిన వివిధ భాగస్వామ్య కమిటీలు పంచాయతీరాజ్ సంస్థలకు సమాంతర వ్యవస్థలుగా పనిచేస్తూ పంచాయతీరాజ్ సంస్థలకు జవాబుదారీతనంగా వ్యవహరించటంలేదనేది ఇటీవల కాలంలోని చర్చనీయాంశం. ఇటువంటి భాగస్వామ్య కమిటీలలో పాఠశాల విద్యాకమిటీలు, తల్లుల కమిటీలు, సాగునీటి సంఘాలు వంటివి ప్రత్యేక చట్టాల ద్వారా ఏర్పాటవగా, మహిళా స్వయంసహాయక సంఘాలతో ఏర్పడిన గ్రామైక్య సంఘాలు, మండల మహిళా సమాఖ్యలు, జిల్లా మహిళా సమాఖ్యలు, రైతు మిత్ర సంఘాలు, రాజీవ్ యువశక్తి సంఘాలు, వి.టి.డి.ఎ, వన సంరక్షణ సమితులు, గ్రామ ఆరోగ్య సంఘాలు, గ్రామనీరు, పారిశుద్ధ్య కమిటీలు వంటింవి ఆయా పథకాల మార్గదర్శకాలననుసరించి ఏర్పడినాయి. ఈ స్వయంసహాయక సంఘాలు నిర్వహించే అభివృద్ధి నిధులు పంచాయతీరాజ్ సంస్థలు నిర్వహించే నిధులకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ ఉండటంతో పరస్పర సంఘర్షణాత్మక ధోరణితో, సమన్వయ రహితంగా క్షేత్రస్థాయిలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన పనిచేయటం జరుగుతోంది. ఏది ఏమైనప్పటికీ, పంచాయతీరాజ్ సంస్థలకు అతీతంగా ఈ కమిటీల ఏర్పాటు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమనే వాదనను పక్కకు ఉంచి ఈ రెండింటి మధ్యా పరస్పర సంబంధ

| రాష్ట్ర బడ్జెట్టులో పంచాయతీరాజ్ సంస్థలకు నిధుల కేటాయింపు | | | |
|---|---|---|---|
| సంవత్సరం | రాష్ట్ర ఆదాయం (పన్ను మరియు పన్నేతరం) రూ.కోట్లలో | పంచాయతీరాజ్ సంస్థలకు విడుదల చేసిన నిధులు రూ.కోట్లలో | రాష్ట్ర ఆదాయంలో పంచాయతీ రాజ్ సంస్థల వాటా రూ.కోట్లలో |
| 1997-98 | 8901 | 2123.65 | 23.9 |
| 1998-99 | 9808 | 2412.29 | 24.6 |
| 1999-00 | 11450 | 2681.77 | 23.4 |
| 2000-01 | 13294 | 3563.16 | 26.8 |
| 2001-02 | 14469 | 2316.84 | 16.0 |
| 2002-03 | 16145 | 2456.94 | 15.2 |
| 2003-04 | 17411 | 2760.18 | 15.9 |
| 2004-05 | 20011 | 2506.16 | 12.5 |

**ఆధారం :** 3వ రాష్ట్ర ఆర్థిక సంఘ నివేదిక

బాంధవ్యాలు నెలకొనేటట్లు, రాజ్యాంగ బద్ధ సంస్థలకు జవాబుదారీ తనంగా ఈ సమాంతర వ్యవస్థలు రూపుదిద్దుకొనేలాగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

## వివిధ శాఖల మధ్య సమన్వయం

గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు మరియు జిల్లా పరిషత్తులు తమ పరిధిలో అభివృద్ధి ప్రణాళికలు తయారుచేయాలంటే వివిధ అభివృద్ధి శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరించి, సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకొన్నప్పుడే ఆయా ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. పూర్వం పంచాయతీ సమితుల నియంత్రణలో ఒకే గొడుగు క్రింద విద్య, వైద్యం, వ్యవసాయం, పశువైద్యం, మహిళా శిశు సంక్షేమం, ఇంజనీరింగు, ఫిషరీస్‌శాఖల వంటి దాదాపు 12 అభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమితి స్థాయిలో అభివృద్ధికి బాధ్యత వహించేవారు అయితే, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో గ్రామ, మండల స్థాయిల్లో వివిధ శాఖలు స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేస్తుండటంతో ఈ శాఖాధికారుల మధ్య సమన్వయాన్ని నెలకొల్పనిదే ఆశించిన రీతిలో అభివృద్ధిని సాధించటం కష్టతరమవుతుంది. ఈ పరిస్థితులను చక్క దిద్దేందుకు మరల గతంలో వలే వివిధ శాఖలను పంచాయతీరాజ్ సంస్థలకు జవాబుదారీగా ఉండేటట్లు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

## నిధుల లభ్యత

పంచాయతీరాజ్ సంస్థలద్వారా సూక్ష్మ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీకి ప్రజా భాగస్వామ్య పద్ధతిలో స్థానిక అవసరాల గుర్తింపు ఒక ఎత్తయితే, ఈ అవసరాలను తీర్చటానికి నిధుల సమీకరణ అనేది మరింత కీలకమయినది. అయితే మన రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలకు స్వంత ఆదాయ వనరులు బహుస్వల్పం కాగా, ఈ సంస్థలన్నీ ప్రభుత్వ కేటాయింపులపైననే ఎక్కువగా ఆధారపడుతున్నాయి.

రాష్ట్ర ఆడిట్ శాఖ వారి వద్దనున్న సమాచారం ప్రకారం పంచాయితీరాజ్ సంస్థలకు రాష్ట్రప్రభుత్వ ఆదాయంలో కేటాయింపులు 1997- 98 సం.లో 23.9 శాతం ఉండగా, 2004-05లో 12.5 శాతం మాత్రమే ఉన్నాయి. అంటే ఈ కేటాయింపులు కూడా రాను రానూ తగ్గుతున్నాయన్న విషయం క్రింద పట్టిక పరిశీలిస్తే అర్థం అవుతుంది.

గ్రామ పంచాయితీల పరిధి చిన్నది కావటం, ఎక్కువ సంఖ్యలో గ్రామ పంచాయతీలు ఉండటం, గ్రామ పంచాయతీలకు మినహా మండల మరియు జిల్లా పరిషత్తులకు పన్నులు వేసే అధికారం లేకపోవటం వంటి కారణాల వల్ల కూడా పంచాయతీ రాజ్ సంస్థలు నిధుల కోసం ప్రభుత్వ గ్రాంట్ల పై ఆధార పడాల్సివస్తుంది. పైగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 ద్వారా దఖలు పరచబడిన అధికారాలను అనుసరించి గ్రామపంచాయతీలు చట్ట ప్రకారం వసూలు చేయవల్సిన పన్నులను కూడా సంతృప్తికర రీతిలో వసూలు చేయలేకపోవటం నిధుల లేమికి మరొక్క కారణం.

ప్రాధాన్యీకరించిన స్థానిక అవసరాల ప్రాతిపదికన ప్రణాళికల తయారీ కోసం అవసరమైన నిధులను స్థానిక సంస్థలకు సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్టులో శాఖల వారీగా పంచాయతీరాజ్ విండోను ప్రత్యక్షంగా ఏర్పాటు చేసినట్లయితే నిధుల సమీకరణలోని లోటును భర్తీ చేయవచ్చును. ఈ విధానం ఇప్పటికే కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు అమలు పరిచి పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా అభివృద్ధి ప్రణాళికలు అమలు పరిచి మెరుగైన సౌకర్యాలు కల్పించటంలో స్థానిక సంస్థలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకొనివెళ్ళాయి.


గత 50 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ లోని పంచాయతీరాజ్ సంస్థలు గణనీయమైన ప్రగతిని సాధించినప్పటికీ, ప్రజల జీవన ప్రమాణాలలో మార్పుతీసుకొని రావాలంటే రాజ్యాంగంలో నిర్వచించిన 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం బదలాయించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. 73వ మరియు 74వ రాజ్యాంగ సవరణలలో నిర్వచించిన ప్రకారం, పంచాయతీ రాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా రూపాంతరం చెందాలంటే రాష్ట్రప్రభుత్వం షెడ్యూలు 11నందు పొందు పరిచిన 29 అంశాలకు చెందిన నిధులు, విధులు మరియు సిబ్బందిని పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించాలి. ఐతే ఈ బదలాయింపు జరిపేటప్పుడు ప్రతీ శాఖకు సంబంధించిన విధులను / నిధులను / సిబ్బందిని ఏ స్థాయిలోని సంస్థకు ఎంత మేరకు బదలాయించాలి అనేది సవివరంగా గుర్తించి తదనుగుణంగా నిధులు, విధులు మరియు సిబ్బందిని బదలాయించినప్పుడు మాత్రమే తమ ప్రాంతాల అభివృద్ధికి తామే ప్రణాళికలు తయారు చేసుకొనే స్థాయికి ఈ సంస్థలు రూపాంతరం చెందగలుగుతాయి.

*– డా. శివశంకర ప్రసాద్,*
జూనియర్ ఫ్యాకల్టీ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ,
హైదరాబాద్

# 'ముక్కోటాంధ్రుల మొక్కులు చెల్లగ' అవతరించిన ఆంధ్రప్రదేశ్

భారతదేశంలో భాషా రాష్ట్రాల నిర్మాణం ఒక చారిత్రక పరిణామం. పశ్చిమ చాళుక్యుల పతనానంతరం ఏర్పడిన కాకతీయ, యాదవ, హోయసల రాజ్యాలు తెలుగు మహారాష్ట్ర, కన్నడ భాషల సరిహద్దులను సూచిస్తాయి. 1538 ప్రాంతంలో బహమనీ సల్తాన్ల (రాజ్యం) విచ్ఛిన్నంతో ఏర్పడిన నిజాంషాహీ (మహారాష్ట్ర) ఆదిల్‌షాహీ (కర్ణాటక) కుతుబ్‌షాహీ (తెలుగు) రాజ్యాలే ఆ తరువాత భాషా రాష్ట్ర విభజనకు దారి తీసాయి.

ఈస్టిండియా కంపెనీవారు భారతదేశాన్ని ఆక్రమించుకుంటున్న సమయంలో ఎక్కడ దొరికిన ప్రాంతాన్ని అక్కడ దగ్గరగా ఉన్న కోట పరిపాలనలో చేర్చారు. బెంగాల్, బీహార్, అస్సాం, ఒరిస్సాలను కలిపి ఒక రాష్ట్రంగా చేసి దాని పరిపాలనను కలకత్తా నుంచి జరిపించారు. మహారాష్ట్ర, గుజరాత్, సింధ్ రాష్ట్రాల పరిపాలను బొంబాయినుంచి కొనసాగించారు. కొంత తెలుగుదేశం, మరికొంత తమిళదేశం, స్వల్పంగా కర్నాటక, సూక్ష్మంగా కేరళ కలిపి మద్రాసు ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశారు. బ్రిటిష్ వారి ఆక్రమణ, విస్తరణ చరిత్రే ఆనాటి రాష్ట్రాల చరిత్ర. నిజాం రాష్ట్రంలో ఎనిమిది తెలుగు జిల్లాలు, ఐదు మరట్వాడా జిల్లాలు, మూడు కర్నాటక జిల్లాలు ఉండేవి. సంస్థానాన్ని చిన్నదిగా చేసే కుట్రతో, బలహీనపరచాలనే ఉద్దేశంతో బ్రిటిష్ వారు రెండవ నిజాం నుంచి ఉత్తర సర్కార్లు, గుంటూరు, సీడెడ్ జిల్లాలను స్వాధీన పరచుకున్నారు. బెంగాల్ రాష్ట్ర ప్రజల ఐక్యతను విచ్ఛిన్నపరచడానికి 1905లో వైస్రాయ్ లార్డ్ కర్జన్ వంగ దేశాన్ని విభజించాడు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం జరిగింది. కర్జన్ తర్వాత వైస్రాయ్‌గా వచ్చిన హార్డింగ్ లండన్‌లోని బ్రిటిష్ ప్రభుత్వానికి 1911లో రాష్ట్రాలు ఎలా ఉండాలనే విషయంలో ఒక నివేదిక సమర్పించాడు. అందులో మూడంశాలు పేర్కొన్నాడు.1. రాష్ట్రం పరిపాలనాసౌలభ్యం కలిగి ఉండాలి. 2. ఆర్థిక సౌష్టవం కలిగి, స్వయం పోషకంగా ఉండాలి. 3. ఈ రెండు అంశాలు ఉన్నప్పుడు ఒకే భాష, ఒక సంస్కృతి కలిగిన ప్రజలందరినీ ఒకే రాష్ట్రంలో ఉండే విధంగా ఏర్పాట్లు చేయవచ్చు. ఈ నివేదిక ప్రకారం వంగ రాష్ట్ర విభజన రద్దయింది. భారతదేశంలో బ్రిటిష్ పాలన ఏర్పడిన తరువాత జాతీయోద్యమానికి కలిగిన ప్రథమ విజయం మీద ఆనాడే విశాలాంధ్ర వచ్చేదేమో! కానీ, తెలంగాణా ఒక సంస్థానంలోని అంతర్భాగం. సంస్థానాలను రద్దుపరచక ముందే వాటిని విడగొట్టడం రాజ్యాంగపరంగా సాధ్యమయ్యే పనికాదు. విశాలాంధ్రకు అవరోధకంగా నిలిచాడు నిజాం ప్రభువు.



1935లో సైమన్ కమీషన్ ఎదుట వాదించి ఒరియా వారు ప్రత్యేక ఒరిస్సా రాష్ట్రాన్ని, సింధీలు ప్రత్యేక సింధు రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దేశభక్త చర్యగా ఆంధ్రులు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని సైమన్ కమీషన్ ఎదుట పట్టుబట్టలేదు. తమకు అన్ని హంగులున్నాయని, ప్రజాపోరాటాలతోనే దాన్ని సాధించుకుంటామని నిశ్చయించుకున్నారు. 1913లో ఆవిర్భవించిన ఆంధ్ర మహా సభ రాష్ట్రావతరణకు ఏటేటా సమావేశాలు జరుపుతూ ఆంధ్రులను స్వరాష్ట్రోన్ముఖుల్ని చేసింది. ఆంధ్ర, రాయలసీమ అనే భేదభావం లేకుండా అంతా కలిసి రాష్ట్ర సాధనకు కృషి చేశారు.

## పట్టాభి ప్రయత్నం

ఆంధ్ర మహాసభ ఎంత ఆందోళన చేసినా కాంగ్రెస్ కార్యక్రమంలో భాషా రాష్ట్ర వాదాన్ని అంగీకరిస్తేనే రాష్ట్రావతరణ సాధ్యం అవుతుంది. భాషా రాష్ట్రాల వాదాన్ని కాంగ్రెస్ ఆదిలోనే సమ్మతించింది. ఆ రోజుల్లో కాంగ్రెస్ రాజకీయాలలో తమిళుల ప్రభావం ఎక్కువ. కేంద్ర నాయకుల ధాటిని తట్టుకోవడానికి ఒక ఆంధ్రా నాయకుడు ముందుకు రావలసి వచ్చింది. ఆ పని డా॥ పట్టాభి చేశారు. 1918లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ మహాసభలో నిర్విరామంగా వాదించి డా॥ పట్టాభి ఆంధ్రరాష్ట్ర కమిటీ వేయించారు. రాష్ట్ర సాధనలో అది తొలి విజయం.

సైమన్ కమీషన్ ఎదుట వాదించి ఒరియా వారు ప్రత్యేక ఒరిస్సా

**ఆంధ్రప్రదేశ్ అవతరణ - పూర్వాపరాలు**

రాష్ట్రాన్ని ఏర్పరచు కున్నప్పుడు వొడిసెల్ కమీషన్ సిఫారసు మీద విశాఖ జిల్లాకు చెందిన ఛత్రపురం, పర్లాకిమిడి తాలూకాలు, పర్లాకిమిడి ఏజెన్సీ కూడా ఒరిస్సాలో చేరాయి. కడప జిల్లాలోని కొన్ని భాగాలు, నార్త్ ఆర్కాటు జిల్లాలోని తెలుగు తాలూకాలను చాలామట్టుకు చేర్చి మద్రాసు ప్రభుత్వం 1911లో చిత్తూరు జిల్లా ఏర్పరచింది. సేలం జిల్లాలో తెలుగు వారెక్కువగా ఉండే హోసూరు, కృష్ణగిరి, నార్త్ ఆర్కాట్ జిల్లాలోని వాలాజా, ఆర్కోణం, గుడియట్టం మొదలైన తెలుగు ప్రాంతాలను చిత్తూరు జిల్లాలో చేర్చలేదు. ఈ విధంగా ఆలస్యం తెలుగువారికి విషమైంది. మద్రాసు నగర సమస్య ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది. మద్రాసు నగరాన్ని నిర్మించి పోషించడంలో ఆంధ్రుల పాత్ర ఏమీ తక్కువకాదు.

1940 ఫిబ్రవరి 28వ తేదీన ఆంధ్ర మహాసభ పూర్వాధ్యక్షులు వెంకటాచలం చెట్టి రాజాజీకి రాసిన లేఖలో యీ విధంగా ఉంది - 'చెన్న పట్టణం నిర్మాణం జరిగి 350 సంవత్సరాలైంది. అంతకు పూర్వం ప్రధానంగా ఉండే పట్టణం శాంథోమ్. అందులో తమిళుల సంఖ్యే అధికంగా ఉంది. ఫోర్టు సెయింట్ జార్జికి ఉత్తర భాగంలో అంతా తెలుగువారే ఉండేవారు. చెన్నకేశవ పెరుమాల్ దేవాలయం కూడా అప్పుడు కంపెనీ వారి కోట సరిహద్దులలో ఉండేది. వ్యాపార పరిశ్రమలలో అఖండమైన పేరు ప్రఖ్యాతి తెచ్చుకున్న వారంతా తెలుగువారే. ఆ రోజులలో గృహ పరిశ్రమలు విశేషంగా వర్ధిల్లినవి. దేవాంగులు, కంసాలులు, కుమ్మరులు మొదలైన పరిశ్రమలలో పనిచేసే వారంతా తెలుగువారే. ఇంక వైశ్యులు, నాయుళ్ళు, బలిజలు మొదలైన చిన్న చిన్న వర్తకులు తెలుగు వారే. జార్జి టౌను యావత్తూ తెలుగు పట్టణమే. కృష్ణప్పనాయుని అగ్రహారం, చింతాద్రిపేట, ముత్యాలపేట, మంగపతినాయుడు వీధి, రత్నాలవీధి, కుమ్మరపేట, అవధానం పాపయ్య వీధి, షరాజు అంగళ్లు మొదలైనవన్నీ తెలుగు పేర్లు. ఇవి తెలుగువారి నివాస స్థానాలనటానికి ప్రబల నిదర్శనాలు. దక్షిణ దేశానికి రైలు పడేంతవరకు చెన్నపురి తెలుగు పట్నంగానే ఉంటూ వచ్చింది. తమిళులు ఉద్యోగాల కోసం వచ్చి చెన్నపట్నంలో స్థానాలేర్పరచుకొని చాలా భాగాలు ఆక్రమించుకున్నారు. మద్రాసు నగరం ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కావాలనే ప్రకాశం పంతులు వాదన యీ విధంగా సరి అయినదే. కొంతకాలం వరకు అప్పటి మద్రాసు రాష్ట్ర రాజకీయాలలో మద్రాసు నగరం సమస్య ఆరని కుంపటిగా తయారై ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది.

ఢిల్లీలో 1946లో జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. తక్షణ సమస్యలెన్నో ఉన్నాయి కనుక భాషా రాష్ట్ర వాదాన్ని కొంతకాలం వాయిదా వేయమన్నది కేంద్రప్రభుత్వం.

డా॥ పట్టాభి బుద్ధి అక్షయ తూణీరం వంటిది. ఒక్క ఆంధ్రరాష్ట్రం అనుకుంటూ కూర్చుంటే లాభం లేదని, దీన్ని జాతీయ సమస్య చేయాలని అనుకున్నారు. దేశంలోని భాషా రాష్ట్రవాదులందరినీ ఏకం చేసి అఖిల భారత భాషా రాష్ట్ర ప్రతినిధుల సభ ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు ప్రాంతీయ సంఘాలు పెట్టించారు. రాజ్యాంగ నిర్ణయ సభ రేపు జరుగుతుందనగా 1946 డిసెంబరు 8వ తేదీన ఈ సమావేశం జరిపించి భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణం అవసరమనిపించారు. ఈ విధంగా ఆంధ్రరాష్ట్ర ప్రయత్నం జాతీయమైనది. ఆ ప్రయత్నమే భాషా రాష్ట్ర నిర్మాణ సిద్ధాంత ఆచార్యుడుగా డాక్టర్ పట్టాభిని రాజ్యాంగ సభలో నిలబెట్టింది. అధిష్ఠాన వర్గానికి ఆయన హోరు ఈ విధంగా ఎక్కువైంది. 1948లో రాజ్యాంగ రచనా సంఘం సిఫారసు మీద కేంద్ర ప్రభుత్వం అనేక క్లిష్టసమస్యలను ఎదుర్కొంటున్న అప్పటి పరిస్థితులలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వాంఛనీయం కాదని థార్ కమీషన్ స్పష్టీకరించింది.

థార్ కమీషన్ రిపోర్టు వచ్చినప్పుడు డా॥ పట్టాభి కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. కాంగ్రెస్ ఆశయానికి విరుద్ధంగా ఇచ్చిన థార్ కమీషన్ రిపోర్టును కాంగ్రెస్ అధ్యక్ష వేదికమీద చీల్చి చెండాడారు డా॥ పట్టాభి. కాంగ్రెస్ పక్షాన జె.వి.పి. (జవహర్‌లాల్, వల్లభాయ్, పట్టాభి) కమీషన్ నియమించారు. జె.వి.పి. కమిటీ ఆంధ్రరాష్ట్ర అవసరాన్ని ఉగ్గడించింది. కానీ, ఆంధ్రులు మద్రాసు నగరాన్ని వదులుకోవాలని సూచించింది. ఇది ఆంధ్రకేసరికి సమ్మతం గాలేదు. ఈ వివాదాల మధ్య ఆంధ్రరాష్ట్ర నిర్మాణం మరి కొంతకాలం వెనుకబడిపోయింది. 1951 ఏప్రిల్ 15 నుండి 30 రోజులు ఆంధ్రరాష్ట్ర సాధన కోసం నిరాహారదీక్ష బూనారు స్వామీ సీతారాం. ఆచార్య వినోభాభావే కలుగజేసుకొని స్వామీజీ చేత దీక్ష విరమింపజేశారు. 1952లో ఆంధ్రాలో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైంది. ఈ అనిశ్చిత వాతావరణంలో ఆంధ్ర రాష్ట్ర సమస్య మళ్ళీ వెనక్కు పోయింది.

### 'శ్రీరాములు' దయచేతను

నాయకుల మధ్య స్పర్థను, ఆలస్యాన్ని సహించలేకపోయారు సేవాగ్రాంలో గాంధీజీ ఆశ్రమంలో శిక్షణ పొంది వచ్చిన పొట్టి శ్రీరాములు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణంలో ఆలస్యం జరిగిన కొద్దీ దాని పరిణామాలు తీవ్రమవుతాయని ఆయన ప్రధాని నెహ్రూకు, చెన్నై రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికలను ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి రాజాజీ ఇది ఏదో తమకు సంబంధించిన విషయం కాదనుకున్నారు. ఎవరిలో చలనం కలగలేదు. దీనికి నిరసగా కఠోరంగా సాగిపోతూనే ఉన్నది పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దీక్ష. 59వ రోజు వచ్చే ముందు ఆ మహాత్యాగి అమరుడైనాడు.

శ్రీరాములు ఆత్మార్పణంతో ఆంధ్ర ప్రపంచం భగ్గుమంది. ఆ బాల వృద్ధం అట్టుడికినట్లు ఉడికిపోయింది. యావదాంధ్ర బహిరంగసభలు, హర్తాళ్ళు, ఊరేగింపులు జరిగాయి. ఆంధ్రదేశానికి సంబంధించినంత వరకు ప్రపంచం స్తంభించి పోయింది. 1952 డిసెంబర్ 19న ప్రధాని నెహ్రూ పార్లమెంటు ఉభయ సభలలో అమరజీవి శ్రీరాములు నిర్యాణ వార్త గురించి మాట్లాడారు. 1953 అక్టోబరు ఒకటవ తేదికి నిర్వివాద ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందని ప్రకటించారు. ప్రత్యేక రాష్ట్ర

విషయాన్ని పరిశీలించడానికి రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వంఛూను విచారణ కర్తగా నియమించారు. మద్రాసును తాత్కాలిక రాజధానిగా చేసుకోడానికి సాధ్యం కానప్పుడు విశాఖపట్టణం-వాల్తేరులలో తాత్కాలిక రాజధాని ఏర్పాటు చేసుకుని గుంటూరు, కృష్ణానది దక్షిణతీరం మధ్య శాశ్వత రాజధాని నిర్మించుకోవాలని జస్టిస్ వంఛూ అభిప్రాయపడ్డారు. 1953 జూన్ 5న శాసనసభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమ వారు రాజధాని తమ ప్రాంతంలోనే ఉండాలన్నారు. పరిశీలన కొచ్చిన నగరాలలో చివరకు అనంతపురం, కర్నూలు, తిరుపతి మిగిలిపోయాయి. ఆ మూడు నగరాలలో కురువృద్ధుడు ప్రకాశం గారికి ఏది నచ్చితే దాన్ని రాజధాని నగరంగా చేసుకుంటామన్నారు. కర్నూలు హైదరాబాద్‌కి అతి సమీపంలో ఉన్నది. అందుకే ఆంధ్రకేసరి మనస్సు కర్నూలు మీదికి పోయింది. నూతన రాష్ట్రానికి కర్నూలు తాత్కాలిక రాజధాని అయింది. హైకోర్టు గుంటూరులో పెట్టారు. 1953 అక్టోబరు 1వ తేదీన నూతన ఆంధ్ర రాష్ట్రానికి ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం జరిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి అయ్యారు.

### ఆంధ్రప్రదేశ్ అవతరణ

ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే వివిధ భాషలు మాట్లాడే ప్రజలున్న అవాస్తవిక రాష్ట్రాలను పునర్నిర్మాణం చేసి, భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచాలనే ప్రజా ఆందోళనలు దేశమంతటా ఉవ్వెత్తున లేచాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలని ఏర్పరచడానికి 1954లో ఫజల్ ఆలీ అధ్యక్షతన ఒక కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమీషన్ హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించడం అనివార్యం అని చెప్పింది.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడటానికి ముందే 1953 నవంబరు 13వ తేదీన అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షతన విశాలాంధ్ర మహాసభ హైదరాబాద్‌లో ఏర్పడింది. మీర్ అహమద్ అలీఖాన్, కడప కోటిరెడ్డి ఉపాధ్యక్షులు. సాగ పుల్లారెడ్డి, ఎస్.ఆర్. వెంకటేశం కార్యదర్శులు. అదే రోజు హైదరాబాద్ నగరంలోని సూర్యమహల్‌లో విశాలాంధ్ర ప్రథమ సమావేశం జరిగింది. దానిలో తెలంగాణా, ఆంధ్రాతో కలసి విశాలాంధ్ర ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. 1955 అక్టోబరు 27న హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ బూర్గుల రామకృష్ణారావు సత్వర ఆంధ్ర, తెలంగాణా విలీనానికి గల కారణాలను ప్రకటించారు. "దక్షిణ భారతావనికి సంబంధించినంత వరకు దాదాపు భాషా ప్రాతిపదికపైనే పునర్ని ర్మించే సూత్రాన్ని ఎస్.ఆర్.సి. (స్టేట్ రీ ఆర్గనైజేషన్ కమీషన్) అంగీక రించింది. విశాలాంధ్ర కొరకై బలీయం గా వాదించింది. ఇట్టి ఏర్పాటుకు ఏర్పడిన యిబ్బందులను గూర్చి కమీ షన్ అతిగా అంచనా వేసు కున్నదని నా వ్యక్తిగత అభిప్రాయం. తొమ్మిది జిల్లాలకు రాజధానిగా ఉండేకన్నా ఇరవై జిల్లాల పెద్ద రాష్ట్రానికి రాజధానిగా హైదరాబాద్ తగునని నేను భావిస్తున్నాను'.

బూర్గుల వారి ఎనిమిది మంది క్యాబినెట్ మంత్రులలో ఆరుగురు విశాలాంధ్ర వాదులు. ఇద్దరూ తెలంగాణా వాదులు. ఆదిలో కొంత ప్రతిఘటన ఎదురైనా విశాలాంధ్ర వాదమే బలపడుతూ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అందుకు అనుకూలంగా ఉండటంతో సమస్య సులభంగా పరిష్కారమైంది. ఆంధ్ర-తెలంగాణా నాయకులు ఢిల్లీలో ఒక పెద్ద మనుషుల ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంపై సంతకం చేసిన వారిలో తెలంగాణా నుంచి బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, డా॥ ఎం. చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావులు, ఆంధ్రా నుంచి నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, గౌతు లచ్చన్నలు ఉన్నారు. 1956 నవంబరు 1వ తేదీన అన్ని రాష్ట్రాలతో పాటు నూతనంగా హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. దీనికి ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం జరిపారు. ఇది ఆంధ్రుల ప్రజారాజ్యం. నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి అయ్యారు.

– జి. వెంకట రామారావు

## వరద బాధితులకు గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది ఆర్థిక సహాయం

ఇటీవల సంభవించిన వరద బాధితులకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిబ్బంది సంయుక్తంగా రూ. 5.40 లక్షల విలువైన వంట సామాగ్రి, బట్టలను పంపిణీ చేసింది.

అక్టోబర్ 2న మహబూబ్‌నగర్ జిల్లా పనగండ్ల మండలం గడ్డ బస్వాపూర్ గ్రామం, ఆలంపూర్ మండలం శేర్‌పల్లి గ్రామాలు వరద ప్రవాహంలో పూర్తిగా మునిగిపోయి తీవ్ర నష్టం కలిగింది.

ఇందుకోసం విరాళాలు అందచేసిన గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ వట్టి వసంత్‌కుమార్ 55వేలు, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ కె. రాజు 20వేలు, కమీషనర్, గ్రామీణాభివృద్ధిశాఖ శ్రీమతి శాంతికుమారి 15వేలు, సి.ఇ.ఒ. సెర్ప్ శ్రీ టి. విజయ్‌కుమార్ 10వేలు, అడిషనల్ సి.ఇ.ఒ., సెర్ప్ శ్రీ బి. రాజశేఖర్ 10వేలతో పాటుగా విజయనగరం ప్రాజక్టు డైరెక్టర్ (డ్వామా) కార్యాలయ సిబ్బంది ఒక లక్ష రూపాయలతో పాటుగా ఎంతోమంది గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందచేసిన వారిలో ఉన్నారు. ✧

## వార్తల్లో 'అపార్డ్'

## ఓపెన్‌సోర్స్ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్సులు

ఓపెన్‌సోర్స్ టెక్నాలజీలో రెండవ బ్యాచ్ సర్టిఫికెట్ కోర్సు అక్టోబర్ 5, 2009న 'అపార్డ్' లో మొదలైంది. ఇది డిసెంబర్ 11, 2009 వరకు కొనసాగుతుంది. దీంట్లో 30 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సులో భాగంగా Postage SQL Data base, (20 రోజులు), LINUS Spesativs Sysem (15 రోజులు), P.H.P. Web Programming (15 రోజులు), భాషలు నేర్పుతారు. నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్స్, ఎంటర్‌ప్రైజ్ డి.బి. వారి సహకారంతో అపార్డ్ ఈ కోర్సును నడుపుతోంది. ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలనుంచి వచ్చిన వారికి కోర్సు ఫీజ్ లేదు.

## సర్పంచ్‌లకు ఆదర్శ పంచాయితీల సందర్శన కార్యక్రమం

దోమలు, దొంగలు అసలే లేవు. గ్రామంలో అందరూ చదువుకున్న వారే. నూటికి తొంబై మంది దారిద్ర్య రేఖకు ఎగువ ఉన్నవారే. నీటి సమస్య మర్చిపోయారు. మద్య దుకాణాల ప్రసక్తే లేదు. 260 ఇళ్ళున్న ఈ ఊరు పేరు 'హివ్రే బజారు', మహారాష్ట్రలోని పూణె దగ్గర్లో ఉంది. ఇన్ని సుగుణాలు ఒకే గ్రామంలో ఉండడానికి కారణ భూతుడు శ్రీ పోపట్ రావ్ పవార్. విశ్వవిద్యాలయం నుండి ఎం.కాం పట్టా పుచ్చుకున్న తరువాత, ఉద్యోగాల వేటలో పడకుండా, తన గ్రామాభివృద్ధికై అంకితమయ్యారు శ్రీ పవార్. శాసన సభ్యుడైతే మొత్తం నియోజక వర్గం తిరగాలి, తన గ్రామంపై శ్రద్ధ వహించేందుకు సమయం దొరకదు అని శాసన సభ ఎన్నికల పోటీకి నిరాకరించారు. తన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్ది, గ్రామ సర్పంచ్ అంటే ఇలా ఉండాలి అనే కొలమానం తయారుచేసారు. జన్ (ప్రజలు), జల్ (నీళ్ళు), జంగల్ (అడవి), జాన్వర్ (జంతువులు) యీ నాలుగే ఆయన ఎజెండా. అటువంటి ఆదర్శ గ్రామం చూడ్డానికి వచ్చే వాళ్ళతో సంవత్సరం పొడుగునా ప్రతిరోజూ తిరునాళ్ళే. చూస్తేనే నమ్ముతారు, చూసింది చాలాకాలం జ్ఞాపకం ఉంటుంది అనే ఉద్దేశంతో మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలోని ఇటువంటి ఆదర్శ గ్రామాల




సందర్శన కోసం మన రాష్ట్రంలోని 26,000 సర్పంచ్‌లను దశల వారీగా పంపాలని అపార్డ్ ఒక పథకం రూపొందించింది. 23-10-2009 నాడు రంగారెడ్డి జిల్లా నుండి 40 మంది సర్పంచ్‌లను పంపడం జరిగింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ( ఎన్.ఐ.ఆర్.డి.), డైరెక్టర్ జనరల్ శ్రీ బి.కె. సిన్హా, ఐ.ఏ.యస్. యాత్ర ప్రారంభ సూచికగా జెండా ఊపారు. మెదక్ (25-10-2009), నిజామాబాద్ (27-10-2009), నల్గొండ ( 29-10-2009), మహబూబ్‌నగర్ (03-11-09) నుంచి సర్పంచులను పంపేందుకు కూడా ఏర్పాట్లు జరిగాయి.

## 'అపార్డ్'ను సందర్శించిన బి.ఎన్. యుగంధర్

రిటైర్డు సీనియర్ ఐ.ఏ.యస్. అధికారి శ్రీ బి.ఎన్.యుగంధర్ 22/10/2009న అపార్డ్‌ను సందర్శించారు. ఉదయం 11.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు గడిపారు. వీరి సందర్శనలో భాగంగా అపార్డులోని వివిధ అధ్యయన కేంద్రాలు చేసే పనిని ఒక్కొక్కరిని అడిగి వివరంగా తెలుసుకున్నారు. పంచాయితీ రాజ్ ప్రతినిధులకు ఉద్యోగులకు అపార్డు ఇచ్చే వివిధ శిక్షణా కార్యక్రమాల గురించి ఇప్పుడు స్వయంగా తెలుసుకున్న తరువాత చాలా సంతోషిస్తున్నానని అన్నారు. అపార్డు కేంద్ర కార్యాలయంలోను, ప్రాంతీయ శిక్షణా కేంద్రాలలోను అమలుపరుస్తున్న 'శిక్షణా వికేంద్రీకరణ' విధానం చాలా నచ్చిందని తెలిపారు. మైరాడా, ప్రధాన్ లాంటి స్వచ్ఛంద సంస్థలు ఈ మధ్య 'భాగస్వామ్య శిక్షణా విధానాన్ని' అమలు పరుస్తున్నాయని, వాటితో కలసి అపార్డ్ శిక్షణా కార్యక్రమాల స్థాయిని పెంచవచ్చని సలహా ఇచ్చారు. అపార్డు ప్రచురించే 'స్థానిక పాలన' మాస పత్రికను వివిధ విశ్వవిద్యాలయాలకు, స్థానిక గ్రంథాలయాలకు కూడా పంపాలని సలహా చెప్పారు. అలాగే వారం వారం ప్రసారం చేస్తున్న మన టి.వి. ప్రోగ్రాంను దూరదర్శన్ ద్వారా కూడా ప్రసారం చేసేందుకు ప్రయత్నం చేసి ఇంకా చాలా మందికి చేరేలా చూడాలని సూచించారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని అపార్డు ఫ్యాకల్టీగా చేర్చుకుని గ్రామీణాభివృద్ధికి సంబంధించిన విషయాలపై పరిశోధన, శిక్షణ చేపట్టాలని సలహా ఇచ్చారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న భూమి సర్వే విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని కోరారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి వారి సహాయంతో అపార్డ్‌లో గ్రామీణాభివృద్ధిపై నడుపుతున్న సర్టిఫికెట్ కోర్సును వచ్చే కాలంలో గ్రామీణాభివృద్ధిపై మాస్టర్సు డిగ్రీని కూడా ఇచ్చే స్థాయికి అపార్డు ఎదగాలని సలహా ఇచ్చారు.

అపార్డును 'ఇర్మా' వంటి జాతీయ స్థాయి పరిశోధనా, శిక్షణా సంస్థగా రూపొందించటంలో ఎప్పటికప్పుడు సలహాలు, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగాను, ప్రణాళికా సంఘం సభ్యులుగాను, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని ముఖ్య హోదాల్లో పనిచేసి గ్రామీణాభివృద్ధి వ్యవహారాల్లో పేరుగాంచిన శ్రీ యుగంధర్, అపార్డును సందర్శించి తగిన సలహాలు, ప్రోత్సాహం ఇచ్చినందుకు, వారికి అపార్డు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తోంది. ✧



# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## పెద్దల జోలికి పోరాదు

**విశ్వనాథ సత్యనారాయణగారు ప్రసిద్ధ సాహితీమూర్తి, అసమాన ప్రతిభా సంపన్నులు, అనుపమ ప్రజ్ఞా సమన్వితులు. అటువంటి తేజో మూర్తి వున్నచోట, ఎంతటి పదవీ ప్రాభవ సమున్నతుడైనా రెండవ స్థానంతోనో, మూడవ స్థానంతోనో సంతృప్తిపడవలసిందే కాని, ఆయనతో పోటీపడడం, ఆయనకంటే అధికుడనిపించుకోవాలని చూడడం, మంచిది కాదు.**

ఈ పరిస్థితిని అర్థం చేసుకుని, ఆయన ఆంధ్రశాఖాధ్యక్షునిగా పనిచేస్తున్న విజయవాడ ఎస్.ఆర్.ఆర్.సి.వి.ఆర్. కాలేజి ప్రిన్సిపాల్స్ ఆయన పెద్దరికాన్ని గౌరవించి, ఆయనతో తలపడకుండా తప్పుకుని తిరిగేవారు. అయితే, ఒకళ్ళిద్దరు ప్రిన్సిపాల్స్‌కి ఈ పద్ధతి సరిపడలేదు.

కాలేజీలో ప్రిన్సిపాల్ కంటే తెలుగు డిపార్ట్‌మెంట్ హెడ్‌కి ప్రాధాన్యత ఏమిటి? పైగా, ఆయనకి తిక్క కుదిరితేనే కాని పాఠం చెప్తాడట! లేకపోతే ఆయన క్లాసులో పాఠం చెప్పడట.

ఈ సంగతి తెలుసుకోవాలని ఓ ప్రిన్సిపాల్ తరచు విశ్వనాథవారు క్లాసు తీసుకున్నప్పుడు, వరండాలో వారగా పొంచి నుంచుని వినేవాడు. ఇలా ప్రిన్సిపాల్ తన మీద నిఘా వేస్తున్నాడని విశ్వనాథ వారికి తెలిసింది. ప్రిన్సిపాల్ చేస్తున్న అమర్యాదకరమైన పనికి కోపం వచ్చింది. ప్రిన్సిపాల్‌కి ఓ గుణపాఠం నేర్పాల నుకున్నారు విశ్వనాథ.

ఓ మారు విశ్వనాథ క్లాసులో పాఠం చెబుతూంటే, ప్రిన్సిపాల్ వరండాలో వారగా నిలబడ్డారు. విద్యార్థులకి ఆయన కనిపిస్తున్నాడు. విశ్వనాథ్‌కి కనిపించడంలేదు. మొదటి బెంచీలో కూర్చున్న విద్యార్థులు విశ్వనాథవారి పాఠం వినకుండా వరండాలో వున్న ప్రిన్సిపాల్ వైపు చూస్తున్నారు. దాంతో విషయం గ్రహించి విశ్వనాథగారు గట్టిగా అరిచారు – "ఏమిట్రా, నేనిటు పాఠం చెప్తూంటే అటు చూస్తారు? అటు ఏవైనా ఎద్దూ, దున్నపోతులూ వున్నాయేమిటి? ఇటు తిరగండి" అని.

ఓ కుర్రాడు లేచి "అది కాదండీ..." అంటూ చెప్పబోతే, అతణ్ణి వాక్యం పూర్తిచెయ్యనియ్యకుండా "సర్లే కూచో, అడ్డగాడిదా... దారినబోయే గాడిదల్ని చూడ్డమే నీ పని" అంటూ గదమాయించారు.

విశ్వనాథగారు విసురుతూన్న ఎద్దు, దున్నపోతు, గాడిద వగైరా బిరుదులు ఇంకా ఎన్ని వచ్చి తగులుతాయో దేవుడా అని అక్కడ నుంచి చల్లగా జారుకున్నాడు ప్రిన్సిపాల్.

ఆ తర్వాత ఆ ప్రిన్సిపాల్ విశ్వనాథ సత్యనారాయణగారి జోలికి వస్తే ఒట్టు!

☆

## విశ్వనాథ చేసిన విడో మేనేజ్

**విశ్వనాథ సత్యనారాయణగారింట్లో చతుర్ముఖ పారాయణం జరుగుతోంది. ఓ పక్క నుంచి పేకాడుతూనే విశ్వనాథవారు, చుట్టూ వున్న సాహితీమిత్రులతో శ్రీనాథుని సీసపద్యానికీ నన్నయ సీసపద్యానికీ గల భేద సారూప్యాల్ని వివరిస్తూ ఓ రకంగా సాహిత్య గోష్ఠి కావిస్తున్నారు.**

మరీ సాహిత్యం మోతాదు ఎక్కువై, పేకాట మీద పరాకు వచ్చినప్పుడు, ప్రక్కనే కూర్చున్న జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారు విశ్వనాథవారికి సాయం చేస్తున్నారు. చాపమీద వున్న పేకముక్కలు ఎత్తి ఇవ్వడంలోనూ, చేతిలోని ముక్కని క్రింద పడెయ్యడంలోనూను. పేకముక్కల్లో 'మదాం' ని 'రాణీ' అని 'విడో' అనీ అనడం కద్దు. చేతిలో రెండు 'మదాం'లు వున్నాయి. ఈ మదాం వెయ్యమని విశ్వనాథవారు అంటే, కాదు– ఆ మదం వేద్దాం అన్నారు రుక్మిణీనాథ శాస్త్రి. ఆ గుంజాటన చూసి పక్కనున్న ఆయన వేళాకోళంగా "ఈ రాణికి నాథుడాయన. ఆ రాణీకి నాథుడీయన– ఈ విశ్వనాథ, రుక్మిణీ నాథుల చేతుల్లోంచి ఏ రాణీ ఊడిపడేలా లేదు" అన్నాడు.

వెంటనే విశ్వనాథవారు "బాధపడకు – అనాథ నాథుడివి నువ్వున్నావుగా – కావలిస్తే ఈ విడోని కూడా ఇస్తాను" –అంటూ ఓ మదాంని పడేసారు. ఆ ముక్క కావలసి వుండీ కూడా, తీసుకుంటే ఎక్కడ అనాథ నాథుడి పేరు సార్థకం అవుతుందో అని, ఆయన ఆ ముక్క తీసుకోలేదు.

☆

## దారులు వేరయినా

**శిరద్దార్లతోనూ తహసీల్దార్లతోనూ తల నెప్పి ఒక చోటకాదు. చాలాచోట్ల వచ్చింది, అష్టావధాన నేత్రావధానాలు చెయ్యాలని బయలుదేరిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాది సత్యనారాయణశాస్త్రిగార్లకి.**

ఓ మారు ఖమ్మం వెళితే, అక్కడ తహసీల్దారుగారు ఈ శాస్త్రిగార్లకి ఓ పట్టాన దర్శనం ఇయ్యలేదు. ఇచ్చినా సరిగా మాట్లాడలేదు. మాట్లాడినా సభ ఏర్పాటు చెయ్యడానికి సహాయం చేస్తాననలేదు. అతి కష్టం మీద సభకి మాత్రం వస్తానని అంగీకరించారు.

"రానీ! అక్కడే ఇతని గర్వం వదలగొడదాం" అనుకొన్నారు శాస్త్రివర్యులిద్దరూ. అష్టావధాన ప్రక్రియలో ఒక భాగమైన అప్రస్తుత ప్రశంసలో, సంభాషణ అటు త్రిప్పి, ఇటు త్రిప్పి, చివరికి తహసీల్దార్లవైపు మళ్ళించారు సుబ్రహ్మణశాస్త్రిగారు.

మళ్ళించి, "ఈ కలికాలంలో తహసీల్దారు గొప్పవారు. అయితే మనకి యుగయుగాల నుండీ ముగ్గురు గొప్ప 'దారు' లున్నారు. ఒకాయన ముఖస్థదారు. భార్యని ముఖమునందు ధరించినవారు. బ్రహ్మ. రెండో ఆయన శిరస్థదారు. భార్య అయిన గంగని శిరస్సు మీద ధరించినవారు శివుడు. మూడో ఆయన ఉరస్థదారు. భార్య అయిన లక్ష్మిని గుండెల మీద కూర్చోబెట్టుకున్నవారు విష్ణుమూర్తి. ఈ ముగ్గురూ కాక, మరి ఈ కలికాలంలో క్రొత్తగా వచ్చిన 'తహసీల్దారు' అనేవారు. వీరు ఎటువంటి వారో! భార్యకి ఎటువంటి స్థానమిచ్చారో!! తహసీల్దార్ల తబిసీలు మనకి తెలియదు" అన్నారు.

అంతా చప్పట్లు కొట్టారు.

తహసీల్దారుగారు కూడా ముసి ముసి నవ్వులు నవ్వి శాస్త్రిగారి కి అర్థనూట పదహార్లు చదివించి "మీ చమత్కారం బాగుంది" అని మెచ్చుకున్నారు. శాస్త్రుర్లతో రాజీపడ్డారు.

☆




## పంటల బీమాలో మనదే రికార్డు

పంటల బీమా విషయంలో రాష్ట్రం రికార్డు సృష్టించింది. ఖరీఫ్ పంటల బీమా క్లెయిమ్‌కు సంబంధించిన 801 కోట్ల రూపాయల మొత్తానికి జాతీయ వ్యవసాయ బీమా సంస్థ ఆమోదం తెలిపింది. ఈమేరకు అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. దేశంలోనే ఇంత భారీగా ఒకే ఏడాదికి పంటల బీమా సొమ్ము రావడం ఇదే మొదటిసారి. గ్రామం యూనిట్‌గా పంటల బీమాను అమలు



చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే ముందుండడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది.

అన్ని జిల్లాల్లోనూ ఒక్కో ప్రధాన పంటకు గ్రామం యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేయడం వల్ల పంట నష్టాలను కచ్చితంగా లెక్కించగలిగారు. "గ్రామం యూనిట్‌గా బీమా అమలు చేయడం రైతులకు ఎంత మేలు కలిగిస్తుందనేది దీన్ని బట్టి అంచనా వేసుకోవచ్చు. అందుకే అన్ని జిల్లాల రైతులు కూడా బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మేం పదే పదే చెబుతున్నాం. ఎంత బీమా సొమ్మయినా సరే తన వాటా చెల్లించటానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. రాష్ట్రంలోని పంటల బీమా క్లెయిమ్ మొత్తంగా 801 కోట్ల రూపాయలకు ఆమోదం తెలుపుతూ వ్యవసాయ భీమా కంపెనీ లిమిటెడ్ లేఖ కూడా పంపింది'' అని వ్యవసాయ మంత్రి శ్రీ రఘువీరారెడ్డి చెప్పారు.

## పని తీరే ప్రాతిపదిక

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వ సిబ్బందికి, రైతులకు మధ్య సంధానకర్తలుగా ఉండేందుకు ప్రవేశపెట్టిన ఆదర్శ రైతుల వ్యవస్థ సక్రమంగా నడవడం లేదని గుర్తించిన వ్యవసాయ శాఖ దీనిపై ఇటీవలే క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తీసుకుంది. మూడేళ్ల క్రితం ప్రతి 250 మంది రైతులకు ఒక్కరు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 49,161 మంది ఆదర్శ రైతులను ప్రభుత్వం నియమించింది. అయితే వీరిలో 677 మంది స్వచ్ఛందంగా వైదొలిగారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిలో 6607 మంది పనితీరు అధ్వానంగా ఉందని గుర్తించి వారిని తొలగించనున్నారు.

## గ్రామీణ ఉపాథి హామీ పథకంలోసహాయకులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో కింది స్థాయి కూలీలను సమీకరించి, వారికి పని ఇప్పించడంతోపాటు సిబ్బందికి సహకరించడానికి సహాయకుల (మేట్)ను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సహాయకుల విధానం గతంనుంచే కొనసాగుతున్నా. . . దానికి సంబంధించిన ఆదేశాలన్నింటినీ రద్దుచేసింది. కూలీలతోపాటు పనిచేస్తూ వారిలో ఒకరిగా కలిసిపోయే సహాయకులను నియమించాలని నిర్ణయించింది. ఇంతకుముందు ఉన్న సహాయకులు కూలీలపై ఆజమాయిషీ చేయడం తప్ప వారితో కలిసి పనిచేసేవారు కాదు. ఈ విధానంలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడంతో, పాత సహాయకుల వ్యవస్థను రద్దుచేస్తూ ప్రభుత్వం ఇటీవలే అదేశాలు జారీచేసింది.

కొత్తగా పునర్నియమించే సహాయకుల కోసం నూతన మార్గదర్శకాలు రూపొందించింది. కొత్త నియమావళి ప్రకారం, కూలీల బృందంలో సభ్యులుగా ఉంటూ వారితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. గత ఏడాది కాలంలో కనీసం 40 రోజులు పనిచేసి ఉండాలి. పదోతరగతి ఉత్తీర్ణులై, చదవడం, రాయడం వచ్చిన వారు సహాయకులుగా పనిచేసేందుకు అర్హులు. వీరి నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యం

ఇవ్వాలి. గ్రామంలోని మొత్తం సహాయకుల్లో మూడోవంతు మహిళలు ఉండేలా చూడాలి. సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, గ్రామ కార్యదర్శి, సర్పంచి, ఉపసర్పంచి, శాఖ పోస్ట్ మాస్టర్లు, ఇతర అధికారుల బంధువులు, రైతుమిత్ర, 'ఆశా' వర్కర్లు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యా వాలంటీర్లు తదితరుల



సహాయకులుగా ఉండడానికి అనర్హులు. స్థానికులకే అవకాశం ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ కూలీల బృందాలకు, ఇతర వర్గాలకు చెందినవారు ఎట్టి పరిస్థితుల్లోనూ సహాయకులుగా ఉండకూడదు. పోస్టాఫీసులు, స్మార్ట్ కార్డుల ద్వారా కూలీలకు వేతనాలు ఇప్పించే బాధ్యత వీరిదే.

## జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు ఉపాధిహామీ నిధులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ ఆర్ ఈజీఎస్) కింద రాష్ట్రానికి వచ్చిన నిధుల్లో పనుల కమిటీల ద్వారా రూ.1,264 కోట్లు వెచ్చించబోతున్నారు. ఇందులో మండలానికి రూ.50 లక్షల చొప్పున రూ.564 కోట్లు విలువ కలిగిన పనుల మంజూరు బాధ్యతను మండల పరిషత్‌లకు అప్పగించారు. రూ. 700 కోట్లకు సంబంధించిన పనులను జిల్లా పరిషత్‌లు నిర్ణయిస్తాయి. ఈ మొత్తంలో రూ.500 కోట్లను ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోనే వెచ్చించాల్సి ఉండగా, మిగిలిన రూ.200 కోట్లను ఇంత వరకు ఎలాంటి రహదారి సౌకర్యంలేని గ్రామాల్లో వినియోగించాలన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. ఉపాధిహామీలో గుత్తేదార్ల ప్రవేశానికి అవకాశం లేదు. ఈ నేపథ్యంలోనే పనుల కమిటీలను ఏర్పాటు చేయాలన్న అభిప్రాయానికి వచ్చారు.సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ కమిటీలో సభ్యులు ఎవరు ఉండాలన్నది గ్రామ సభల్లో నిర్ణయిస్తారు. ఈ కమిటీ ద్వారానే పనులు చేయాల్సి ఉంటుంది.

## పల్లె విద్యకు పెద్దపీట

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. జాతీయ విద్యాకమిషన్ నిర్దేశించిన 15 శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అందుకోసం బడ్జెట్ కేటాయింపులు పెంచింది.

ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు పెట్టే ఖర్చులో దేశం మొత్తం మీద రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంది. 2004లో ప్రభుత్వం 33 లక్షలమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా అమలు చేస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో మరో 10 లక్షల మందికి కూడా ఉచితవిద్య అందించాలని నిర్ణయించింది.

ఇడుపులపాయ, నూజివీడు, బాసరలో రాజీవ్ ట్రిపుల్ ఐటీని ఏర్పాటుచేసి గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలున్న ఉన్నతవిద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు.అంతేకాక, విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ యూనివర్సిటీని ప్రారంభించేందుకు





కుల, మత, ధనిక, పేద వంటి తేడాలు లేవు, ఫీజు రియింబర్స్‌మెంట్‌తో ధనిక-పేద తారతమ్యమే సమసిపోయింది. చదువుకునేందుకు ఆసక్తి ఒక్కటే అర్హత. ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా యువతను ఉన్నత విద్యావంతుల్ని చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. 33 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటి) వంటి వాటితో గ్రామీణ, పట్టణ సరిహద్దులు చెరిగిపోయాయి. రాజీవ్ ట్రిపుల్ ఐటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 కోట్లు కేటాయించినందుకు యుజిసి కూడా ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

## ప్రవేశాల్లో ముందంజ

విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాల నిష్పత్తి జాతీయ సగటు 11.6 శాతం ఉండగా, మన రాష్ట్ర స్థాయిలో అది 14 శాతం ఉంది. 2003-2004 సంవత్సరంలో ఉన్నత విద్యకు రూ.887 కోట్లు కేటాయిస్తే, 2008-2009 సంవత్సరంలో తమ ప్రభుత్వం రూ. 1920 కోట్లు కేటాయించింది.

భూసేకరణ పూర్తయింది.మెదక్‌లో ఐఐటి,షామీర్‌పేటలో బిట్స్ పిలానీ కూడా అందుబాటులోకి వచ్చాయి. విద్యారంగానికి ఈ ఏడాదిలో 11 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించారు. ఇప్పుడు అమలు చేస్తున్న 33 లక్షల మందికి ఉచిత విద్య కార్యక్రమానికి రూ.2333 కోట్లు కూడా అదనంగా కేటాయించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఐదు సంవత్సరాల్లో కాలేజీల సంఖ్యను మూడువేల నుంచి ఆరు వేలకు పెంచారు. గతంలో 23 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉండగా, ఈ ఐదేళ్లలో 18 విశ్వవిద్యాలయాలలో కొత్తగా ఏర్పాటు చేశారు. అన్ని విశ్వ విద్యాలయాలలో 12 వేల మంది బోధనా సిబ్బంది ఉన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల దేశంలోనే విద్యలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది.

విజ్ఞాన విప్లవంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే నాయకత్వం వహిస్తోంది. నేడు విద్య అందరి హక్కు. భారత దేశ విద్యారంగంలో ఎన్నో తారతమ్యాలున్నాయి. కాని రాష్ట్ర విద్యా రంగంలో గ్రామీణ, పట్టణ,

## కమ్యూనిటీ కాలేజీలు

రాష్ట్రంలో కొత్తగా కమ్యూనిటీ కాలేజీలు ప్రవేశపెట్టి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో, కాలేజీల్లో సాయంకాలం కోర్సులను ప్రవేశ పెట్టారు. ఉద్యోగాలు చేసుకునే వారికి డిగ్రీ, డిప్లొమా కోర్సుల్లో చేరే అవకాశాలు విస్తృత పరిచి ఉపాది అవకాశాలు కల్పించే దిశగా కార్యాచరణను చేపట్టారు. జవహర్ నాలెడ్జ్ కేంద్రాలను కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. సొంత ఇంటిని, సొంత వారిని వదిలిపెట్టి మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలకోసం విదేశాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా రాష్ట్రంలోనే స్థిరపడే రోజు దగ్గరలోనే ఉంది. చైనా ప్రపంచ ఫ్యాక్టరీగా పేరు గడిస్తుంటే భారతదేశం ప్రపంచల్యాబ్‌గా రూపాంతరం చెందుతోంది.

# ఇబ్బడి ముబ్బడిగా పంట దిగుబడి

మంచి సాగుభూమి, జలవనరులు పుష్కలంగా వున్న ఆంధ్రప్రదేశ్‌లో 72 శాతం ప్రజలు పల్లె సీమల్లో నివసిస్తూ వ్యవసాయం - దాని అనుబంధ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రాష్ట్ర భూగోళిక విస్తీర్ణం 275.04 లక్షల హెక్టార్లలో 62.10 లక్షల హెక్టార్లు విస్తీర్ణం (22.6 శాతం) అటవీ భూమి. మొత్తం సాగుభూమి 1.36 కోట్ల హెక్టార్లు కాగా, అందులో 74 లక్షల హెక్టార్లలో ఆహారధాన్యాలను పండిస్తున్నారు. ఇందులో 43 లక్షల హెక్టార్లలో ఆహారధాన్యాలకు సాగునీటి సదుపాయం వుంది. ఆహారధాన్యాలలో తృణ-చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు మిళితమై వుంటాయి. తృణ ధాన్యాలలో వరి ప్రధానమైంది. పప్పుధాన్యాలలో కంది, పెసర, మినుము, శనగ పంటలు ముఖ్యమైనవి. నిత్యజీవితంలో ఈ ఆహారధాన్యాలు విరివిగా వాడుతూ వుంటారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దాలని ధృఢ సంకల్పంతో నీటి పారుదల రంగానికి అధిక ప్రాధాన్యత నిచ్చి రాష్ట్రంలో బహుకాలంగా పెండింగ్‌లో వున్న నీటిపారుదల ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్న సంకల్పంతో జలయజ్ఞం అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, ఇప్పటికే పన్నెండు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయగా, మరో పదమూడు ప్రాజెక్టుల నిర్మాణం చివరిదశలో వున్నాయి.

రాష్ట్రంలో వ్యవసాయరంగంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి మొత్తం మీద గణనీయంగా పెరిగింది. గత దశాబ్ద కాలంలో చూస్తే రాష్ట్రం మొత్తం మీద ఆహారధాన్యాల కింద ఉన్న విస్తీర్ణం 1999-2000 సంవత్సరంలో 71.40 లక్షల హెక్టార్ల నుంచి 2003-04 సంవత్సరంలో 68.07 లక్షల హెక్టార్లకు తగ్గి, ఈ ఐదు సంవత్సరాలలో 2.9 శాతం వ్యతిరేక వృద్ధి రేటు నమోదయ్యింది. కాగా 2004-05 సంవత్సరంలో మొత్తం ఆహారధాన్యాల క్రింద ఉన్న విస్తీర్ణం 62.66 లక్షల హెక్టార్లకు తగ్గినా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల విస్తీర్ణం క్రమక్రమంగా పెరుగుతూ 2008-09 సంవత్సరంలో 74.30 లక్షల హెక్టార్లకు పెరగటమే కాక ఈ ఐదు సంవత్సరాల కాలంలో మొత్తం మీద 3.8 శాతం కాంపౌడ్ అభివృద్ధి రేటు నమోదయ్యింది.

ఇక ఆహార ధాన్యాల ఉత్పత్తి విషయంలో సాగునీటి సౌకర్యం కల్పించడం వల్ల నైతేనేమి, రైతుచైతన్య యాత్రలు, పొలం బడి లాంటి కార్యక్రమాలు తగు సమయంలో నిర్వహించటం వల్ల సకాలంలో వర్షాలు పుష్కలంగా కురవడం వల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి 2008-09 సంవత్సరంలో రికార్డు స్థాయికి చేరుకుంది. గత దశాబ్ద కాలంలో చూసినట్లయితే 1999-2000 సంవత్సరంలో రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 136.97 లక్షల మెట్రిక్ టన్నులు వుండగా 2002-03 సంవత్సరంలో 106.56 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గి 2003-04 సంవత్సరంలో తిరిగి 136.97 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగినా ఈ ఐదు సంవత్సరాలలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో 4 శాతం వ్యతిరేక వృద్ధిరేటు నమోదయ్యింది. 2004 సంవత్సరంలో ప్రభుత్వం రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, అన్నదాతగా పేరొందిన రైతన్నకు

**రాష్ట్రంలో ఆహారధాన్యాల కిందవున్న విస్తీర్ణం, ఉత్పత్తి**

| సంవత్సరం | విస్తీర్ణం (లక్షల హెక్టార్లు) | ఉత్పత్తి (లక్షల మెట్రిక్ టన్నులు) |
|---|---|---|
| 1999-2000 | 71.40 | 136.97 |
| 2000-01 | 76.73 | 160.27 |
| 2001-02 | 70.56 | 148.36 |
| 2002-03 | 62.89 | 106.56 |
| 2003-04 | 68.07 | 136.97 |
| 2004-05 | 62.66 | 133.94 |
| 2005-06 | 71.68 | 169.50 |
| 2006-07 | 72.74 | 162.29 |
| 2007-08 | 73.87 | 198.17 |
| 2008-09 | 74.30 | 204.04 |

బాసటగా నిలవడం వల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి 2008-09 సంవత్సరంలో కనీవినీ ఎరుగని రీతిలో 204.04 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగటమే కాకుండా, ఈ ఐదు సంవత్సరాలలో మొత్తం మీద రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో 10.5 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. గమనించదగ్గ విశేషమేమంటే, ఆహారధాన్యాలలో ప్రధాన పంట అయిన వరి విస్తీర్ణంలో 1999-2000 నుండి 2003-04 వరకు గల ఐదు సంవత్సరాల కాలంలో మొత్తం మీద 9.6 శాతం వ్యతిరేక వృద్ధిరేటు నమోదు కాగా, 2004-05 నుండి 2008-09 వరకు గల ఐదు సంవత్సరాల కాలంలో వరి విస్తీర్ణంలో 7.2 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. వరి ఉత్పత్తిలో కూడా 1999-2000 నుండి 2003-04 వరకు గల ఐదు సంవత్సరాల కాలంలో 8.4 శాతం వ్యతిరేక వృద్ధి రేటు నమోదుకాగా 2004-05 నుండి 2008-09 వరకు గల కాలంలో వరి ఉత్పత్తిలో 9 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది.

పై విశ్లేషణ బట్టి గమనిస్తే రాష్ట్రంలో వ్యవసాయరంగంలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందనటంలో ఏమాత్రం సందేహం లేదు. సకాలంలో సమర్థవంతంగా వ్యవసాయ పనులు చేపట్టటానికి పనిముట్లు, యంత్రాలు అవసరం. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు చేయూతనిచ్చేందుకు సహకార సాగు పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు ఈ రకమైన సహకార సేద్యంలో గల లాభాలను విపులంగా తెలియచెప్పాలి. అందునా ముఖ్యంగా సన్న, చిన్న కారు రైతులకు సహకార సాగులో పాల్గొనేందుకు ప్రోత్సహించాలి. ఈ చర్యలు చేపట్టటం వలన రాష్ట్రం అతి తొందరలోనే హరితాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోవడం తథ్యం.

– రాధా కృష్ణ

# మామిడి కొత్త చిగుళ్ళపై చీడపీడలు ఆశిస్తాయి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత కొన్ని సంవత్సరములుగా పండ్లతోటల పెంపకం పైన అన్ని రకాలైన ప్రోత్సాహకాలు అందిస్తున్నది. కొత్తగా మామిడి తోటలు వేసే రైతాంగానికి జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలను ఉచితంగా ఇవ్వడం, గుంతలు తీసుకోడానికి, నాటుకోవడానికి అయ్యే ఖర్చును అందచేయడం, అలానే మొక్కలు కాయ దశకు వచ్చేవరకు ఎరువులను, పురుగు మందులను కూడా ఉచితంగా అందచేయడం, డ్రిప్ పెట్టుకొనే రైతాంగానికి అయ్యే ఖర్చులో 75-90 శాతం వరకు సబ్సిడీ ఇవ్వడంలాంటివి చేస్తున్నారు. ఈ ప్రోత్సాహకాల వలన గత ఐదు సంవత్సరాలుగా మన రాష్ట్రంలో మామిడి విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. విస్తీర్ణం పెరగడంతో పాటు చీడపీడల సమస్యలు కూడా పెరిగాయి.

ముఖ్యంగా తొలకరిలో కొత్త చిగుళ్ళు వచ్చే సమయంలో మామిడి మొక్కలను అనేకమైన పురుగులు, తెగుళ్ళు ఆశించి నష్టపరుస్తున్నాయి. వీటిని నిఘా వేసి ముందుగానే గుర్తించి సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఆకులను ఆశించే పురుగులు, కొన్ని ఆకుల నుండి పత్రహరితాన్ని గోకి తినడం వలన, రసాన్ని పీల్చడం వలన లేదా పూర్తిగా ఆకులను తినివేయడం వలన లేత మొక్కలు బలహీనమై గిడసబారిపోతాయి. అదే పెరిగిన చెట్లైతే ఆకులు నష్టపోవడం వల్ల, కొత్త కొమ్మలు గట్టిపడక పోవడం, డిసెంబరు మాసంలో పూతపై కోత సరిగా రాకపోవడం జరుగుతుంది.

లేతాకులనాశించే పురుగులలో ముఖ్యమైనది ఆకు కత్తిరించే ముక్కు



పురుగు. ఇవి నర్సరీలోను, కొత్తగా నాటిన మొక్కలలోను ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ పురుగు రాత్రి వేళల్లో ఆకులను కత్తిరించి భూమిలోనికి వెళ్ళిపోతాయి. మరుసటిరోజు ఉదయాన మొక్క మొదలు దగ్గర చూసినట్లైతే సగం కత్తిరించిన ఆకులు మొక్క చుట్టూ కనిపిస్తాయి. నలుపు గోధుమ రంగులో లేదా బలపపు రంగులో పొడవాటి మూతి వున్నటువంటి పెంకు పురుగులు లేత ఆకుల క్రింద భాగంలో గ్రుడ్లు పెట్టి తొడిమ దగ్గర రెండు అంగుళాలు వదిలి ఆకులను కత్తిరిస్తాయి. కత్తిరింపబడి క్రింద పడిపోయిన ఆకులను ఏరి నాశనం చేసినట్లైతే, గ్రుడ్లను నాశనం చేసి తరువాత సంతతిని అభివృద్ధి చెందకుండా జాగ్రత్త పడవచ్చు. వీటి తల్లి పురుగులు భూమిలో వుంటాయి కనుక, భూమిలో వేప పిండిని వేసి కూడా వీటి బెడద కొంతవరకే తగ్గించవచ్చును. వీటి ఉధృతి ఎక్కువగా వున్న తోటలలో 10 శాతం ఫాలిడాల్ పొడిని మొక్కల కాండం చుట్టూ పాదులో కలగలిపి వేసుకోవాలి. ఆ పై కార్బరిల్ పొడిమందును 3 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.




ఇవే చర్యలను చేపట్టి చీడ పురుగులను కూడా నివారించుకోగలరు. ఇవి కూడా ఎరుపు లేక ముదురు గోధుమ రంగులో వుండి లేత ఆకులపై గ్రుడ్లు పెడతాయి. కాని ఆకు కత్తిరించే పురుగు కన్నా చిన్న పరిమాణంలో వుంటాయి. వీటి పిల్ల, తల్లి పురుగులు గుండ్రంగా వుండే జల్లెడలాంటి చిన్న చిన్న రంధ్రాలు చేయడం వల్ల ఆకులు వడలి రాలిపోతాయి.

యాజమాన్యం సరిగ్గా లేని తోటలలో తరచుగా ఆకు జల్లెడ (గూడు) పురుగు ఆశిస్తుంది. కోత అనంతరం తీసుకోవలసిన కత్తిరింపు చర్యలు చేయనటువంటి, చెట్ల మధ్య అంతర కృషి చేయక కలుపు బాగా పెరిగినటువంటి తోటలలో ఎక్కువగా కనిపిస్తుంది. వీటి పిల్ల పురుగులు ముదురాకులను దగ్గరగా చేర్చి సిల్కు దారాలతో గూళ్ళు చేసుకొని అందులో వుంటూ పత్రహరితాన్ని తింటూ ఈనెలను మిగిల్చి నిద్ర దశకు చేరుతాయి. వీటి ఉధృతి ఆగస్టు నుండి అక్టోబరు నెలల్లో ఎక్కువగా వుంటుంది.

కాబట్టి చెట్టుకు రెండు మూడు గుళ్ళు గమనించినపుడే పొడవాటి వెదురు బొంగుకు ఇనుము కొక్కెం తగిలించి గూళ్ళను కదిలించి తీసివేయాలి. తీవ్రత ఎక్కువగా కనిపించినట్లైతే క్వినాల్ ఫాస్ (2 మి.లీ) లేదా కార్బరిల్ (3 గ్రా.) లేదా క్లోరోపైరీ ఫాస్ (2.5) మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

అప్పుడప్పుడు చెట్ల క్రింద లేత ఆకులు తొడిమతోపాటు రాలిపడిపోయిన దృశ్యం కనిపిస్తుంది. వీటిపై తెల్ల పొరలు కనిపించినట్లైతే ఇవి ఆకు తొలుచు పురుగు చేసే నష్టంగా గుర్తించాలి. ఆకుసార పురుగు లేక ఆకు తొలుచు పురుగు లేతాకులు ముదిరే దశలో ఎక్కువగా కనబడుతుంది. ఈ పొరలు, లేత తొడిమలు, కాండం చివర్ల మీద కూడా గమనించవచ్చు. వీటి రెక్కల పురుగు ఆకు పొరలలో గ్రుడ్లు పెడతాయి. వీటి నుండి వెలువడే పసుపు పచ్చ లేదా ఎరుపు రంగు పిల్లపురుగులు ఆ పొరలలో పత్ర హరితాన్ని తింటూ నిద్రావస్థకు చేరుతాయి. తీవ్రతను బట్టి ఆకుపై ఒకటినుండి 4-5 పొరలు వుండటం వలన ఆకులు ఎండి రాలిపోతాయి.

వీటిని నివారించటానికి మోనోక్రోటోఫాన్ (1.6 మి.లీ) లేదా డైక్లోరావాస్ (1మి.లీ) లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

లేత ఆకులపై చిన్న, పెద్ద బుడిపెలు కనిపించినట్లైతే ఇవి ఆకు బుడిపెలు కలిగించే, 3-4 మి,మీ పొడవుగల ఈగ జాతికి చెందిన పురుగులు వలన కలిగిందని గుర్తించవచ్చు. వీటి తీవ్రత ముఖ్యంగా లేత తోటల్లో కనిపిస్తుంది. తల్లి పురుగుల కొత్త ఇగుర్ల పైనుండే ఆకుల అడుగు భాగాన ఆకు పొరల్లో 150- 200 గ్రుడ్లు పెడతాయి. వీటి పిల్ల పురుగులు ఆకులోని కణజాలాన్ని తినటం వల్ల బుడిపెలు ఏర్పడతాయి.

రెండు రకాలైన బుడిపెలను ఆకులపై గమనించవచ్చు. కొన్ని చిన్నవిగా వుండి ఆకంతా ఎక్కువ సంఖ్యలో వ్యాపించడం వల్ల కిరణ జన్య సంయోగక్రియకు అంతరాయం కలిగిస్తుంది. దీని వల్ల మొక్క పెరుగుదల మందగించి ఎక్కువ నష్టం కలుగుతుంది. రెండవ రకం బుడిపెలు పెద్దవిగా ఈ నేలపై మాత్రమే ఏర్పడి ఆకులు వంకర తిరిగి ఎండి రాలిపోతాయి. ఈ రెండు రకాలైన బుడిపెలు గమనించిన వెంటనే ఆకులను కత్తిరించి తీసివేసి, పురుగులు వ్యాపించకుండా మోనోక్రోటోఫాస్ (1.6 మి.లీ) లేదా డైమీథోయేట్ (2 మి.లీ) ఒక లీటరు నీటిలో కలిపి లేత ఆకులపై పిచికారి చేయాలి.

తోటలో వచ్చిన లేత చిగుళ్ళు వడిలిపోయినట్లు కనిపించినట్లైతే రెమ్మ లేక కొమ్మ తొలిచే పురుగు ఉన్నట్లు గుర్తించాలి. వీటి తల్లి పురుగు ఆకుల ఈనెలపై ఒక్కొక్క గ్రుడ్డు మాత్రమే పెడుతుంది. గ్రుడ్డు నుండి వెలువడిన లద్దె పురుగులు ఈనెలనుండి చిరుకొమ్మలలోకి రంధ్రం చేసి లోపల తొలిచి తింటూ సొరంగం చేస్తుంది. దీని వల్ల చిగుళ్ళకు నీరు, పోషకాలు అందక వడలిపోతాయి. ఆశించిన కొమ్మలపై పురుగు చేసిన రంధ్రం నుండి పురుగు విసర్జించిన మలం వెలుపలకి రావడాన్ని గమనించవచ్చు.

ఈ పేర్కొన్న లక్షణాలు కలిగిన కొమ్మలను గుర్తించి, పురుగు చేసిన రంధ్రం నుండి ఒక అంగుళం క్రింద వరకు కత్తిరించి నాశనం చేయాలి. ఆ పై పురుగు వ్యాప్తిని అదుపు చేయడానికి క్వినాల్ఫాస్ (2 మి.లీ) లేదా మోనోకోటాఫాస్ (1.6 మి.లీ) లీటరు నీటిలో కలిపి లేత కొమ్మలు తడిసేలా పిచికారి చేయాలి.



మామిడి కోత సమయంలో ఎక్కువగా కనిపించే పిండి నల్లి, కోత అనంతరం తీసుకోవలసిన కత్తిరింపుల చర్యలు కాని, చెట్లమధ్య దున్ని కలుపు నివారణ చర్యలు కాని చేయనట్లైతే కొత్తగా వచ్చే లేత చిగుళ్ళపైకి పాకి మొక్కల ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతుంది. వీటి తల్లి పురుగులు చెట్ల క్రింద మట్టిలో గ్రుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు కాండం మీద ప్రాకుకుంటూ చెట్టు పైకి పోయి లేత ఆకుల నుండి, రెమ్మలనుండి రసాన్ని పీల్చి మొక్కను బలహీనపరచడమే కాకుండా దిగుబడిని తగ్గిస్తుంది. అంతేకాక ఇవి తేనెలాంటి జిగురు పదార్థాన్ని విసర్జించడం వల్ల ఆకులపై మసితెగులు వృద్ధి చెందుతుంది.

చిన్న మొక్కలలో పిండినల్లి కనిపించి నట్లైతే, ఆశించిన ఒకటి రెండు కొమ్మలను, ఆకులను కత్తిరించి, కాల్చి నాశనం చేయాలి. పెద్ద చెట్లకైతే కాండం మొదలుకు ఒక అడుగు వెడల్పులో ప్లాస్టిక్‌ను చుట్టినట్లైతే పిల్ల పురుగులు పైకి పాకకుండా నివారించవచ్చు. కొద్ది పాటిగా ఆశించిన పిండినల్లిని డైక్లోర్వాస్ (1మీ.లీ) కాని అసిఫేట్ (1.5గ్రా) లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకొని నివారించగలరు పిండినల్లి అనేక కలుపు మొక్కల ను కూడా ఆశించి వ్యాపిస్తుంది. కనుక, కలుపు నివారణ పై రైతులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి.

సాధారణంగా రసం పీల్చే పురుగులను గానీ, ఆకు లేక రెమ్మ లోపల దాగియుండి పత్రహరితాన్ని తినే పురుగులకు అంతర్వాహిక ఉదరం ఆవిరి చర్యతో పనిచేసే రసాయన మందులైన మోనోక్రోటోఫాస్ (1.6మి.లీ) కాని డైమిథోయేట్ (1.మి.లి) లేదా అసిఫేట్ (1.5గ్రా) లేదా క్లోరాపైరీఫాస్ (2.5మి.లి) లేదా క్వినాల్ఫాస్ (2 మి.లీ) ఒక లీటరు నీటికి కలిపి మారి ్చ మార్చి పిచికారి చేసుకొని నివారించుకోవచ్చు.

ఆకులను కత్తిరించి తినేటువంటి ముక్కు పురుగులు, లద్దెపురుగుల నివారణకు స్పర్శ చర్యవలన పనిచేసే కార్బరిల్ (3 గ్రా) లేదా మీథైల్ పరాదియాన్ (1.5మి.లీ) లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ క్రిమి సంహారక మందులతో పాటు జిగురులాంటి సబ్బు ద్రావణాన్ని (స్టికర్) లీటరుకు 0.5మి.లీ చొప్పున వాడినట్లయితే పురుగులను సమర్థవంతంగా అదుపు చేయవచ్చు.


- డా॥ వి.అనిత, ఆర్.బాలాజీ నాయక్, ఆర్.సుధాకర్ రెడ్డి
ఎలక్ట్రానిక్ మీడియావింగ్, ఎ.ఆర్.ఐ.
ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్

# పీఠికా పాటవం


*ఆది కవి నన్నయతోనే 'అవతారిక' ఆవిర్భవించింది. అచ్చుయంత్రం వచ్చాక పరిష్కర్తలు, ప్రచురణకర్తలు వచ్చారు. కొన్నాళ్ళ వరకు పీఠికలు వ్రాయించ బాధ్యత ప్రచురణకర్తలే వహించారు. ప్రాచీన గ్రంథాలలో చాలావాటికి తంజవరం తేవప్పెరుమాళ్ళయ్య, నాగపూడి కుప్పసామయ్యగారు ఆలోకన ను అందించారు. తర్వాత కాలంలో ఎవరి గ్రంథాలకు వారే పీఠికలు వ్రాసుకోవడం. లేదా వారికి ఇష్టమైన వారిచేత వ్రాయించుకోవడం ఆనవాయి అయింది. గ్రంథాన్ని అనుసరించి ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వారిని సహజంగా ఈ పీఠిక వ్రాయడానికి నియమించడం జరుగుతూ వుంటుంది ఇందులో మొగమాటాలు, ముఖపరిచయాలు వగైరా వున్నా వుండవచ్చు.*

*కొందరు ప్రముఖ రచయితల పీఠికల బాణీలు ఎలా వుంటాయో చూద్దాం:*

*సర్వశ్రీ అనే అభ్యుదయ కవి తన వచన కవితా సంపుటికి పీఠిక వ్రాయండని కోరినపుడు - ఆయా ప్రముఖుల ఆముఖాలు ఎలా వుంటాయి అనేది ఈ పేరడీకి వస్తువు.*

## పరనింద

తనకు ఇష్టమైతే విపరీతంగా పొగడడం, కానపుడు నిష్కర్షగా తెగడడం విశ్వనాథ గారు తన పీఠికలలో చేస్తారు. తనకు, రచయితకు గల సంబంధ బాంధవ్యాలను వారు అందులో ఉటంకించకుండా వుండరు. వారి ఆలోచనా క్రమం:




సర్వశ్రీ గారి గ్రంథమును జూచితిని, చదివితిని. నా వద్దకు బరిచయ వాక్యముల నర్థించుచు వచ్చెడి వారి సంఖ్య యధికము. బహుశ నేడాంధ్ర దేశమున నాకు గల పేరు ప్రతిష్ఠలు అందుకు కారణము గావచ్చును.

వెలనాటి బ్రాహ్మణులలో కొందరు మంచి కవులే వున్నారు. వీరి తండ్రిగారిని నేనెరుగుదును. ఆ మొగమాటము చేతనే కాదనలేకపోతిని. ఆయన అవధానములు చేసెడివాడు. మంచి ధారాశుద్ధి యున్నది. కనుక వీరు బండిత పుత్రులు.

సర్వశ్రీ అనునది వీరి అజ్ఞాత నామము, జ్ఞాత నామము వేరుగా యున్నది. దానితో మనకు బని లేదు. వీరి గ్రంథములో ఛందోబద్ధమైన పద్యములు కానుపించవు. పద్యమనగా నేమి? అది గణ యతి ప్రాసల చేత నిబద్ధమైన యొక ఛంద:ఖండము, అందు భావము నిక్షిప్తము కావలె. అందు కొన్ని వాక్యములు ఉండును. వాక్యమునందు శబ్దములుండును. అచ్చులయు, హల్లులయు కూడిక శబ్దము. మేము నిబద్ధుల ము కాము. అనబద్ధులమని కొందరల్ప ప్రతిభావంతులు ప్రేలుచున్నారు. ఇట్టివారికి బఱితల సంఖ్య నేడధికముగనే యున్నది. కావుననే దేశమున కీ దుర్యోగము పట్టినది.

వీరికి రాదగిన కీర్తి పరమేశ్వరుడు తెచ్చును గాక!

☆




## ఆత్మస్తుతి

"అతిక్రమించి మామూలు మర్యాదల్ని అభినందించుకుంటాను నన్ను నేను" అని స్వయంగా చెప్పుకున్న కుందుర్తి గారి పీఠికలలో స్వోత్కర్ష వున్నదని యెవరైనా అంటే అదేమీ గొప్ప అన్వేషణ కాబోదు. వారి పీఠికా పాటవం:



'కొన్నాళ్ళ క్రితం వీర్రాజుగారి కొడిగట్టిన సూర్యుడు' కి ఆముఖం వ్రాస్తూ నేను యిలా అన్నాను - "తీసిన కొద్దీ అర్థాలు రావడం కవిత్వానికి సహజ లక్షణం. అయినా కావ్యంలో సందేశం కొంతలో కొంత స్పష్టంగా వుండాలనే నా మతం... అభ్యుదయోద్యమం విజృంభించిన రోజులలో ఆదర్శమనే దానికి అధిక ప్రాధాన్యం వచ్చి కవిత్వపు విలువలను నిర్లక్ష్యం చేయడం జరిగింది.

ఇప్పుడూ నేను అదేమాట అంటున్నాను. వచనకవిత్వంపై సాధికారంగా చర్చించగల వొకరిద్దరిలో నేనొకడినని నమ్మేవారిలో నేను వొకణ్ణి. ఫ్రీవర్స్ ఫ్రంట్‌ని స్థాపించి వుండకపోతే నేడు తెలంగాణాలో వచనకవితకు ఇంత ప్రాచుర్యం వుండేది కాదనేది సర్వజనాంగీకారం. ఇలాంటి అర్హతలు కొన్ని వుండబట్టే నేను 'కవిత్వాన్ని జాతీయం చేశాం' అనే గుత్తాధికారం తీసుకుని ప్రకటించడం జరిగింది.

సర్వశ్రీ గారిని ప్రత్యేకంగా నేడు తెలుగువారికి పరిచయం చేయాల్సిన అగత్యం లేదని నాకు తెలుసు అయినా ఈ పీఠికా ప్రక్రియను అభ్యుదయ కవితా సిద్ధాంతాల ప్రచారానికి పదునైన సాధనంగా మలుచుకున్నాను కనుక స్వార్థంతోనే దీనికి అంగీకరించాను.....'

☆

# నవంబర్ 1 నుంచి 'వై.యస్.ఆర్. అభయ హస్తం'

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'అభయహస్తం' పథకం అమలుకు సిద్ధమైందని, స్వయం సహాయక సంఘాల మహిళలకు నవంబర్ 1 నుంచి 'అభయహస్తం' విధానపత్రాలను పంపిణీ చేస్తున్నామని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ వట్టి వసంతకుమార్ చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వై. యస్. రాజశేఖరరెడ్డి ఎంతో ఇష్టపడి ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఆయన పేరే పెట్టి, వై.యస్.ఆర్. అభయహస్తంగా వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ ఒకటి నాటికి కోటి మంది మహిళలకు పెన్షన్ బాండ్లు అందించే లక్ష్యంతో జూన్ 22న ప్రారంభమైన సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ జూలై 21 వరకు కొనసాగింది.

రాష్ట్రంలో 60 ఏళ్లు దాటిన ఏ ఒక్క మహిళా ఇతరులపై ఆధారపడకూడదని, వారికి ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యం ఉండాలన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి రూపుదిద్దిన 'అభయహస్తం' పథకం కార్యరూపం దాల్చనుంది. నాలుగున్నర లక్షల మంది మహిళలకు వైఎస్సార్ అభయహస్తం పథకం కింద నవంబర్ నెల ఒకటో తేదీ నుంచి ప్రతీ నెలా 500 రూపాయల పింఛన్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల్లోని 72 లక్షల మందికిపైగా మహిళలు ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారు. కనీసం పది సంవత్సరాలు వాటా చెల్లించిన వారే పింఛన్‌కు అర్హులు. సభ్యులుగా నమోదైన వారిలో నాలుగున్నర లక్షల మందికి 60 ఏళ్లు వయస్సు దాటింది. వారు పదేళ్లకు చెల్లించాల్సిన వాటా రూ. 3,650 చెల్లించడంతో పింఛన్‌కు అర్హత సాధించారు.



### ఏ వయస్సులో చేరితే ఎంత పింఛన్ వస్తుంది...

| వయస్సు | 60 ఏళ్లకి జమయ్యే కార్పస్ ఫండ్ | నెలవారి పెన్షన్ (రూ.) |
|---|---|---|
| 18 | 2,62,959 | 2,118 |
| 25 | 1,41,890 | 1,143 |
| 30 | 90,238 | 727 |
| 35 | 56,419 | 625 |
| 40 | 34,275 | 600 |
| 45 | 19,777 | 575 |
| 50 | 10,284 | 550 |
| 55 | 5,894 | 525 |
| 60 | 3,650 | 500 |

అర్హులైన 4.5 లక్షల మందికి నెలనెలా పింఛన్ పంపిణీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. నవంబర్ ఒకటో తేదీనే మహిళలకు పింఛన్ బాండ్లు పంపిణీ చేస్తారు. వైయస్‌కు ఎంతో ఇష్టమైన చేవెళ్ల నుంచే ఈ పథకాన్ని శ్రీ రోశయ్య ప్రారంభించనున్నారు. అదే సమయంలో అన్ని జిల్లాల్లోనూ ఇన్‌చార్జి మంత్రులు పథకాన్ని ప్రారంభిస్తారు.

మండల స్థాయిలో ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు బాండ్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఒకసారి మంజూరు చేస్తే జీవితాంతం పెన్షన్ ఇవ్వాల్సి ఉన్నందున లబ్ధిదారులను జాగ్రత్తగా ఎంపిక చేయాలని, ఎలాంటి పొరపాట్లు చేయకూడదని చెప్పారు.

పింఛన్ల మంజూరు బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. మధ్యదళారీల దందా లేకుండా బయోమెట్రిక్ పద్ధతిలో లబ్ధిదారుల పేర్లతో బ్యాంకుల్లో అకౌంట్లు తెరవాలని శ్రీరోశయ్య సూచించారు. ఈ పథకం కోసం భారతీయ జీవిత బీమా సంస్థతో ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు.

సమావేశంలో సీయం ముఖ్యకార్యదర్శి శ్రీ కొప్పుల రాజు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ ఎంవీపీసీ శాస్త్రి, సెర్ప్ సీఈవో శ్రీ విజయ్‌కుమార్, వై.యస్.ఆర్ అభయహస్తం ప్రత్యేక అధికారి శ్రీ బి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– జి.ఎస్.

Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**



# గ్రామీణ కథలు, హాస్యకథల పోటీ

సాహిత్య ప్రక్రియల్లో కథ స్థానం కథదే. అయితే, రాను రాను హృదయాన్ని తాకే మంచి కథలు కరువయిపోతున్నాయి. అందువల్ల మంచి కథకి పట్టం కట్టాలని 'స్థానిక పాలన' పత్రిక నిర్ణయించింది.

ఈ సందర్భంగా గ్రామీణ కథలు, హాస్య కథలు అనే రెండు విభాగాల్లో పోటీ నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యం ఉండి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే కథలు ఒక విభాగంలోను, హాస్య కథలను మరొక విభాగంలోను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

## బహుమతుల వివరాలు

*రెండు విభాగాలకు విడివిడిగా ఈ కింద పేర్కొన్న బహుమతులుంటాయి.*

| | |
|---|---|
| ఉత్తమ గ్రామీణ కథ | రూ.15, 000 |
| ఉత్తమ హాస్య కథ | రూ.15, 000 |
| ద్వితీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ.10,000 |
| ద్వితీయ ఉత్తమ హాస్య కథ | రూ.10,000 |
| తృతీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ. 8,000 |
| తృతీమ ఉత్తమ హాస్య కథ | రూ. 8,000 |
| ప్రతి విభాగంలో మూడు కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్క కథకి) | రూ. 5,000 |
| సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ, హాస్య కథలకు | రూ. 2,000 |

## గ్రామీణ, హాస్య కథల పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ కింది సూచనలను గమనించాలి:

☆ కథలు కింద పేర్కొన్న చిరునామాకు డిసెంబర్ 1వ తేదీ లోగా అందే విధంగా పంపాలి.

☆ ఒక్కొక్కరు ఎన్ని కథలయినా పంపవచ్చు ☆ రెండు విభాగాల పోటీలలోను పాల్గొనవచ్చు.

☆ కథ రాతప్రతి మీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.

☆ కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 6 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటం సాధ్యపడదు.

☆ పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా, స్పష్టంగా రాయాలి.

☆ సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమతాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా ఉండే కథలు పంపాలి.

☆ పోటీకి పంపే కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలు, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.

☆ ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథలను త్రిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జతచేయాలి.

☆ న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.

☆ ఎంపికైన కథలు 'స్థానిక పాలన' పత్రికలో ప్రచురితమవుతాయి.

☆ ఫలితాలను జనవరి 2010 'స్థానిక పాలన' పత్రికలో చూడవచ్చు.


*చిరునామా:*

ఎడిటర్, **'స్థానిక పాలన'**

ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500 030.

ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ఫోన్: 040-24018656, ఫ్యాక్స్: 040-24017005


E-mail: phanikumar@ap.gov.in

APTEL / 2009/27888

# 16వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం

**హైదరాబాద్‌లో**

**నవంబర్ 14 నుంచి 20 తేది వరకు**



Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.